
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 303

సోమవారం 17-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అల్‌కరాజ్ అద్భుతం

వింబుల్డన్ ఫైనల్లో జొకోవిచ్‌పై విజయం సాధించిన స్పెయిన్ ప్లేయర్ - 12లో



భారం తగ్గే దారేది?

రుణంపై ఇంటిని సమకూర్చుకునేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం -13లో



శరద్ పవార్‌తో అజిత్ భేటీ

ఎన్సీపీని ఐక్యంగా ఉంచాలని ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వర్గం కోరింది.

వివరాలు 6లో ▶



మధ్యప్రదేశ్‌లో గ్యాంగ్‌రేప్

మధ్యప్రదేశ్‌లో ఓ యువతిపై నలుగురు అత్యాచారం చేసి.. ఆమె చెల్లెల్ని వేధించారు. నిందితుల్లో బీజేపీ నేత కుమారుడు ఉన్నాడు.

వివరాలు 6లో ▶



స్పెయిన్‌లో కార్చిచ్చు..

స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో కార్చిచ్చు చెలరేగింది. సుమారు 11 వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని మంటలు దహించి వేశాయి.

వివరాలు 6లో ▶



ఆ బాంబులు మా దగ్గర ఉన్నాయి

ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన విధ్వంసకర క్లస్టర్ బాంబులు తమ వద్ద కూడా ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.

వివరాలు 6లో ▶

ఏది నిజం?

ఈ భరోసా ఇంకెక్కడైనా ఉందా?

- విత్తు నుంచి విక్రయం వరకూ రైతును నడిపిస్తున్నది ఇక్కడే
- గ్రామగ్రామాన 10,778 ఆర్బీకేలతో అన్నదాతకు అండ
- రైతులు మరణిస్తే పరిహారం వచ్చేలా తెలంగాణలో బీమా
- ఇక్కడ రైతు పైసా చెల్లించకుండా ప్రతి ఎకరాకూ, పంటకూ బీమా
- ఈ నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్ల పరిహారం
- ఏ సీజన్లో నష్టం జరిగితే... ఆ సీజన్ మళ్లీ వచ్చేలోగా పరిహారం చెల్లింపు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే.. ఆ సీజన్ ముగిసేలోపే ఇన్‌పుట్ సబ్సిడీ.. ఈ నాలుగేళ్లలో రూ.1,965 కోట్లు చెల్లింపు
- ఇన్ని చేస్తున్నా... వాస్తవాలకు ముసుగేస్తూ 'ఈనాడు' దుర్మార్గపు కథనాలు

- వివరాలు 4లో

వ్యవ'సాయం' భేష్

అన్నదాతకు ప్రతి అడుగులో అండగా ఏపీ ప్రభుత్వం

ఆర్బీకేలతో గ్రామాల్లోనే రైతులకు సేవలు ప్రశంసనీయం

- సాగు వ్యయం, ధరల కమిషన్ చైర్మన్ విజయ్‌పాల్ శర్మ
- ఇలాంటి అద్భుత వ్యవస్థను ఇంకెక్కడా చూడలేదు
- దేశవ్యాప్తంగా అనుసరించాలని కేంద్రానికి సూచిస్తాం
- ఐసీసీ కాల్‌సెంటర్, ఆర్బీకే ఛానల్ వినూత్నం
- జాతీయ స్థాయిలో కిసాన్ కాల్ సెంటర్లున్నా ఈ స్థాయిలో సేవలు అందడం లేదు
- నాణ్యమైన ఉత్పాదకాల కోసం అగ్రి ల్యాబ్స్ భేష్
- కియోస్క్‌ల ద్వారా వాతావరణ సమాచారం బాగుంది
- గండిగుంట ఆర్బీకే కేంద్రం, కంకిపాడు అగ్రి ల్యాబ్ సందర్శన
- రైతులను కలుసుకుని సేవలపై స్వయంగా ఆరా తీసిన సీఏసీపీ చైర్మన్



కృష్ణాజిల్లా గండిగుంటలో ఆర్బీకే పని తీరును తెలుసుకుంటున్న సీఏసీపీ చైర్మన్ విజయ్‌పాల్

సాక్షి, అమరావతి: అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తూ వ్యవసాయ విధానాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్న మార్పులకు నాంది పలికిందని సాగు వ్యయం, ధరల కమిషన్ (సీఏసీపీ) చైర్మన్ ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ ప్రశంసించారు. ఆర్బీకేలతో గ్రామ స్థాయిలో రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శం, అనుసరణీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చర్చనీయంగా మారిన ఆర్బీకేలు తాను విన్నదాని కంటే మరింత గొప్పగా ఉన్నాయని కితాబిచ్చారు. జాతీయ స్థాయిలో కిసాన్ కాల్ సెంటర్లు ఉన్నా ఏపీ స్థాయిలో సేవలందించడం లేదన్నారు. 'వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నిజంగా ఓ అద్భుతం.. నాకు తెలిసి ఇలాంటి వ్యవస్థ దేశంలోనే కాదు... ప్రపంచంలోనే ఎక్కడా లేదు' అని తెలిపారు. దేశవ్యాప్తంగా పంటల కనీస మద్దతు ధరలపై కేంద్ర ప్రభుత్వానికి

మిగతా 2వ పేజీలో ▶

ఎంబీబీఎస్ అన్ రిజర్వుడ్ సీట్లు

ఏపీ విద్యార్థులకే

దంత వైద్య కోర్సుల్లోనూ అవకాశం

- 2014 జూన్ 2 తర్వాత ఏర్పడ్డ కళాశాలల్లో వర్తింపు
- అలాగే కొత్తగా మంజూరైన సీట్లలో సైతం
- ఇక 100 శాతం రాష్ట్ర కోటా సీట్లు మన విద్యార్థులకే
- ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ అన్ రిజర్వుడ్ సీట్లు ఏపీ విద్యార్థులకే లభించనున్నాయి. 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటైన ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ వైద్య, దంత కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో వంద శాతం ఏపీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల నిబంధనల్లో సవరణలు చేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. యూజీ, పీజీ కోర్సుల్లో 100 శాతం కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లను ఏపీ విద్యార్థులకు కేటాయించాలని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కోరారు. ఈ క్రమంలో మన విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. దీంతో 2014 జూన్ 2 తర్వాత ఏర్పడ్డ వైద్య కళాశాలలతోపాటు కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను సైతం ఏపీ విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. ఈ కళాశాలల్లో అన్ రిజర్వుడ్ సీట్లు కూడా మనకే దక్కనున్నాయి.

ఇప్పటివరకు ఇలా..

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం సీట్లలో 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తున్నారు. మిగిలిన సీట్లను రాష్ట్ర కోటా కింద ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తోంది. కాగా, ఆల్ ఇండియా కోటాకు పోగా మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక, 15 శాతం అన్ రిజర్వుడ్ విభాగాల కింద

మిగతా 2వ పేజీలో ▶



ఉత్తర ఒడిశాపై అల్పపీడనం

19న బంగాళాఖాతంలో మరొకటి

ఆపై వాయుగుండంగా బలపడే అవకాశం.. 18 నుంచి కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, గంగా పశ్చిమ బెంగాల్ తీరాలపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్ఫిరిక్ స్థాయిల వరకు విస్తరించి నైరుతి వైపు వంగి ఉంది. ఇది రెండురోజుల్లో

మిగతా 2వ పేజీలో ▶




పార్టీనే కొత్త.. అధ్యక్షుడు కాదు కదా సార్!

పెద్ద కష్టం తీరింది

సర్వీస్ ఈనాం భూములపై సర్వ హక్కులు

నిషేధిత జాబితా నుంచి 1.68 లక్షల ఎకరాలు తొలగింపు

- 1.13 లక్షల మంది కుల వృత్తుల వారికి ప్రయోజనం
- 2013లో ఈనాం భూముల అన్నింటినీ 22(ఎ)లో పెట్టిన వైనం
- దేవదాయ భూములతోపాటు అప్పట్లో ఆ జాబితాలోకి ఈ భూములు
- సరిచేసే అవకాశం ఉన్నా పట్టించుకోని గత ప్రభుత్వాలు
- ప్రస్తుతం భూముల సమస్య పరిష్కారంలో భాగంగా విముక్తి



సాక్షి, అమరావతి: సర్వీసు ఈనాం భూమి రైతుల కష్టాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం చరమగీతం పాడింది. భూముల సమస్యలన్నింటినీ సానుకూలంగా కొలిక్కి తెచ్చే క్రమంలో సర్వీసు ఈనాం భూముల సమస్యను పరిష్కరించింది. నిషేధిత ఆస్తుల జాబితా 22(ఎ) నుంచి 1.68 లక్షల ఎకరాలను తొలగించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో 25 జిల్లాల్లో 1.13 లక్షల మంది కుల వృత్తులు చేసుకునే రైతుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే 2.08 లక్షల ఎకరాల చుక్కల భూములు, 33 వేల ఎకరాల షరతుల గల

మిగతా 3వ పేజీలో ▶

సర్వీసు ఈనాం అంటే?

శతాబ్దాలు.. దశాబ్దాల క్రితం కుల వృత్తులు చేసే వారికి గ్రామాల్లో భూములను ఈనాంగా ఇచ్చారు. వారి వారి వృత్తుల పరంగా ఆలయాల నిర్వహణలో, ప్రజావసరాల్లో వారి భాగస్వామ్యం ఉండేది. ఈ క్రమంలో రజక, కుమ్మరి, కమ్మరి, మాదిగ, మాల, షరబి, భజంత్రి, పూజారి, వడ్రంగి తదితరుల భుక్తి కోసం అప్పట్లో భూములు ఇచ్చారు. వాటిని అనుభవిస్తూ సేవలు అందించేవారు.

సిలికాన్ సిటీలో విపక్షాల వ్యూహరచన



- బెంగళూరులో సోమ, మంగళవారాల్లో కాంగ్రెస్ సహా 24 ప్రతిపక్ష పార్టీలు సమావేశం కానున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియాగాంధీ ఆధ్వర్యంలో జరిగే భేటీలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ భేటీలో పాల్గొంటుందని ఆ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా తెలిపారు.

- వివరాలు 6లో

కన్నడ నాట పొత్తు రాజకీయం



- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలవకుండా చేతులు కలపాలని జేడీఎస్, బీజేపీలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై బీజేపీ అధినాయకత్వంతో చర్చలు జరిపేందుకు జేడీఎస్ అగ్ర నేత కుమారస్వామి సిద్ధమయ్యారు. పిలుపు వస్తే ఎన్డీయే భేటీకి వెళ్లేందుకు కూడా ఆయన సిద్ధమైనట్లు తెలిసింది. ఈ వార్తలు వాస్తవమేనని బీజేపీ నేత, మాజీ సీఎం బొమ్మై వెల్లడించారు.

- వివరాలు 6లో



జ్యోతికి రజతం.. జ్యోతికశ్రీకి కాంస్యం

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ 200 మీటర్ల విభాగంలో రజత పతకం గెలిచింది. 4x400 మీటర్ల రిలేలో దండి జ్యోతికశ్రీ బృందం కాంస్య పతకం సాధించింది.


12లో



రాజుతో అంగరక్షకుడి సహగమనం

రాజు చనిపోతే అంగరక్షకులను అతనితో పాటు సజీవ సమాధి చేసే మరో వికృత ఆచారం కొన్ని ప్రాంతాల్లో కొనసాగింది. స్వామి భక్తితో ఆత్మాహుతి చేసుకున్న అంగరక్షకుడు స్మృతిలో ఏర్పాటు చేసిన స్మారక ఆత్మాహుతి శిల తెలంగాణలో వెలుగులోకి వచ్చింది.

10లో



అలాస్కాలో భూకంపం.. సునామీ హెచ్చరిక

అమెరికాలోని అలాస్కాలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.4గా నమోదైంది. వెంటనే సునామీ హెచ్చరిక జారీ చేసిన అధికారులు.. గంట తర్వాత ఉపసంహరించుకున్నారు. ఎలాంటి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు.

6లో

గూడేనికి కొత్త గుర్తింపు

ఊరూ పేరులేని మారుమూల ప్రాంతంలోని గిరిజనుల జీవితాల్లో వెలుగు



కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న ఎస్టీ కాలనీలో ఓట్లు నమోదు చేస్తున్న అధికారులు

దారికూడా లేని బావికాడిపల్లె అభివృద్ధి ఫలాలు

ఆధార్, ఓటరు కార్డులతోపాటు రేషన్ కూడా!

ఎస్టీలకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు ఫలితం

గిరిజన సమస్యలపై స్పందిస్తున్న యంత్రాంగం

సత్ఫలితాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

యిర్రింకి ఉమామహేశ్వరరావు, సాక్షి ప్రతినిధి

''అది.. రెండు నెలల క్రితం దాకా ఊరూ పేరూ లేని ఓ మారుమూల గూడెం! అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం బావికాడిపల్లె పంచాయతీ శివారులో 40 మంది యానాదులు దశాబ్దాలుగా గుడిసెల్లో జీవిస్తున్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా వారి తలరాతలు మారలేదు! ప్రభుత్వ పథకాలేవీ దరి చేరలేదు! ఇప్పుడు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చొరవతో

మిగతా 2వ పేజీలో ▶



జగనన్న ఎస్టీ కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

క్లుప్తంగా...

త్వరలోనే 1.67 లక్షల కొత్త రైస్ కార్డులు

రాజానగరం: త్వరలోనే 1.67 లక్షల మందికి కొత్త రైస్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 1.46 కోట్ల మంది పేదలకు ప్రతి నెలా 2,11,511 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.846 కోట్లు వెచ్చిస్తోందని, దీనికి అదనంగా ఏటా రూ.200 కోట్లతో ఫోలిక్ యాసిడ్, బి–12 విటమిన్, ఐరన్‌తో కూడిన నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

ఉరకలేస్తున్న గోదావరి



ధవళేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో బ్యారేజీ వద్దకు వచ్చి చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 9.70 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 1,25,693 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. నీటిమట్టం ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద 14 అడుగులకు, పోలవరంలో 27.67 మీటర్లకు చేరింది.

గ్రేట్ ఇండియన్ బ్రాండ్ అరకు కాఫీ

- నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్



సాక్షి, అమరావతి: అరకు కాఫీ ఘుమఘుమలు మరోసారి అంతర్జాతీయంగా ఖ్యాతికెక్కింది. ప్రపంచంలోనే తొలి గిరిజన సంప్రదాయ కాఫీ అయిన అరకు కాఫీ ఇండియన్ గ్రేట్ బ్రాండ్లలో ఒకటి అంటూ నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ ట్వీట్ చేయగా.. దానిని స్వాగతిస్తూ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా రీట్వీట్ చేశారు. దీంతో మరోసారి అంతర్జాతీయంగా అరకు కాఫీపై ట్విట్టర్ వేదికగా పెద్ద చర్చ జరుగుతోంది. ఇండియాలో జరుగుతున్న జీ–20 సమావేశాల్లో విదేశీ ప్రతినిధులకు అందంగా ప్యాక్ చేసిన అరకు కాఫీని అందిస్తున్నామని, ఇది ప్రపంచంలోనే తొలి గిరిజన కాఫీగా గుర్తింపు పొందిందంటూ అమితాబ్ కాంత్ కీర్తించారు. సేంద్రియ సాగు పరీక్షల్లో స్థిరంగా 90 కంటే ఎక్కువ మార్కులు సాధిస్తూ తొలి ఇండియన్ కాఫీగా నిలవడమే కాకుండా.. గ్రేట్ ఇండియన్ బ్రాండ్‌గా ఎదిగిందన్నారు. ఈ ట్వీట్‌పై ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ.. దేశ విజయాన్ని అద్దం పట్టేలా అరకు కాఫీని ఎంచుకోవడం అద్భుతమైన నిర్ణయమంటూ పొగిడారు. అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా మారుతూ గిరిజనుల జీవితాల్లో మార్పులు తెస్తోందన్నారు.

జగనన్న ఇళ్లల్లో విద్యుత్ పొదుపు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగమయ్యేందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈసీఎల్) ముందుకొచ్చింది. గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్‌తో ఈఈఎస్ఎల్ సీనియర్ అధికారులు అనిమేష్‌మిశ్రా, నితిన్ భట్ ఢిల్లీ నుంచి ఆదివారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. పేదల ఇళ్లలో ఇంధన సామర్థ్య చర్యల అమలుకు ఈఈఎస్ఎల్ సూత్రప్రాయంగా అంగీకరించింది. అజయ్‌జైన్ మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల తగ్గింపునకు ఇలాంటి వినూత్న చర్యలు తీసుకున్న ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ మంజూరు చేసిన 21.3 లక్షల ఇళ్లలో 20.45 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, నెలాఖరు నాటికి దాదాపు 5 లక్షల ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఈఈఎస్ఎల్ ద్వారా విద్యుత్ ఆదా చేసే ఎలక్ట్రికల్ ఉపకరణాలను తక్కువ ఖర్చుతో అందజేస్తామని చెప్పారు.

ఏపీ ట్రాన్స్‌కో కొత్త యాప్‌లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) అంతర్గతంగా రెండు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత యాప్‌లు అభివృద్ధి చేసినట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) రూపొందించిన ఈ యాప్‌లు ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్, లైన్‌క్లియర్ అప్లికేషన్ పేరుతో పనిచేస్తాయని చెప్పారు. వినియోగదారులకు అవసరాలకు తగ్గట్టు విద్యుత్‌ను సరఫరా చేయడం, నెట్‌వర్క్ నిర్వహణ కోసం సహాయపడతాయని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ఇప్పటికే అంతర్గతంగా అభివృద్ధి చేసిన ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ మోడల్ జాతీయస్థాయిలో గుర్తింపు సాధించి ఇతర రాష్ట్రాల దృష్టిని ఆకర్షించిందని గుర్తుచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి ఇంట్రాడే డిమాండ్ ఫోర్‌కాస్ట్ మోడల్ను అభివృద్ధి చేయడానికి ట్రాన్స్‌కో కృషిచేస్తోందని తెలిపారు. ఇది రానున్న ఒకటిన్నర గంటలో రాష్ట్ర డిమాండ్‌ను అంచనా వేస్తుందని ఆయన చెప్పారు.




భారతీయ విద్యార్థులపైనే

అమెరికా వర్సిటీల మొగ్గు..!

ప్రవేశాల్లో భారత్‌కే తొలి ప్రాధాన్యం

- నాలుగేళ్లుగా యూఎస్‌లో తగ్గుతున్న చైనా విద్యార్థుల సంఖ్య
- దీంతో భారత్‌తో పాటు ఇతర దేశాలవైపు అమెరికా వర్సిటీల చూపు
- వచ్చే రెండేళ్లలో ఆ దేశంలో పెరగనున్న భారత్ విద్యార్థుల సంఖ్య
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ నివేదిక

సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడం చాలామంది భారతీయ విద్యార్థుల కల. ముఖ్యంగా అమెరికాలో ఉన్నత విద్యా కోర్సులు చదివి.. మంచి కంపెనీలో ఉద్యోగం సాధించి తమ 'డాలర్స్ డ్రీమ్' నెరవేర్చుకుంటూ ఉంటారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్తున్న విదేశీ విద్యార్థుల్లో చైనా తర్వాత భారతీయ విద్యార్థులే అత్యధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా విశ్వవిద్యాలయాలు, కళాశాలల దృష్టి మరింత మంది భారతీయ విద్యార్థులను చేర్చుకోవడంపైనే ఉంది. ఇప్పటివరకు చైనా విద్యార్థులు అధిక సంఖ్యలో యూఎస్‌లో చదువుతుండగా 2023–24 విద్యా సంవత్సరంలో భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (ఐఐఈ) పరిశీలనలో వెల్లడైంది. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ), గ్రాడ్యుయేషన్ కోర్సులు రెండింటిలోనూ భారతీయ విద్యార్థులను ఆకర్షించడమే యూఎస్ యూనివర్సిటీలు/కళాశాలల తొలి ప్రాధాన్యంగా ఉండటం విశేషం. యూఎస్ కళాశాలలు 2023–24లో అండర్ గ్రాడ్యుయేషన్‌లో 57 శాతం, గ్రాడ్యుయేషన్‌లో 77 శాతం మంది భారతీయ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. 2022లో మాస్టర్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లకు వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో భారతీయ విద్యార్థులు ఏకంగా 38 శాతం మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో యూఎస్ విద్యా సంస్థలకు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా నిలుస్తోంది.



పెరిగిన అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య

కాగా ఈ ఏడాది అంతర్జాతీయ విద్యార్థుల నుంచి దరఖాస్తులు భారీగా పెరిగినట్టు అమెరికా వర్సిటీలు తెలిపాయి. కరోనా తర్వాత 2021–22లో యూఎస్ ఉన్నత విద్యలో తొలిసారి కొత్తగా చేరిన అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 80 శాతం పెరగడం విశేషం. ఈ వృద్ధి ఇంకా వేగంగా కొనసాగుతోంది. ఎక్కువ అమెరికన్ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు (61 శాతం) గతేడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో అత్యధికంగా దరఖాస్తులు స్వీకరించినట్టు పేర్కొన్నాయి. 28 శాతం విద్యా సంస్థలు తమ అడ్మిషన్లు స్థిరత్వంగా ఉన్నాయని వెల్లడించాయి. 12 శాతం సంస్థలు ఎన్‌రోల్‌మెంట్ తగ్గినట్టు తెలిపాయి. కౌన్సిల్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్కూల్స్ ప్రకారం.. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లకు అంతర్జాతీయ విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. అంతర్జాతీయ విద్యార్థుల ద్వారా 2021–22లో అమెరికా ఆర్థిక వ్యవస్థకు 33.8 బిలియన్ డాలర్లు సమకూరాయి. అయితే ఇది 2018 (45 బిలియన్ డాలర్లు)తో పోలిస్తే తక్కువ.

2021-22లో ఉన్నత విద్య కోసం అమెరికాకు అత్యధికంగా విద్యార్థులు వెళ్లిన దేశాలు..

1.	చైనా
2.	భారత్
3.	దక్షిణ కొరియా
4.	కెనడా
5.	వియత్నాం
6.	తైవాన్
7.	సౌదీ అరేబియా
8.	బ్రెజిల్
9.	మెక్సికో
10.	నైజీరియా

పడిపోయిన సౌదీ అరేబియా

భారత్ తర్వాత అత్యధికంగా అమెరికా అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో చేరుతున్నవారిలో వరుసగా వియత్నాం (48 శాతం), దక్షిణ కొరియా (41 శాతం), బ్రెజిల్ (40 శాతం), చైనా (39 శాతం) ఉన్నాయి. అలాగే గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరుతున్నవారిలో భారత్ తర్వాత చైనా (42 శాత), నైజీరియా (37 శాతం), వియత్నాం (35 శాతం), దక్షిణ కొరియా (34 శాతం), బ్రెజిల్ (34 శాతం) దేశాలు చోటు దక్కించుకుంటున్నాయి. అలాగే నేపాల్, బంగ్లాదేశ్, కెనడా కూడా ఈ జాబితాలో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశాల్లో మూడొంతు కంటే ఎక్కువ కళాశాలలు భారత్‌ను అగ్ర మార్కెట్‌గా పేర్కొంటున్నాయి. విద్యార్థుల చేరికల పరంగా 2021–22లో సౌదీ అరేబియా 7వ స్థానంలో ఉన్నప్పటికీ ఇప్పుడు దానికి టాప్ 10లో స్థానం దక్కలేదు. ఇక నేపాల్ నుంచి 2021–22లో 12 శాతం, బంగ్లాదేశ్ నుంచి 13 శాతం విద్యార్థుల పెరుగుదల నమోదైంది.

చైనా విద్యార్థులకు సన్నగిల్లుతున్న ఆసక్తి..

2021–22లో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అత్యధికంగా చైనా నుంచి ఎక్కువ మంది వెళ్లారు. ఆ ఏడాది మొత్తం చైనా విద్యార్థుల వాటా 30.5 శాతంగా ఉంది. అయితే అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 8.6 శాతం తగ్గడం గమనార్హం. దీనికి పూర్తి భిన్నంగా అదే ఏడాది భారతీయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్లు 18.9 శాతం పెరిగాయి. వచ్చే రెండేళ్లలో యూఎస్‌లో భారతీయ విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని ఐఐఈ అంచనా వేస్తోంది. మరోవైపు గత నాలుగేళ్లుగా చైనా విద్యార్థులకు అమెరికా చదువులపై ఆసక్తి సన్నగిల్లుతోందని పేర్కొంది.

గూడేనికి కొత్త గుర్తింపు

▶ మొదటి పేజీ తరువాయి

ఆ ప్రాంతంలో అభివృద్ధి కుసుమాలు వికసిస్తున్నాయి. తుప్పలను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో ఇన్నాళ్లూ రవాణా సదుపాయం లేని ప్రాంతానికి దారి ఏర్పడింది. తాగునీటి కోసం మంచినీటి బోరు కూడా తవ్వారు. ఏ ఆధారంలేని వారికి ఇప్పుడు ఆధార్ కార్డు వచ్చింది. దీంతో ఓటు హక్కు దక్కింది. రేషన్ కార్డులూ రెడీ అవుతున్నాయి. ఇదంతా 'జగనన్న ఎస్టీ కాలనీ'లో కేవలం రెండు నెలల్లోనే జరిగిన పురోగతి. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మంచి ఫలితాలు సాకారమవుతున్నాయి.

వేర్వేరు కమిషన్ల ఏర్పాటు..

ఎస్సీ ఎస్టీలకు సంబంధించి భిన్న స్థితిగతులు, సమస్యలు ఉంటాయి. గతంలో వారిని ఒకే కమిషన్ పరిధిలో కొనసాగించడంతో సత్వర న్యాయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ ఎస్టీలకు వేర్వేరు కమిషన్లను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబు 2021 మార్చి 4న నియమితులయ్యారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కమిషన్ చైర్మన్‌గా న్యాయవాది, దళిత ఉద్యమ నాయకుడైన మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను 2021 ఆగస్టు 24న ప్రభుత్వం నియమించింది. ఈ రెండు కమిషన్లు ఎప్పటికప్పుడు ఎస్సీ ఎస్టీల సమస్యలపై స్పందిస్తూ న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేయడంతో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఎస్టీ కమిషన్ పనితీరులో మైలు రాళ్లు..

- కలెక్టరేట్లలో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తూ గిరిజనులకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఎస్టీ కమిషన్ ఆరా తీస్తోంది.
- విశ్వవిద్యాలయాలను సందర్శించి విద్యార్థులు, పరిశోధకుల అడ్మిషన్లతోపాటు టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కచ్చితంగా అమలయ్యేలా ప్రభుత్వానికి నివేదించింది.
- సమావేశాలు నిర్వహించి గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది.
- ప్రభుత్వ శాఖల్లో నియామకాలు, పదోన్నతులు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, గిరిజనులకు భూమి పట్టాల (ఆర్ఓఎఫ్ఆర్, డీ పట్టా) పంపిణీపై ప్రభుత్వానికి నివేదించింది.
- గిరిజనులపై అఘాయిత్యాలు, భూ సమస్యలు, సర్వీసు వ్యవహారాలపై విచారణ చేపట్టి తగిన చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి నివేదించింది.
- గిరిజన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తెచ్చింది.
- కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు పెద్ద తండ, మాన్‌సింగ్ తండా, మత్రియ తండా తదితర తండాల్లో పర్యటించి కిడ్నీ బాధితుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించింది. కృష్ణా నది నుంచి పైపులైను ద్వారా నేరుగా మంచినీరు అందించేలా ప్రతిపాదించింది.



జగనన్న ఎస్టీ కాలనీలో పారిశుధ్య నిర్వహణతో మార్గం ఏర్పాటు

- జగనన్న ఎస్టీ కాలనీలో యానాదుల సంఖ్య: 40
- గతంలో ఇద్దరికి మాత్రమే ఆధార్ ఉండగా ప్రత్యేక క్యాంపుతో 30 మందికి ఆధార్ కార్డులిచ్చారు.
- ఇప్పటివరకు ఎవరికీ ఓట్లు లేవు. తాజాగా 21 మందిని (10 మంది మహిళలు, 11 మంది పురుషులు)కి ఓటర్లుగా నమోదు చేశారు.
- ఆధార్ కార్డులు రావడంతో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేశారు.
- పెన్షన్లు కూడా అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- ఐదేళ్ల లోపు పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ నమోదు చేసి ముగ్గురిని బడిలో చేర్చారు.

గిరిజనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం



సీఎం జగన్ ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను నియమించి గిరిజనులకు ఎంతో మేలు చేశారు. గిరిజనులకు ఎక్కడ సమస్య తలెత్తినా కమిషన్ అక్కడికి వెళుతోంది. సమస్యలను గుర్తించి పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తెస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు సైతం విద్య, వైద్యం, సంక్షేమ పథకాలను అందించేలా సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం గిరిజనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

–వడిత్యా శంకర్ నాయక్, ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు

నీటి తిప్పలు తీర్చారు



గతంలో మా ప్రాంతానికి కనీసం మంచినీటి సదుపాయం కూడా ఉండేది కాదు. దూరంగా ఉన్న తోటల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకునే వాళ్లం. పనికి వెళితేనే అక్కడి రైతులు నీరు ఇచ్చేవారు. అధికారులు మా గ్రామాన్ని సందర్శించి బోరు వేయడంతో నీటి తిప్పలు తీరాయి.

–ఎం.సరోజమ్మ, జగనన్న ఎస్టీ కాలనీ, బావికాడిపల్లె

రహదారి సౌకర్యం కల్పించారు



మార్గమే లేని మా ప్రాంతానికి తుప్పలు తొలగించి రహదారి సౌకర్యం కల్పించారు. త్వరలో పక్కా రోడ్డు వేస్తామన్నారు. పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య పనులు చేశారు. బడికెళ్లే పిల్లల కోసం ఆటో ఏర్పాటు చేశారు. మాకు ఆధార్, ఓటర్లుగా నమోదు చేయడంతోపాటు రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చేలా ప్రతిపాదనలు రూపొందించారు.

–టి.నాగరాజు, జగనన్న ఎస్టీ కాలనీ, బావికాడిపల్లె

జగనన్న ఎస్టీ కాలనీగా నామకరణం



గతంలో యానాదుల కాలనీకి పేరు కూడా లేదు. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు జగనన్న ఎస్టీ కాలనీగా బోర్డు ఏర్పాటు చేశాం. వారికి అవసరమైన వసతులు కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించేలా శ్రద్ధ వహిస్తున్నాం.

–గంగాధర్, బావికాడిపల్లె పంచాయతీ కార్యదర్శి

ఉత్తర ఒడిశాపై అల్పపీడనం

▶ మొదటి పేజీ తరువాయి

జార్ఖండ్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించనుంది. మరోవైపు సగటు సముద్రమట్టం వద్ద రుతుపవన ద్రోణి అల్పపీడన ప్రాంతం కేంద్రం.. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌కు ఆనుకుని ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో పలుచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో కొన్ని చోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, సోమవారం ఉత్తర కోస్తాంధ్రలో ఒకటిరెండు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని తెలిపింది. మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో ఈనెల 18న ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. ఇది ఆ మరుసటి రోజుకి అదే ప్రాంతంలో అల్పపీడనంగా మారనుంది. తరువాత ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. అనంతరం రెండురోజుల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా మధ్య భారతదేశం వైపు వెళ్లనుంది. ఫలితంగా రుతుపవన ద్రోణి చురుకుదనం సంతరించుకోనుంది. దీంతో ఈనెల 18 నుంచి నాలుగు రోజుల పాటు రాయలసీమ మినహా రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ప్రధానంగా ఉత్తర కోస్తాంధ్రలో పలుచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, రాయలసీమలో తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల భారీవర్షాలకు ఆస్కారం ఉంది.



ఎంబీబీఎస్ అన్ రిజర్వ్‌డ్ సీట్లు

ఏపీ విద్యార్థులకే

▶ మొదటి పేజీ తరువాయి

భర్తీ చేసేవారు. అలాగే ప్రైవేట్ కళాశాలల్లో 50% సీట్లు కన్వీనర్ కోటా కింద ఉండేవి. ఈ సీట్లలో 15 శాతం సీట్లను అన్ రిజర్వ్‌డ్ కింద భర్తీ చేసేవారు. దీంతో అన్ రిజర్వ్‌డ్ విభాగంలో తెలంగాణ విద్యార్థులు పోటీపడి సీట్లు పొందుతూ వచ్చారు.

ఇక నుంచి ఇలా..

2014 జూన్ 2 తర్వాత ఏర్పడిన కళాశాలలు, కొత్తగా మంజూరైన సీట్లలో 15 శాతంలోనూ తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే అవకాశం ఉంటుంది. ఏపీ స్థానికత కలిగిన విద్యార్థులు ఈ సీట్లలో ప్రవేశాలు పొందొచ్చు. దీంతో పాటు వేరే రాష్ట్రంలో చదువుకున్న కాలం మినహాయించి రాష్ట్రంలో పదేళ్లు నివసించిన విద్యార్థులు/పదేళ్ల పాటు రాష్ట్రంలో నివసించిన పౌరుల పిల్లలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు కూడా అవకాశం కల్పిస్తారు. అలాగే ప్రైవేటు కళాశాలల్లోని అన్ రిజర్వ్‌డ్ సీట్లను కూడా మన రాష్ట్ర విద్యార్థులకే కేటాయిస్తారు. అంటే.. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 100 శాతం సీట్లు (ఆల్ ఇండియా కోటా మినహాయించి) ఏపీ విద్యార్థులకే దక్కనున్నాయి. అన్ రిజర్వ్‌డ్ విభాగంలో తెలంగాణ విద్యార్థులకు ఇక అవకాశం ఉండదు.



219 అన్ రిజర్వ్‌డ్ సీట్లు మన విద్యార్థులకే..

ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా ఐదు వైద్య కళాశాలలను ప్రారంభిస్తోంది. వీటిలో ఒక్కో చోట 150 చొప్పున 750 సీట్లు ఉన్నాయి. ప్రతి చోట ఆల్ ఇండియా కోటా 15 శాతం సీట్లు పోగా 128 చొప్పున సీట్లు రాష్ట్ర కోటాలోకి వస్తాయి. వీటితో కలిపి 2014 జూన్ 2 తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన కళాశాలల్లో 1,290 సీట్లు రాష్ట్ర కోటాలోకే వస్తాయి. వీటిలో 15 శాతం అంటే 193 సీట్లు అన్ రిజర్వ్‌డ్ విభాగంలో ఉంటాయి. అలాగే 2014 తర్వాత కొత్తగా మంజూరైన సీట్లలో 26కు పైగా సీట్లు అన్ రిజర్వ్‌డ్ విభాగంలోకి వస్తాయి. ఇలా 219 సీట్లు పూర్తిగా ఏపీ విద్యార్థులకే దక్కనున్నాయి. కేవలం ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మాత్రమే కాకుండా వైద్య విద్య పీజీ సీట్లలోను 15 శాతం అన్ రిజర్వ్‌డ్ కోటా సీట్లలో మన రాష్ట్ర విద్యార్థులకే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

వ్యవ'సాయం' భేష్

▶ మొదటి పేజీ తరువాయి

సిఫారసు చేసే కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఆదివారం కృష్ణా జిల్లా గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్), ఆర్బీకే చానల్‌ను సందర్శించారు. రైతుల సందేహాలను కాల్ సెంటర్ సిబ్బంది శాస్త్రవేత్తల సాయంతో ఎలా నివృత్తి చేస్తున్నారో పరిశీలించారు. టోల్ ఫ్రీ నంబర్ 155251కు వస్తున్న కాల్స్‌ను నిశితంగా గమనించారు. కాల్ చేసిన పలువురు రైతులను కాల్ సెంటర్ సేవల గురించి వాకబు చేశారు. పంటల వారీగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపుల్లో రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తున్న తీరును పరిశీలించి అభినందించారు. శాస్త్రవేత్తలతో భేటీ అయ్యారు. అనంతరం ఆర్బీకే చానల్ ద్వారా ప్రసారమవుతున్న రైతు ప్రాయోజిత కార్యక్రమాలను తిలకించి చాలా బాగున్నాయంటూ కితాబిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారుల సలహాలు, సూచనలతో రూపొందిస్తున్న వీడియోలను పరిశీలించారు. తమ అనుభవాలను చానల్ ద్వారా తోటి రైతులకు వివరించేందుకు వచ్చిన ఆదర్శ రైతులతో ముచ్చటించారు. రైతు భరోసా మ్యాగ్‌జైన్ అద్భుతంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో కిసాన్ కాల్ సెంటర్స్ పనిచేస్తున్నా ఈ స్థాయిలో సేవలందించడం లేదన్నారు. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల్లో కాల్ సెంటర్లు నెలకొల్పితే మంచి ఫలితాలుంటాయని పేర్కొంటూ ఐసీసీ సెంటర్ సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాన్ని పొందుపరిచారు.

గండిగుంట ఆర్బీకే సందర్శన..

అక్కడ నుంచి నేరుగా ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామానికి చేరుకొని ఆర్బీకే–2ను సందర్శించారు. సిబ్బందితో సమావేశమై ఆర్బీకేల ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. అక్కడి సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను పరిశీలించారు. కియోస్క్‌ను ఆపరేట్ చేసి వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలను పరిశీలించారు. పంట కొనుగోలు కోసం ఉపయోగించే తేమ పరికరం ఎలా పనిచేస్తుందో పరిశీలించారు. పొలంబడి ప్లాట్లను పరిశీలించి పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు పాటిస్తున్న ఉత్తమ యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకే ద్వారా పాడి రైతులకు అందిస్తున్న మిశ్రమ దాణా, పశుగ్రాసం విత్తనాలను పరిశీలించారు. ఆర్బీకేకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాన్ని సందర్శించి రైతులకు అందుబాటులో ఉంచిన ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలను పరిశీలించారు. అనంతరం రైతులను కలుసుకుని ఆర్బీకే ద్వారా అందిస్తున్న సేవలను ఆరా తీశారు. గ్రామ స్థాయిలోనే తమకు సేవలు అందుతున్నాయని రైతులు తెలిపారు. గతంలో విత్తనాలు, ఎరువులు ఏది కావాలన్నా మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. సీజన్‌కు ముందే కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేలోనే అందుబాటులో ఉంచుతున్నారని వెల్లడించారు. రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. గతంతో పోలిస్తే తమ ప్రాంతంలో ఎక్కువగా సాగయ్యే వరి పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగాయని, ఏటా గోధుమలకు పెంచుతున్న స్థాయిలో వరికి మద్దతు ధరలు పెరగడం లేదని రైతులు సీఏసీపీ చైర్మన్ దృష్టికి తేవడంతో సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన అక్కడ నుంచి నేరుగా కంకిపాడులోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను సందర్శించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను సర్టిఫై చేస్తున్న తీరును పరిశీలించారు.



అగ్రిల్యాబ్‌ను పరిశీలిస్తున్న విజయ్‌పాల్ శర్మ

విన్న దానికంటే గొప్పగా ఉన్నాయి

దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఆర్బీకేల సేవల గురించి చాలా విన్నా. వాటిని స్వయంగా చూడాలన్న ఆసక్తితో ఇక్కడకు వచ్చా. నేను విన్న దానికంటే ఆర్బీకేలు చాలా గొప్పగా ఉన్నాయి. చాలా అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఇలాంటి వ్యవస్థను నేనెక్కడా చూడలేదు. ఇలాంటి వ్యవస్థ దేశవ్యాప్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గ్రామ స్థాయిలో సేవలందించేందుకు ఆర్బీకేలు ఎంతగానో దోహదపడుతున్నాయి. కియోస్క్‌ల ద్వారా వాతావరణ సమాచారం అందిస్తున్నారు. ఆర్బీకే తరహాలో జాతీయ స్థాయిలో ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పాలని వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ తరఫున కేంద్రానికి నివేదిక సమర్పిస్తాం.

– విజయ్‌పాల్ శర్మ, సీఏసీపీ చైర్మన్

క్లుప్తంగా...

పవన్‌కళ్యాణ్ భారీ దిష్టిబొమ్మ దహనం



పవన్ కళ్యాణ్ భారీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కనుపర్తిపాడు వాసులు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వైఖరికి నిరసనగా ఆదివారం 25 అడుగుల పవన్ కళ్యాణ్ భారీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీనియర్ న్యాయవాది పొన్నవోలు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. పవన్ వీరాభిమాని, న్యాయవాది మేకనూరి కార్తీక్ మాట్లాడుతూ తాను తొలి నుంచి పవన్ కళ్యాణ్ వీరాభిమానినని, కానీ ఆయన వైఖరి కారణంగా దూరంగా ఉండాల్సివస్తోందన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించింది జగనే



ఎంపీ కృష్ణయ్య, మంత్రి వేణుకు స్వర్ణకంకణ ధారణ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు: చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని ఏయూ కన్వెన్షన్ హాలులో 'విశాఖ బీసీ గర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు ఉన్నారని, ఎక్కడా సాధ్యం గాని బీసీల అభ్యున్నతి ఏపీలో సాధ్యమైందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలపై ఉన్న అంకితభావానికి ఇదే నిదర్శనమన్నారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు స్వర్ణకంకణ ధారణ చేసి సత్కరించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కొలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా పవన్?: మారేష్



సాక్షి, అమరావతి: నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని ఒక నినాదంలా కాకుండా విధానంగా అమలు చేసి చూపించారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేష్ చెప్పారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పలు కుల సంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు పెద్దఎత్తున మేలు జరుగుతున్నప్పటికీ, వారి అభివృద్ధికి ప్రభుత్వం ఏమీ చేయడం లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిగజారి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత నాలుగేళ్లలో బీసీల అభివృద్ధిపై చర్చకు పవన్‌కళ్యాణ్ సిద్ధమా.. అని ఆయన సవాల్ చేశారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, ఉపాధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడారు.

పేదలకు భూ పంపిణీని ఆహ్వానిస్తున్నాం: సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూమిలేని పేదలకు 54వేల ఎకరాలకుపైగా పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అసైన్డ్ భూముల ముసాయిదా చట్ట సవరణలో చేసిన మార్పులు, అర్హులైన పేదలందరికి భూమి, ఇళ్లస్థలాలిచ్చే విషయమై సీఎం వైఎస్ జగన్‌కు శ్రీనివాసరావు ఆదివారం రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. అసైన్డ్ భూములు పొందిన నిజమైన దళితులు, పేదలకు నష్టం జరగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 5లక్షల మంది పేదలు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారని, వారికి పట్టాలివ్వాలని కోరారు.

20న జనసేనలో చేరుతున్నా: పంచకర్ల

సాక్షి, అమరావతి: ఈ నెల 20న తాను జనసేనలో చేరుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జనసేన భావజాలం, రాష్ట్ర శ్రేయస్సు కోసం పవన్ పడుతున్న తపన చూసి తాను ఆయన వెంట నడవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు.

పట్టణాల్లో 'ఆహా' క్యాంటీన్లు

110 పురపాలికల్లో 140 యూనిట్లకు ఓకే చెప్పిన మెప్మా

- పట్టణ మహిళా సమాఖ్య సభ్యులతో నిర్వహణ
- ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్, మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు
- ఇప్పటికే కర్నూలు, కడప, ప్రొద్దుటూరులో విజయవంతం
- తక్కువ ధరకు రుచి, శుచితో ఆహారం విక్రయం
- యూనిట్‌కు రూ.13 వేల చొప్పున ప్రభుత్వం సాయం
- పట్టణాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధి మార్గం



కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఆహా క్యాంటీన్

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారు, మార్కెట్లకు సరుకులు తెచ్చే రైతులు, వ్యాపారుల ఆకలి తీర్చేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నడుంబిగించింది. ఇప్పటికే జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మహిళా మార్కెట్లను ఏర్పాటు చేసి సమాఖ్య సభ్యులతో దిగ్విజయంగా నడిపిస్తున్న ఈ సంస్థ ఇప్పుడు మరింత మంది పట్టణ మహిళా సమాఖ్య సభ్యులకు ఉపాధిని చూపించాలనే లక్ష్యంతో 'ఆహా' క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉండి ముందుకు వచ్చిన మహిళా సమాఖ్య సభ్యులతో ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే ఐదు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్లు విజయవంతం కావడం, సమాఖ్య సభ్యులు ఆదాయం సముపార్జించడంతో పాటు ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో రాష్ట్రంలోని 110 యూఎల్బీల్లో 140 యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా సాధారణ ప్రజలు అధికంగా సంచరించే ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, మార్కెట్లు, మున్సిపల్ కార్యాలయాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేస్తోంది.

రూ.13 వేల చొప్పున ప్రభుత్వ సాయం

పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో సాధ్యమైనంత ఎక్కువ మందికి ఉపాధి చూపాలన్న లక్ష్యంగా మెప్మా కృషి చేస్తోంది. 'ఆహా' క్యాంటీన్ల యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చే సంఘ సభ్యులకు రూ. 13 వేల చొప్పున ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. క్యాంటీన్ల ఏర్పాటుకు ఆస్పత్రులు, ఆర్టీసీ, రైల్వే, మార్కెటింగ్ అధికారులతో మెప్మా అధికారులు మాట్లాడి అనుమతులు తీసుకున్నారు. క్యాంటీన్ల నిర్వాహకులు ప్రతినెలా రూ. 500 చొప్పున స్థానిక టౌన్ లెవెల్ ఫెడరేషన్ (పట్టణ మహిళా సమాఖ్యల సొసైటీ)లో జమ చేసి మరింత మందికి ఆర్థిక సాయం అందేలా ఏర్పాట్లు చేశారు. ఆహారాన్ని రుచి, శుచిగా ఇంటి వద్దే వండి ఎంపిక చేసిన ప్రాంతాల్లోని ఏర్పాటు చేసిన కియోస్క్‌ల్లో విక్రయిస్తారు. ఆయా ప్రాంతాల్లోని డిమాండ్, అవసరాలను బట్టి ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనాల వరకు విక్రయించేలా అవకాశం కల్పించారు. గరిష్ఠంగా రూ. 40కే విక్రయించేలా చర్యలు తీసుకున్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



రాష్ట్రంలోని పట్టణాల్లో గల ఎస్‌హెచ్‌జీల్లోని మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు మెప్మా కృషి చేస్తోంది. ప్రభుత్వం సైతం వారికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తోంది. ఇప్పటికే విజయవంతమైన జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మార్టుల తరహాలో మహిళలకు ఉపాధి కల్పించనున్నాం. ప్రజలకు తక్కువ ధరలో మంచి ఆహారం అందించేందుకు 140 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. అవసరాన్ని బట్టి మరిన్ని ఏర్పాటు చేస్తాం. లాభాలను నిర్వాహకులే తీసుకుంటారు. టౌన్ లెవెల్ ఫెడరేషన్ అకౌంట్‌లో జమచేసే నగదును సంఘ సభ్యులు రుణాలుగా తీసుకుంటారు. అంటే ప్రతి రూపాయి ఆ పట్టణంలోని సంఘ సభ్యులే తీసుకుంటారు. నిర్వహణ పర్యవేక్షణను మెప్మా సిబ్బంది చూస్తారు.

– వి. విజయలక్ష్మి, మెప్మా ఎండీ

ఒక్కపూట రూ. 3 వేల వ్యాపారం



పదిహేను రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మెప్మా సహకారంతో ఆహా క్యాంటీన్ ప్రారంభించాం. ముగ్గురం సభ్యులం కలిసి సాయంత్రం వేళ జొన్న, సజ్జ రొట్టెలు, భోజనం పెట్టాం. కేవలం 2.30 గంటలు మాత్రమే ఇక్కడ ఉంటాం. పూటకు రూ. 3 వేలకు పైగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఉదయం టిఫిన్లు కూడా పెట్టాలని నిర్ణయించాం. అప్పుడు ఇంకా ఎక్కువ వ్యాపారం, ఆదాయం వస్తుంది. పదార్థాలు మా ఇళ్లల్లోనే తయారు చేసి తెస్తున్నాం. ఆహా క్యాంటీన్‌తో మాకు ఉపాధి లభించింది.

– పి.జయలక్ష్మి, ఆహా క్యాంటీన్ నిర్వాహకురాలు, కర్నూలు

సంక్షేమ పథకాలను ఆపేందుకు బాబు, దత్తపుత్రుడి కుట్ర: ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్ నిరుపేదలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఆపేయాలని కుట్ర జరుగుతోందని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు అండ్ కో అడుగడుగునా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెల్లవారక ముందే అవ్వ, తాతల వద్దకు వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ వ్యవస్థ మీద కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్‌కళ్యాణ్ డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం ఇలాగే కొనసాగితే.. వారికి రాజకీయంగా పుట్టగతులుండవనే ఈ తప్పుడు ప్రచారానికి తెరలేపారని పేర్కొన్నారు. వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలు కరోనా కష్టకాలంలో చేసి ఉంటే జనం బట్టలూడదీసి నడిరోడ్డుపై నిలబెట్టి ఉండేవారన్నారు. 2014–2019లో జన్మభూమి కమిటీలు కేవలం టీడీపీ వారికి మాత్రమే పథకాలు ఇచ్చినప్పుడు పవన్ నిద్రపోయారా అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా పేదలకు ఇచ్చే సంక్షేమం ఆగదని, రెట్టించిన ఉత్సాహంతో సంక్షేమం పరుగులు పెడుతుందని చెప్పారు.

పవన్ ఉన్మాదిలా మారాడు

- టీడీపీ అరాచకాల విముక్తికే వలంటీర్ వ్యవస్థ
- జనసేన అధినేతపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం



ఏలూరు టౌన్: రాష్ట్రంలో టీడీపీ, జన్మభూమి కమిటీల అరాచకం, దోపిడీ నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తూ.. పేదలందరికీ పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. వలంటీర్లు ప్రతి ఇంట్లోకి వెళ్లి మగవాళ్లు ఉన్నారా, వితంతువులు ఉన్నారా, మీరు ఎవరినైనా ప్రేమించారా అంటూ వివరాలు సేకరిస్తున్నారంటూ పవన్ తీవ్రమైన ఆరోపణలు చేయటాన్ని నాని తప్పుబడుతూ ఆయన ఉన్మాదిలా మారాడన్నారు. ఏలూరులో ఆదివారం నియోజకవర్గంలోని వలంటీర్ల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పవన్‌కళ్యాణ్ ఇటీవల ఏలూరులో వలంటీర్ వ్యవస్థపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, దారుణమైన ఆరోపణల నేపథ్యంలో వారికి భరోసా కల్పించారు. వలంటీర్లపై పవన్ తీవ్రమైన ఆరోపణలు చేయటాన్ని నాని అభ్యంతరం వ్యక్తంచేశారు. పవన్ ఏలూరులో ఒకలా, తాడేపల్లిగూడెంలో ఒకలా, తణుకులో మరోలా ఉన్మాదిలా మాట్లాడుతూ నీచసంస్కృతికి తెరతీశారని మండిపడ్డారు. 'నువ్వు వార్డు మెంబర్ కాదు, కార్పొరేటర్ కాదు, ఎమ్మెల్యే కాదు.. నిఘా సంస్థలు నీకెందుకు చెబుతాయి..' అంటూ పవన్‌ను ప్రశ్నించారు. సామాజిక అంశాలపైనా అవగాహనలేని పవన్.. అజ్ఞానవాసిగా మిగిలిపోతారన్నారు.

గురువును మించిన శిష్యుడు..

చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు, రాష్ట్రాన్ని నిలువునా విభజించేందుకు ఆనాడు కేంద్రానికి లెటర్ ఇచ్చారని.. నేడు పవన్ అభివృద్ధిని అడ్డుకుంటూ నీచమైన రాజకీయాలు చేస్తూ గురువును మించిన శిష్యుడుగా మారాడని ఆళ్ల నాని విమర్శించారు. 'చదువుకున్న యువతకు వలంటీర్లుగా ప్రభుత్వ సేవల్లో భాగస్వామ్యం కల్పిస్తూ సీఎం జగన్ వారికి రూ.5 వేలు గౌరవ వేతనంగా ఇస్తుంటే.. నువ్వేమో పొంతనలేని మాటలు మాట్లాడుతున్నావు. నిన్ను ప్రజలు నమ్మరు.' అని అన్నారు.

కాపుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

నెల్లూరులో కాపు భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి అంబటి రాంబాబు



కాపు భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు అంబటి, కాకాణి

నెల్లూరు(వేదాయపాళెం): కాపుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సీఎం వైఎస్ జగన్ కాపుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నెల్లూరులో రూ.6.15 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన కాపు భవన్‌ను వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు అంబటి, కాకాణి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం కాపు ఉద్యమంపై ఉక్కుపాదం మోపి.. నాయకులపై అక్రమ కేసులు పెట్టిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులను కొట్టివేసిందని చెప్పారు. పదవుల్లో కూడా కాపులకు సీఎం జగన్ ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో కాపు భవన్‌కు శంకుస్థాపన చేసి వదిలివేశారని, కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రారంభించిందన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, కాపు నేతలు పిండి సురేష్, పాశం శ్రీనివాసులు, భూపతి విజయ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో నేతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా రూపొంది.. సంస్థాగతంగా బలపడేందుకు, పార్టీ చేపట్టే కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేదుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 150 మంది క్రియాశీలకంగా పనిచేసే నేతలను గుర్తించి రానున్న రోజుల్లో అన్ని కార్యక్రమాల్లో వారికి బాధ్యతలు అప్పగించాలని ఆ పార్టీ నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి నియామకం తర్వాత ఆదివారం విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. పురందేశ్వరితోపాటు పార్టీ జాతీయ సంస్థాగత వ్యవహారాల సహ ఇన్‌చార్జి శివప్రకాష్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, కేంద్రమంత్రి వి.మురళీధరన్, సహ ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, అన్ని జిల్లాల నేతలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ముఖ్య భూమిక పోషించి, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలవడానికి ముఖ్య నేతలందరూ కృషి చేయాలని ముఖ్య అతిథిగా హాజరైన మురళీధరన్ పిలుపునిచ్చారు. 2019లో మనపట్ల మన వ్యతిరేక పక్షాల దుష్ప్రచారంవల్ల అనుకున్న ఫలితాలు సాధించలేకపోయామని.. కానీ, ఇప్పుడా పరిస్థితులు మారాయన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని తన ప్రారంభోపన్యాసంలో పురందేశ్వరి అన్నారు.

23 నుంచి రాష్ట్ర పర్యటనలు

ఈ నెల 23 నుంచి రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా, గోదావరి ప్రాంతాల్లో పురందేశ్వరి పర్యటిస్తారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 23న ప్రొద్దుటూరులో రాయలసీమ నేతలతో, 25న గుంటూరులో కోస్తా జిల్లాల నేతలతో, 26న రాజమహేంద్రవరంలో గోదావరి జిల్లాల నేతలతో.. 27న విశాఖలో ఉత్తరాంధ్ర నేతల సమావేశం జరుగుతుందన్నారు. ఎన్డీయే సమావేశానికి పవన్ హాజరుకానుండడంతో బీజేపీ, జనసేన పొత్తుపై స్పష్టత వచ్చిందన్నారు. బీజేపీ, టీడీపీ కలవాలని తాము అనుకోవడం లేదని ఓ ప్రశ్నకు వారు బదులిచ్చారు.

ప్రజలు ముంగిటకే రిజిస్ట్రేషన్ సేవలు

- ఉమ్మడి జిల్లాలో 167 సచివాలయాల్లో సేవలు
- పారదర్శకంగా సేవలందించేలా ప్రభుత్వం చర్యలు
- టైమ్ స్లాట్ బుకింగ్ ద్వారా సమయం ఆదా
- నాలుగేళ్లలో మార్కెట్ విలువ పెంచింది ఒక్కసారే..



ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రిజిస్ట్రేషన్ సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వానికి అధిక ఆదాయం తీసుకువచ్చే వాటిల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి కాగా.. దీనిపై అవినీతి ఆరోపణలు ఆ స్థాయిలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవినీతికి తావులేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ల కోసం దూరంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కక్షిదారులు వెళ్లాల్సి వస్తుంది. అలాగే బ్యాంకుల్లో చలానాలు కట్టడం, స్టాంపులు కొనుగోలు చేయడం, దస్తావేజు తయారు చేయించుకోవడం వంటి పనులన్నీ వ్యయప్రయాసలతో కూడుకున్నవి. ఈ క్రమంలో ఒక రిజిస్ట్రేషన్ పూర్తయి దస్తావేజు పత్రాలు చేతికి రావాలంటే 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. దీనివల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. ఈ పరిస్థితిని కూడా అధిగమించడం కోసం సీఎం జగన్ రిజిస్ట్రేషన్ సేవలను ప్రజల ముంగిటకే తీసుకువచ్చేలా ఏర్పాట్లుచేశారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

రిజిస్ట్రేషన్ సేవలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో మరింత పారదర్శకతకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందించే సేవలపై ఆరోపణలు, అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో అన్ని కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ ప్రకటనల్ని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సచివాలయాల్లో 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా డేటా ఎంట్రీ విధానం ప్రవేశపెడుతున్నారు. టైమ్ స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా 20 నిమిషాల వ్యవధిలోనే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. కేవలం రిజిస్ట్రేషన్లు మాత్రమే కాకుండా గ్రామ సచివాలయాల్లో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్స్, మార్కెట్ వాల్యూ ధ్రువీకరణ పత్రాల జారీ, వివాహాల రిజిస్ట్రేషన్లు సైతం చేయనున్నారు.

167 సచివాలయాల్లో ఏర్పాట్లు

ఏలూరు జిల్లాలో 12, పశ్చిమగోదావరి జిల్లాల్లో 16 రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలుత ఏలూరు జిల్లాలో 78, పశ్చిమగోదావరి జిల్లాలో 16 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించారు. అనంతరం రెండో విడతగా ఏలూరు జిల్లాలో మరో 55, పశ్చిమగోదావరి జిల్లాలో 18 సచివాలయాల్లో కలిపి మొత్తం 167 సచివాలయాల్లో ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

నాలుగేళ్లలో మార్కెట్ విలువ పెంచింది ఒక్కసారే..

రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి మారుతున్న ధరలకు అనుగుణంగా గత ప్రభుత్వాలు మార్కెట్ విలువలను పెంచేవి. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే అది కూడా ఈ ఏడాది పెంచారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బహిరంగ మార్కెట్‌కు, రికార్డుల్లో ఉన్న ధరలకు భారీ వ్యత్యాసం ఉన్న 20 శాతం ప్రాంతాల్లో మాత్రమే మార్కెట్ విలువలను పెంచారు. అయితే గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్యకాలంలో మూడేళ్లు వరుసగా మార్కెట్ విలువను పెంచి ప్రజలపై భారం మోపారు. 2015లో 20 నుంచి 25 శాతం, 2016లో 15 నుంచి 20 శాతం, 2017లో 10 నుంచి 15 శాతం వరకు విలువలు పెరిగాయి.

ప్రైవేట్ భవనాల పాపమూ బాబుదే..

రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లోనే నిర్వహించాల్సిన దుస్థితి గత ప్రభుత్వాల హయాం నుంచే ఉంది. ఈ పాపంలో ఎక్కువ భాగం చంద్రబాబుదే అని రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సంఘాల నాయకులు, దస్తావేజుల లేఖరులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యధిక కాలం చంద్రబాబు పాలన కొనసాగినా రిజిస్ట్రేషన్ శాఖ అవసరాలు గుర్తించడంలో, వాటికి సొంత భవనాలు నిర్మించడాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖకు అత్యధిక ఆదాయం వచ్చినా సక్రమంగా వినియోగించకపోవడం కారణంగానే ఇప్పటికీ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు.

పారదర్శకంగా సేవలు

రిజిస్ట్రేషన్ సేవలు అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల సేవలు అందించడానికి చర్యలు తీసుకున్నాం. దీనికి సంబంధించి మా శాఖ సిబ్బంది అందరికీ తగు ఆదేశాలు జారీ చేశాం. అలాగే కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. స్టాంప్ పేపర్ల కొరతను అధిగమించడానికి ఈ స్టాంపింగ్ సౌకర్యాన్ని కక్షిదారులు వినియోగించుకోవచ్చు. మధ్యవర్తుల మాట విని ఎవరూ నష్టపోకూడదు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో మా సిబ్బందికి పని ఒత్తిడి తగ్గుతుంది.

–కె.అబ్రహం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ, ఏలూరు

పెద్ద కష్టం తీరింది

▶ మొదటి పేజీ తరువాయి

పట్టా భూములు, ఇవే తరహాలోని మరో 60 వేల ఎకరాలకుపైగా భూముల్ని 22(ఎ) జాబితా నుంచి తొలగించింది. మొత్తం 3 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న లక్షల మంది రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చింది. తాజాగా 1.68 లక్షల సర్వీస్ ఈనాం భూములను 22(ఎ) జాబితా నుంచి తొలగించడం ద్వారా తాను పేద రైతుల పక్షపాతినని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారు.

2013లో పొరపాటున 22(ఎ)లోకి

1956లో ఈనాం చట్టం రావడంతో ఈనాం భూములను రద్దు చేసి, వారికి రైత్వారీ పట్టాలు ఇచ్చారు. దాని ప్రకారం చాలా మంది రైతులు పట్టాలు పొందారు. కొందరు రైతులు తమ అవసరాల కోసం అమ్ముకోగా, మరికొందరు వారసులకు ఇచ్చారు. 2013 వరకు ఈ రైత్వారీ పట్టాలను పట్టా భూములుగానే పరిగణించడంతో పట్టాదారులు సకల హక్కులు అనుభవించేవారు. 2013లో ఈ చట్టానికి సవరణ చేశారు. దేవాలయాలు, ధార్మిక సంస్థలకు ఇచ్చిన సర్వీసు ఈనాం భూములను ఉద్దేశించి ఈ సవరణ జరిగింది. ఆ సంస్థల్లో పని చేసే వారు ఆ సర్వీసును అందించినంత కాలం ఆ భూమిపైన వచ్చే ఫలసాయాన్ని అనుభవించడమే తప్ప అమ్ముకునేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా దేవాదాయ, ధార్మిక సంస్థలకు సంబంధించిన ఈనాం భూములను 22(ఎ)లో పెట్టారు. ఆ సమయంలో వాటితోపాటు గ్రామాల్లో చేతి వృత్తుల వారు అనుభవిస్తున్న ఈనాం భూములను కూడా 22(ఎ)లో చేర్చారు.

ఒడ్డున పడేసిన జగన్ ప్రభుత్వం

2013 వరకు ఆ భూములపై సర్వ హక్కులు అనుభవించిన రైతులు ఒక్కసారిగా తమ హక్కులను కోల్పోయినట్లయింది. ఈ తప్పును సరిచేసే అవకాశం ఉన్నా, గత ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. లక్షలాది మంది రైతులతో ముడిపడి ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలనే ఆలోచన గత ప్రభుత్వం చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్య రావడంతో పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగానే సర్వీసు ఈనాం భూములను 22(ఎ) జాబితా నుంచి తొలగించి 2013కు ముందున్న సర్వ హక్కులు కల్పించడానికి మంత్రివర్గం ఆమోదించింది. దీనివల్ల వివిధ కులవృత్తుల్లోని 1,13,610 మందికి చెందిన 1,68,604 ఎకరాల భూములకు విముక్తి లభించింది. తద్వారా ఆ రైతుల కుటుంబాలకు మేలు జరగనుంది.

సర్వీసు ఈనాం భూముల వివరాలు

జిల్లా	మొత్తం సర్వే నంబర్లు	మొత్తం విస్తీర్ణం	మొత్తం ఖాతాలు
వైఎస్సార్	19,641	27,752.16	17,387
నంద్యాల	9,026	27,679.21	15,051
కర్నూలు	6,725	25,649.75	11,710
ప్రకాశం	7,796	20,846.62	11,311
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	9,173	15,766.28	10,766
అనకాపల్లి	5,561	4,172.38	5,837
అన్నమయ్య	5,362	4,515.32	5,401
తిరుపతి	8,520	2,987.00	5,209
అనంతపురం	3,328	12,597.15	4,817
శ్రీ సత్యసాయి	2,991	6,177.63	4,216
పల్నాడు	1,754	5,690.73	3,599
తూర్పుగోదావరి	2,545	3,060.47	3,300
అంబేడ్కర్ కోనసీమ	1,480	1,322.31	2,418
పశ్చిమగోదావరి	2,817	1,424.55	2,268
విజయనగరం	3,766	1,315.34	2,104
పార్వతీపురం మన్యం	2,883	1,511.80	1,651
శ్రీకాకుళం	1,334	549.29	1,316
చిత్తూరు	1,734	654.47	1,201
విశాఖపట్నం	1,016	675.97	1,072
కాకినాడ	775	826.51	1,040
బాపట్ల	438	1591.99	1,040
గుంటూరు	230	694.58	436
ఏలూరు	430	847.63	321
ఎన్టీఆర్	47	292.52	136
అల్లూరి సీతారామరాజు	3	2.07	3
మొత్తం	99,375	1,68,603.71	1,13,610



అజ్ఞానమే ప్రతి దుష్టత్వానికీ
వేరూ, కాండమూ!
– ప్లేటో

సాక్షి
సోమవారం, 17 జూలై 2023

పట్టనట్టుండే రచయిత

ఆధునిక కాలంలో దాదాపు ఒక సన్యాసిగా బతికిన సుప్రసిద్ధ 'ఫ్రెంచ్' రచయిత మిలన్ కుందేరా జూలై 11న తన 94వ ఏట కన్నుమూశారు. ఒక దశ తర్వాత ఇంటర్వ్యూలు ఇవ్వడానికి నిరాకరించి, అధికారిక జీవిత చరిత్రలు రాయడానికి ఒప్పుకోక, జనానికి దూరంగా, తన గురించి వీలైనంత తక్కువ తెలిసేలా మసలుకున్నారు. రాతలోకి వచ్చినది మాత్రమే జీవితం; రచయిత వ్యక్తిగత జీవితం గురించిన కుతూహలం రచనల సమగ్రతను దెబ్బకొడుతుందనేది ఆయన భావన. కమ్యూనిస్టు రచయితగా మొదలైన కుందేరా, అనంతర కాలంలో ఆ భావజాలంతో పాటు తన మాతృదేశం చెకొస్లోవేకియాకూ, దాని పౌరసత్వానికీ, చివరకు తన మాతృభాష 'చెక్'కూ దూరం కావాల్సి వచ్చింది. మొదట్లో చెక్ భాషలోనే రాసినప్పటికీ, మలి దశలో ఫ్రెంచ్‌లోనే రాయడానికి నిర్ణయించుకున్నారు. తనను ఫ్రెంచ్ రచయితగానే చూడాలనీ, తన రచనలను ఫ్రెంచ్ భాషవిగానే పరిగణించాలనీ కోరారు.

1929 ఏప్రిల్ 1న జన్మించిన మిలన్ కుందేరా యవ్వనోత్సాహంలో కమ్యూనిస్టు విప్లవాన్ని సమర్థించినవాడే. సోషలిస్టు రష్యాకు జైకొట్టినవాడే. 24వ యేట మొదటి సంపుటి సహా, విప్లవ సమర్థనగా మూడు కవితా సంపుటాలను వెలువరించినవాడే. విమర్శక గొంతులను నిరసిస్తూ, ఇంకా ఎవరినీ లోపలేసి తాళాలు వేయడం లేదు కదా అని వాదించినవాడే. కానీ పై అధికారిని విమర్శించినందుకు ఒకసారీ, పార్టీలో సంస్కరణలు జరగాలని కోరినందుకు మరోసారీ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. దీనివల్ల తనకు విముక్తి లభించిన భావన కలిగిందని తర్వాత చెప్పారాయన. రాయాలనుకుంటున్న థీమ్స్ మీద పెట్టుకున్న మానసిక నిరోధం తొలగినట్టయి రచయితగా మరింత స్వేచ్ఛను పొందారు. ఆయన తొలి నవల 'ద జోక్'(1967)లో వినోదానికి అనుమతి లేని సంతోషంలో ఉంటారు మనుషులు. ప్రేయసికి రాసిన లేఖలోని ఒక సరదా వాక్యాన్ని (ఆశావాదం అనేది మానవాళి నల్లమందు) కూడా ఓ త్రిసభ్య కమిటీ విచారిస్తుంది. ఈ కారణంగా కథానాయకుడిని పార్టీ నుంచి బహిష్కరించే ఓటింగుకు ఆఖరికి కర్తవ్యోన్ముఖురాలైన అతడి ప్రేయసీ చెయ్యెత్తి సమ్మతిస్తుంది.

పార్టీ నుంచి బహిష్కరణ వల్ల కుందేరా తన ప్రొఫెసర్ ఉద్యోగం పోగొట్టుకుని, పియానో వాయించే తండ్రి వారసత్వంగా వచ్చిన సంగీతాన్ని పాఠాలుగా చెబుతూ, దినసరి కూలీగా పనిచేస్తూ, మారుపేరుతో పత్రికలకు జాతక ఫలాలు రాస్తూ బతకాల్సి వచ్చింది. ఆయన ఫోన్‌ను ట్యాప్ చేశారు. రచనలను నిషేధించారు. ఒక దశలో సీక్రెట్ పోలీసులు రాతప్రతుల కోసం ఆయన గదిని గాలించారు. అప్పుడే పూర్తయివున్న 'లైఫ్ ఈజ్ ఎల్స్‌వేర్'(1973) నవల రాతప్రతిని దాని పేరుకు తగినట్టుగానే స్నేహితుల సాయంతో అప్పటికే ఫ్రాన్స్‌కు తరలించారు. ఆ తర్వాత రెండేళ్లకు ఆయన ఫ్రాన్స్‌కు వెళ్లిపోయారు. 1979లో చెక్ పౌరసత్వం రద్దయింది. 1981లో ఫ్రాన్స్ పౌరసత్వం పొందారు. (నలభై ఏళ్ల తర్వాత, 2019లో మాత్రమే చెక్ పౌరసత్వాన్ని పునరుద్ధరించారు. గొప్ప చెక్ రచయిత పునరాగమనానికి ప్రతీకగా చూస్తున్నామని చెబుతూ, ఆ చర్యను గొప్ప గౌరవంగా అభివర్ణించింది ప్రభుత్వం.)

స్టాలినిస్టు కాని మనిషిని నేను సులభంగా గుర్తించగలిగేవాడిని; ఆయన నవ్వే విధానం నేను భయపడాల్సిన మనిషి కాదని చెప్పేది, అన్నారు కుందేరా. ఆయనకు అత్యంత ప్రసిద్ధి తెచ్చిపెట్టిన నవల 'ది అన్‌బేరబుల్ లైట్‌నెస్ ఆఫ్ బీయింగ్' (1984)లో కథానాయిక తమ కుక్కపిల్లను ఒడిలోకి తీసుకుని జోకొడుతూ, 'భయపడకు, భయపడకు, భయపడకు' అని దాన్ని ఊరడిస్తుంది. 'ద బుక్ ఆఫ్ లాఫ్టర్ అండ్ ఫర్‌గెటింగ్'(1979)లోని 'అధికారానికి వ్యతిరేకంగా మనిషి చేసే పోరాటం, మరపునకు వ్యతిరేకంగా జ్ఞాపకం చేసే పోరాటం' అనే వాక్యం చదివినప్పటినుంచీ తనతో ఉండిపోయిందనీ, ప్రపంచంలోని ఘటనల పట్ల తన అవగాహనను ప్రజ్వరిల్లజేసిందనీ చెబుతారు సల్మాన్ రష్దీ.

తన రచనా గదిలోని ఒక గోడకు తండ్రి ఫొటోనూ, తన అభిమాన సంగీత కారుడు లియోస్ యానాచెక్ ఫొటోనూ పక్కపక్కనే పెట్టుకున్న కుందేరా, నవల మాత్రమే సాధించేది సాధిస్తూనే అది ఒక మ్యూజికల్ నోట్‌లా ఉండాలనీ, నవలలోని అందరి కథనాలూ ఏకసూత్రతతో లయబద్ధంగా అమరాలనీ అంటారు. ఒక కామా కూడా ఉండాల్సిన చోట లేకపోతే నచ్చని పర్ఫెక్షనిస్టు ఆయన. చిత్రంగా ఆయన మొదటి నవల జోక్ ఆంగ్లంలో వచ్చినప్పుడు, తన నియంత్రణలో లేని అనువాదం కారణంగా అధ్యాయాలు తారుమారయ్యాయి. దీనివల్ల 'ఐరనీ' కాస్తా 'సెటైర్' అయ్యింది. 1992లో మాత్రమే ఆయనకు సంతృప్తి కలిగించే అనువాదం వచ్చింది. ఆంగ్లభాషలో ఇది ఐదో వెర్షన్ అని ఆయనే ముందుమాట రాస్తూ నవ్వుకున్నారు. అయితే నవలల పేర్ల విషయంలో మాత్రం ఆయనకు పట్టింపు లేదు. ఒక నవల పేరును ఇంకో నవలకు పెట్టినా సరిగ్గా సరిపోతుందంటారు. తనను పీడించే అంశాలు పరిమితమైనవనేది ఆయన ఉద్దేశం. 2015లో వచ్చిన 'ద ఫెస్టివల్ ఆఫ్ ఇన్‌సిగ్నిఫికెన్స్' ఆయన చివరి నవల. మలి దశ రచనల్లో రాజకీయాల కంటే తత్వానికి ప్రాధాన్యం ఇచ్చిన కుందేరా, జీవితానికి రెండో అవకాశం లేకపోవడం కూడా ఒక విముక్తి లాంటిదేనంటారు. ప్రపంచ వ్యాప్తంగా జనాలు అర్థం చేసుకోవడం కంటే తీర్పులు ఇవ్వడానికే ఇష్టపడుతున్నారంటూ, ప్రపంచంలోని ఘటనలను మరీ అంత సీరియస్‌గా తీసుకోకపోవడం కూడా ఒక ప్రతిఘటనే అని చెబుతారు. అన్నీ పట్టించుకుంటూనే ఏమీ పట్టనట్టుగా ఉండాలంటే చాలా సంయమనం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం
తిథి: అమావాస్య రా.10.38 వరకు, తదుపరి అధిక శ్రావణ శు.పాడ్యమి,
నక్షత్రం: పునర్వసు తె.4.44 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి పుష్యమి,
వర్జ్యం: ప.3.43 నుండి 5.26 వరకు, **దుర్ముహూర్తం:** ప. 12.31 నుండి 1.23 వరకు,
తదుపరి ప.3.05 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** రా.2.06 నుండి 3.50 వరకు,
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు,
సూర్యోదయం: 5.37, **సూర్యాస్తమయం:** 6.34, కర్కాటక సంక్రమణం, దక్షిణాయనం ప్రారంభం.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి.
ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆనాటి ఐక్యత ఏదీ?

తెలుగు నేల మీద మరిచిపోలేని నరమేధం 'కారంచేడు' ఘటన. 1985 జూలై 17న కుల దురహంకారులు దళితులపై జరిపిన మారణకాండ దళితుల స్మృతిపథం నుండి ఇంకా చెరిగిపోలేదు. ఈ దాడికి వ్యతిరేకంగా ఆనాడు జరిగిన దళిత ఉద్యమం నుండి స్ఫూర్తిని పొందడం ఒక చారిత్రక అవసరం. ఒకవైపు 'దళిత మహాసభ', మరోవైపు విప్లవ శిబిరం నుండి వచ్చిన మేధావులు; మరోవైపు బీసీ నాయకులు ఆనాడు బాధితులకు అండగా నిలిచారు. సిద్ధాంతాలు పక్కన పెట్టి, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడడం చరిత్రాత్మకం. కానీ, ఇవాళ వెనక్కి తిరిగి చూసుకుంటే ఎందుకు ఆనాటి ఐక్యత కనిపించడం లేదు?

దళితుల మీద దాడులు జరిగినప్పుడు ముందుకొచ్చే నాయకులు, ఆ తరువాత కాలంలో ఏం చేస్తున్నట్టు? ఆ పరిమిత కాలం వరకే దళిత, బహుజన కార్యాచరణ పరిమితమైతే అది అంబేడ్కరిజానికి న్యాయం చేయదు. కారంచేడు తరువాత 'చుండూరు', 'పదిరికుప్పం', 'లక్ష్మిపేట', 'ప్యాపిలి' నుండి 'రోహిత్ వేముల' పోరాటం దాకా... దళిత, బీసీ నాయకుల మధ్య సయోధ్య సన్నగిల్లింది. ఇది కూడా ఒక రకంగా మనువాదమే! మనువాదం మనుషులను కులాలుగా విడదీస్తే, బహుజనవాదం అందరినీ ఒక్క చోటుకు చేరుస్తుంది. ఈ నేపథ్యం నుండి చూస్తే కారంచేడు మృతవీరుల నుండి మనం పొందవలసిన స్ఫూర్తి ఏమిటి? ఆనాడు బాధితులకు కొండంత ధైర్యాన్ని అందించిన నాయకత్వ ఐక్యత ఎందుకు నేడు లోపిస్తున్నది అనే దిశలో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

1990ల తరువాత తెలుగు సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక మార్పులు వేగవంతమయ్యాయి. అలాగే కారంచేడు, చుండూరు స్ఫూర్తితో దళిత ఉద్యమాన్ని సాంస్కృతిక రంగం కూడా ప్రభావితం చేసింది. అనేకమంది ఉద్యమకారులు, నాయకులు అందివచ్చారు. మరీ ముఖ్యంగా దళితోద్యమ పరిణామాల మీద అనేక విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ చైతన్యమే ఆ తరువాత విప్లవ, వామపక్ష పార్టీల్లో సైతం కులం ప్రశ్నను లేవనెత్తింది. ఈ పరిణామం తెలుగు సమాజంలోనే కాదు యావత్ దేశంలోనే దళిత చైతన్యానికి దారులు వేసిందంటే అతిశయోక్తి కాదు. ఒక రకంగా దళిత మేధావులు, కవులు, రచయితలు సంధించిన ప్రశ్నలు కమ్యూనిస్టు పార్టీలను ఒక కుదుపునకు గురిచేశాయి. ఇవాళ బహుజన ఐక్యతను భుజాన వేసుకోవాల్సిన బాధ్యత ఈ దళిత, బీసీ మేధావుల మీదే ఉంది. బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడు మాత్రమే దళితుల మీద దాడులు ఆగుతాయన్న మాన్యవర్ కాన్షీరామ్ మాటల్ని గుర్తు పెట్టుకుందాం. కారంచేడు రుధిర క్షేత్రం నుండి అలాంటి స్ఫూర్తిని పొంది, రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుజనులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి.

– డా॥ పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ । 77026 48825
(నేడు కారంచేడు మృతవీరుల దినం)

ఈ భరోసా ఇంకెక్కడైనా ఉందా?



- సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రాయితీ
- ఈ నాలుగేళ్లలో రూ.1,835 కోట్లు సున్నా వడ్డీ రాయితీ కింద జమ
- రైతు ఆత్మహత్య చేసుకుంటే బాబు హయాంలో పరిహారం రూ.5 లక్షలు
- అందులోనూ ప్రతి కుటుంబం నుంచి 1.5 లక్షలు అప్పులకే జమ
- మిగిలిన డబ్బులు డిపాజిట్... దానిపై వచ్చే వడ్డీయే కుటుంబీకులకు
- ఎనిమిది, పదేళ్ల తరువాత అసలు మొత్తం కుటుంబం ఖాతాలోకి
- అన్నింటికీ మించి పార్టీ నాయకులు సిఫారసు చేసిన వారికే వర్తింపు
- ఈ ప్రభుత్వం వచ్చాక రూ.7 లక్షలకు పెంపు.. మొత్తం చెల్లింపు
- పార్టీలకు అతీతంగా... గతంలో బాబు ఎగ్గొట్టిన వారికీ పరిహారం
- పాత బకాయిలతో కలిసి ఈ నాలుగేళ్లలో 107 కోట్లకు పైగా చెల్లింపు
- రూ.47 కోట్లే చెల్లించారంటూ 'ఈనాడు' తప్పుడు రాతలు
- రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్నెన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు
- రైతును ఆదుకోవటంలో ఏపీని అగ్రగామిగా ప్రశంసిస్తున్న కేంద్రం
- ఇతర రాష్ట్రాలు సైతం ఏపీని ఆదర్శంగా తీసుకుంటూ పలు కార్యక్రమాలు
- ఈ నాలుగేళ్లలో రైతులకు రూ.1.71 లక్షల కోట్ల లబ్ధ చేకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇన్ని చేస్తున్నా... వాస్తవాలకు ముసుగేస్తూ 'ఈనాడు' దుర్మార్గపు కథనాలు
- జనం నవ్వి పోతున్నారని తెలిసి కూడా దిగజారుడు రాతలు

నిజాలతో పనిలేదు. క్షేత్రస్థాయి వాస్తవాలు పట్టనే పట్టవు. కేవలం బురద జల్లడానికి ఓ కథనం. అధికారంలో ఉన్నది వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాబట్టి... ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేలా దారుణమైన అసత్యాలు రాయటం. నిత్యం ఇదేనా రామోజీ? అసలు తెలంగాణలో ఉన్న ఓ పథకాన్ని... ఇక్కడ ఆత్మహత్యలకు మాత్రమే వర్తించే పథకంతో ఎలా పోలుస్తారు రామోజీ? కాస్తయినా ఇంగితం ఉండాలి కదా?

తెలంగాణలో రైతులందరికీ ఏక మొత్తంగా టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను అమలు చేస్తున్నారనుకుందాం... దాన్ని ఇక్కడ ఆత్మహత్యలు చేసుకున్న రైతులకిచ్చే పరిహారంతో పోలుస్తారా? మరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో వేసిన ప్రతి ఎకరాకూ... ప్రతి పంటకూ ఉచితంగా బీమా చేస్తోంది. రైతులపై ఒక్క రూపాయి భారం కూడా లేకుండా ప్రతి ఏటా మొత్తం ప్రీమియాన్ని తనే కడుతోంది. ఇది తెలంగాణలో ఉందా?

ప్రతి రైతునూ బతికించాలని.. ఒకవేళ వారు గనక పంట నష్టపోతే పరిహారాన్ని ఇప్పించాలనే అత్యున్నత లక్ష్యంతో అమలు చేస్తున్న పథకం తెలంగాణలో లేదని అక్కడ మీ పత్రికలో ఎప్పుడైనా రాశారా? ఎందుకింత దుర్మార్గపు రాతలు? దీన్ని పాత్రికేయమంటారా? ఇన్నేళ్లు వచ్చినా ఇంకా చంద్రబాబు కాక పోతే... అన్న రీతిలోనే కథనాలు రాస్తే ఎలా?

ఈ రాష్ట్రంలో మాదిరి రైతు భరోసా కేంద్రాలు గానీ, విత్తు నుంచి విక్రయం వరకూ రైతును చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థ కానీ మరే రాష్ట్రంలోనైనా ఉందా? అలాంటివి ఎప్పుడైనా రాశారా? ఇంత నీచపు రాతలతో ఇంకెన్నాళ్లు మీ పత్రికను నడపగలరు? 'అన్నంపెట్టే రైతులకు ఇదేనా భరోసా?' అంటూ 'ఈనాడు' పత్రిక కక్కిన విషంలో నిజమెంత? ఏది నిజం?

ఏది నిజం?

ఒక వ్యక్తి చనిపోయాక ఇచ్చే నష్టపరిహారం... ఆ వ్యక్తి కుటుంబానికి తప్ప తనకు వ్యక్తిగతంగా ఏమాత్రం ఉపయోగపడదన్నది కాదనలేని వాస్తవం. అందుకే ఏ ప్రభుత్వమైనా మరణించాక ఆ కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నాలు చేయటంతో పాటు... తనను బతికించడానికి... వీలైనంత సుఖసంతోషాలతో బతికించడానికి ప్రయత్నించాలి. ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్నది అదే. అందుకే వ్యవసాయాన్ని తన ప్రాధాన్యాల్లో ఒకటిగా చేసుకున్నారు ముఖ్యమంత్రి జగన్. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విత్తనాలు అందించటం దగ్గర నుంచి పండిన పంటను విక్రయించుకునేంత వరకూ రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. దీని కోసం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలందుకున్నాయి. అంతేకాదు..ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, ఆర్బీకే ఛానల్, నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్, ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవాకేంద్రాలు, ఆర్బీకే స్థాయిలో కొనుగోలు కేంద్రాలు, పంట చేతికొచ్చాక రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు ఆర్బీకేలకు అనుబంధంగా గోడౌన్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్యాక్ హౌస్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో. తెలంగాణలోనే కాదు. ఇవన్నీ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవు. ఈ విషయాన్ని రాష్ట్రానికి వస్తున్న కేంద్ర మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు పదేపదే చెబుతున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రతినిధులు వచ్చి అధ్యయనం చేసి తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామంటూ వెళుతున్నారు. కానీ... 'ఈనాడు'కు ఇవేవీ పట్టవు. దానికి కావాల్సిందల్లా ఇంత బురద... ఇంత విషం. అంతే!. అందుకోసం ఏదో ఒక అంశాన్ని తీసుకుని... నోటికొచ్చిన అంకెలతో కథనాన్ని వండి వారుస్తుంది. ఈ పత్రిక పాఠకులు కూడా ఈ తప్పుడు వార్తలు చదవటానికి అలవాటు పడిపోయారన్నది రామోజీ నమ్మకం.

ఏపీలో ఆత్మహత్యలు తగ్గాయన్న కేంద్రం

గడిచిన మూడేళ్లలో ఏపీలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని సాక్షాత్తు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ 2023 ఫిబ్రవరి 7న లోక్‌సభలో చెప్పారు. అది కూడా ఏపీలో రైతుల ఆత్మహత్యలపై టీడీపీ ఎంపీ కేశినేని నాని లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా!!. రామోజీరావుకు మాత్రం ఇవేవీ కనిపించవు. చావులతో రాజకీయాలు చేయడం, శవాలపై పేలాలు ఏరుకోవటం రామోజీ, చంద్రబాబు ద్వయానికి చిన్నప్పటి నుంచీ తెలిసిన విద్య. నిజానికి ఎక్కడైనా ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య తక్కువగా ఉందంటే హర్షిస్తారు. కానీ దుష్టచతుష్టయం ఉడికిపోతోంది. రైతు సంక్షేమానికి ప్రతి దశలోనూ చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. అనివార్య కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడితే ఆ రైతు కుటుంబాలకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది.

గతంలో పరిహారం ఘోరం... ఇప్పుడు 7 లక్షలు

గతంలో చంద్రబాబు జమానాలో ఆత్మహత్యకు పాల్పడిన రైతుల్ని... అన్నిటికన్నా ముందుగా వారు తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులా? కాదా? అన్నది చూసేవారు. అన్నీ ఓకే అయి... తమ పార్టీ నాయకులు గనక సిఫారసు చేస్తే... ఆ రైతులకు పేరుకు రూ.5 లక్షల పరిహారం ఇచ్చేవారు. కానీ దీన్లో రూ.1.5 లక్షల్ని అప్పులకు జమ చేసుకుని, మిగిలిన 3.5 లక్షలు కూడా విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా దాన్ని డిపాజిట్ చేసి... దానిపై వచ్చే వడ్డీని మాత్రమే వాడుకునే పరిస్థితి కల్పించేవారు. ఎప్పుడో ఐదేళ్లకో.. పదేళ్లకో ఆ డబ్బును విత్ డ్రాచేసుకునే అవకాశం ఉండేది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పరిహారాన్ని రూ.5 లక్షలనుంచి రూ.7 లక్షలకు పెంచడమే కాదు. ఆ మొత్తాన్ని నేరుగా ఆత్మహత్యలకు పాల్పడే రైతు కుటుంబాల ఖాతాలకు జమ చేస్తోంది. కౌలు రైతు అయినా వ్యవసాయ కారణాలతో చనిపోతే దేశంలో రూ.7 లక్షల పరిహారం ఇస్తున్నది ఒక్క మన రాష్ట్రంలోనే. ఇతర రాష్ట్రాల్లో కౌలు రైతులకు బీమా, ఇతర ఆర్థిక సహాయం లేనే లేదు. 2019 నుంచి ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్న 1197 మంది రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ.83.79 కోట్ల పరిహారం చెల్లించింది. బాబు జమానాలో 2014–2018 మధ్య ఆత్మహత్య చేసుకున్న 450 మంది రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.20.12 కోట్లు అందిస్తే, రాజకీయాలకతీతంగా ఆదుకోవాలన్న సంకల్పంతో బాబు హయంలో చనిపోయిన రైతు ఆత్మహత్యలను పునఃపరిశీలన చేసి... తిరస్కరణకు గురైన మరో 474 మందికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ. 23.70 కోట్ల ఆర్థికసాయం అందించారు జగన్. ఇలా ఇప్పటి వరకు పాత బకాయిలతో కలిపి 1671 మందికి రూ.107.49 కోట్ల పరిహారం అందిస్తే 'ఈనాడు' మాత్రం రూ.47 కోట్లు మాత్రమే ఇచ్చారని తన నోటికి వచ్చిన అంకెను అచ్చేసేసింది. మార్గదర్శిలో ఇలాంటి తప్పుడు లెక్కలు చెప్పీ చెప్పీ ఆరితేరిపోయిన రామోజీకి ఇలాంటివన్నీ కొట్టిన పిండేనని ఇవి చూస్తే అర్థంకాకమానదు.

పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా

రైతులపై పైసా భారం పడకుండా 2019 ఖరీఫ్ నుంచి ప్రభుత్వమే డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాను అమలు చేస్తోంది. ఈ– క్రాప్‌లో ప్రతి ఎకరాన్నీ నమోదు చేస్తూ... పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వ బకాయిలతో కలిపి ఈ నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.7802 కోట్ల బీమా పరిహారం చెల్లించారంటే... రైతును ఆదుకోవాలన్న ముఖ్యమంత్రి తపన అర్థమవుతుంది. అంతేకాదు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బ తింటే.. ఆ సీజన్ ముగియకముందే పరిహారం చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. ఇలా గత ప్రభుత్వబకాయిలతో కలిపి 2019–20 నుంచి ఇప్పటి వరకు సంభవించిన వివిధ రకాల వైపరీత్యాలకు సంబంధించి 22.74 లక్షలమంది రైతులకు రూ.1965 కోట్ల పంట పరిహారాన్ని చెల్లించింది సర్కారు. ఇక వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద రూ.లక్ష లోపు తీసుకున్న పంట రుణాన్ని సకాలంలో చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ నేరుగా వారి పొదుపు ఖాతాలకే జమచేస్తున్నారు. గత ప్రభుత్వ బకాయిలతో కలిపి 2019 నుంచి ఇప్పటి వరకు 73.88 లక్షల రైతులకు రూ.1835 కోట్లు సున్నా వడ్డీ రాయితీని అందించారు.

హామీకి మించి వైఎస్సార్ రైతు భరోసా...

ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లకు రూ.50 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మిన్నగా ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 చొప్పున ఆర్థిక సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు ముఖ్యమంత్రి జగన్. వరుసగా ఐదో ఏడాది తొలి విడత సాయంతో కలిపి ఇప్పటి వరకు ప్రతీ రైతుకు రూ.61,500 చొప్పున ఆర్థిక సాయం అందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతు కుటుంబాలు, దేవాదాయ, అటవీ భూమి సాగుదారులకు ఏటా రూ.13,500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా రైతు భరోసా సాయం అందిస్తోంది. 2019–20 నుండి ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 52.38 లక్షల రైతు కుటుంబాలకు రూ.30985.30 కోట్ల లబ్ధి చేకూర్చింది. మొత్తంగా రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఇప్పటివరకూ ఏకంగా 1.71 లక్షల కోట్లు ఖర్చు చేసిందంటేనే... ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియక మానదు.

వైఎస్సార్ యంత్ర సేవ పథకం...

సన్న, చిన్నకారు రైతులకు అద్దె ప్రాతిపదికన వ్యవసాయ యంత్ర పరికరాలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తేవటానికి 'వైఎస్సార్ యంత్ర సేవ పథకం' తెచ్చింది ప్రభుత్వం. ఇప్పటివరకు రూ.1052.42 కోట్ల విలువైన యంత్ర పరికరాలతో 10,444 ఆర్బీకే, 492 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం రైతు గ్రూపులకు. రూ.366.25 కోట్ల రాయితీని ప్రభుత్వం చెల్లించింది. ఇక కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు పంట సాగుదారు హక్కుల చట్టం(సీసీఆర్‌ఏ)–2019ను తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ఏటా సీసీఆర్సీ కార్డులను జారీచేయడం ద్వారా పంట రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను అందిస్తోంది. రైతులకోసం ఇన్ని చేస్తున్నా... 'ఈనాడు'కు మాత్రం ఏమీ కనపడకపోవటం విచిత్రమే.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్న ధ్యేయంతో రైతు సంక్షేమానికి గ్రామ స్థాయిలో 10,778 ఆర్బీకేలను ఏర్పాటు చేసి... వీటి ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలు, సర్టిఫై చేసిన నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను అందించడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరవేయడం,, పంటల ఉత్పత్తుల కొనుగోలు చేసే కేంద్రాలుగా ఆర్బీకేలు పని చేస్తున్నాయి.
- ధాన్యంతో సహా వివిధ రకాల పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పూర్తిగా ఆర్బీకేలు వేదికగా రైతుల కళ్లా నుంచే జరుగుతున్నాయి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించేందుకు 'పొలంబడి' నిర్వహిస్తున్నారు. 2019–20 నుండి ఇప్పటి వరకు 54,531 పొలంబడులను నిర్వహించి 16.36 లక్షల మంది రైతులను పర్యావరణ అంశాలను అధ్యయనం చేసి సమిష్టి నిర్ణయం తీసుకొనేలా శిక్షణ ఇచ్చారు.
- రోజూ రైతుల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడానికి, వారి సందేహాలను తీర్చడానికి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఉంది. క్షేత్ర స్థాయిలో పురుగులు, తెగుళ్ల సందేహాలను కూడా వాట్సాప్ గ్రూప్ ద్వారా నిపుణులైన శాస్త్రజ్ఞులతో నివృత్తి చేస్తున్నారు.
- ఆర్బీకే ఛానల్ ద్వారా ఆధునిక టెక్నాలజీని పరిచయం చేయడం, వివిధ పంటల యాజమాన్యం, వివిధ శాఖలలో జరిగే సంక్షేమ కార్యక్రమాల ప్రసారాలను చేస్తున్నారు.

2019- 2023 ఇప్పటి వరకు జరిగిన రైతు ఆత్మహత్యలు..అందించిన ఆర్థిక సాయం వివరాలు...

సంవత్సరం	రైతు ఆత్మహత్యలు	ఎక్స్‌గ్రేషియా మొత్తం (కోట్లలో)
2019	317	22.19
2020	292	20.44
2021	249	17.43
2022	303	21.21
2023 ఇప్పటి వరకు	36	2.52
2014-18 మధ్య పరిహారం దక్కని వారు	474	23.70
మొత్తం	1671	107.49

పగలు 9 గంటలు నిరాటంకంగా ఉచిత విద్యుత్ ఇస్తున్నదెక్కడ?

గతంలో 9 గంటలు నిరాటంకంగా విద్యుత్ ఇద్దామన్నా... ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1,700 కోట్లతో సబ్‌స్టేషన్లు, ఫీడర్లను ఆధునీకరించి సరఫరాలో నాణ్యత పెంచారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. అనంతరం వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. వ్యవసాయ విద్యుత్తుపై నాలుగేళ్లలో రూ.40వేల కోట్లు ఖర్చు చేయటమే కాక... వచ్చే 30 ఏళ్ల పాటు రైతన్నలకు ఉచిత వ్యవసాయ విద్యుత్తుకు ఢోకా లేకుండా ఎస్ఈసీఐతో ఒప్పందం చేసుకుని 10 వేల మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఆక్వా రైతులకు లబ్ధి కలిగేలా యూనిట్ కరెంట్ కేవలం రూ.1.50కే సరఫరా చేస్తోంది. వీరికి నాలుగేళ్లలో రూ.2,968 కోట్లు సబ్సిడీగా అందించింది. గత ప్రభుత్వం ఎగ్గొట్టిపోయిన కరెంటు బకాయిలు రూ.8845 కోట్లు కూడా చెల్లించింది.

ధరల స్థిరీకరణ నిధితో భరోసా

గతంలో ఎన్నడూ లేని విధంగా మిరప, పసుపు, ఉల్లి, చిరుధాన్యాలు, అరటి, బత్తాయి పంటలకు కూడా కనీస మద్దతు ధర ప్రకటించి ఆయా రైతుల్ని ఆదుకున్నది ఈ ప్రభుత్వమే. ప్రతి రైతుకు తాము పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారు. సీఎం యాప్ ద్వారా పంట ఉత్పత్తుల ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... మార్కెట్‌లో ధరలు పతనమైన ప్రతీసారి జోక్యం చేసుకుని రైతులకు మద్దతునిస్తోంది. గతంలో మాదిరి దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆర్బీకేల ద్వారా కల్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేస్తోంది. జీఎల్టీ (గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీలు) రూపేణా క్వింటాకు రూ.300 చొప్పున ఎమ్మెస్పీకి అదనంగా చెల్లిస్తోంది. లంచాలకు తావు లేకుండా 21 రోజుల్లోనే నేరుగా రైతన్నల ఖాతాలకు నేరుగా ధాన్యం డబ్బులు జమ చేస్తోంది.

ఇవన్నీ కన్పించలేదా?

ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో 62.16 లక్షల మంది రైతులకు విత్తనాల సబ్సిడీ కింద రూ. 1055 కోట్లు చెల్లించింది. గత ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొట్టిపోయిన విత్తన బకాయిలు రూ. 384 కోట్లు చెల్లించింది. శనగ రైతులకు బోనస్ కింద రూ.300 కోట్లు ఇచ్చింది. మైక్రో ఇరిగేషన్లో పండ్ల తోటలు అభివృద్ధి చేసేలా 4.5 లక్షల మంది రైతులకు మేలు చేస్తూ.. రూ. 2012 కోట్లు ఖర్చు చేసింది. 37 వేల మంది ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ కింద రూ. 172 కోట్లు అందజేసింది. గత ఏడాది రూ.1.69 లక్షల కోట్ల రుణాలు రైతులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా, అంతకు మించి పంపిణీ చేసింది. కౌలు రైతులు సహా, మొత్తం 119.41 లక్షల రైతులకు రూ. 2.26 లక్షల కోట్ల రుణాలు అందించింది. 2019 ఖరీఫ్ నుంచి ఈ ఏడాది ఖరీఫ్ వరకు 4.46లక్షల మంది రైతులకు రూ. 6.92లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసింది. ఇదీ... ఈ ప్రభుత్వం ఘనత. రైతులకు ఈ ప్రభుత్వమిస్తున్న భరోసా!!.

చంద్రబాబు హయాంలో ఏం చేశారంటే...

- రైతుల రుణాలు రూ. 87,612 కోట్లు బేషరతుగా మాఫీ చేస్తానని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, దాన్ని అమలు చేయలేదు. ఉచిత కరెంటు పథకాన్ని ప్రకృతికి వదిలేశారు. - ఉచిత పంటల బీమా కింద ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన ప్రీమియం సకాలంలో కట్టకపోవడంతో, పంటలు నష్టపోయినా రైతులకు పరిహారం అందలేదు. - ఇంక సున్నా వడ్డీ పంట రుణాల కింద ఇవ్వాల్సిన వడ్డీ రాయితీని ఎగ్గొట్టారు. 2014 నుంచి 2019 వరకు 39 లక్షల మంది రైతులకు వడ్డీ రాయితీ చెల్లించకుండా రూ.1180.66 కోట్లు బకాయి పెట్టిపోతే, ఈ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఆ మొత్తం జమ చేసింది. - ధాన్యం సేకరణల విషయంలో రైతులను మిల్లర్లకు, మధ్యవర్తులకు వదిలేశారు.
- చంద్రబాబు హయాంలో ఏటా 153.95 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయితే, ఈ ప్రభుత్వ హయాంలో ఏటా సగటున 165.39 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. - అప్పుడు 5 ఏళ్లలో 1623 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తే, ఈ నాలుగేళ్లలో ఒక్క మండలంలో కూడా కరువు పరిస్థితులు లేవు.
- చంద్రబాబు హయాంలో రైతులకు రూ. 3,64,624 కోట్ల రుణాలు పంపిణీ చేస్తే, ఈ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే రూ.6,92,402 కోట్ల రుణాలు రైతులు అందజేసింది. - బాబు పాలనలో రైతు భరోసా కేంద్రాలు లేవు. ఈ–క్రాప్ అన్న భావనే లేదు. దాంతో పంటల సాగుపై ఎలాంటి వాస్తవ డేటా ప్రభుత్వం దగ్గర ఉండేది కాదు. అంతా గాల్లో దీపమే.

క్లుప్తంగా...

విశాఖలో మేజర్ పోర్టు చైర్మన్ల భేటీ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న మేజర్ పోర్టు చైర్మన్లు

సాక్షి, విశాఖపట్నం: మేజర్ పోర్టులు, ఫెడరేషన్ల మధ్య 4వ ద్వైపాక్షిక చర్చల కమిటీ సమావేశానికి విశాఖ వేదికైంది. ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్(ఐపీఏ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో దేశంలోని అన్ని మేజర్ పోర్టుల చైర్మన్లు, ఫెడరేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. క్లాస్–3, 4 ఉద్యోగులకు సంబంధించి వేతన సవరణ అంశాలను చర్చించారు. విశాఖ పోర్టులో ఉద్యోగులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు వివరించారు. క్లాస్–3, 4 వేతన సవరణ ముఖ్యాంశాలు సమర్థవంతంగా అమలు చేయటంలో తమ వంతు మద్దతిస్తామని ఫెడరేషన్ల ప్రతినిధులు ఐపీఏకు చెప్పారు.

నిబంధనల ప్రకారమే శ్రీవాణి ట్రస్ట్ నిధుల వినియోగం

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, పునరుద్ధరణకు నిబంధనల ప్రకారం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఆదివారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు శ్రీవాణి ట్రస్ట్‌కు 9 లక్షల మంది రూ.880 కోట్ల విరాళా లిచ్చినట్లు తెలిపారు. వీటితో 2,500 ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. తిరుమలలో యూపీఐ విధానంలో చెల్లింపులు చేసి గదులు పొందిన భక్తులకు వారు గదులు ఖాళీ చేసిన వెంటనే కాషన్‌డిపాజిట్ మొత్తం రీఫండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఎల్లో మీడియాలోనే రాజధాని ఉద్యమం

- 1022వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతల ఎద్దేవా



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అమరావతి ఉద్యమం ఎల్లో మీడియాలో తప్ప రాజధాని 29 గ్రామాల్లో ఎక్కడా కనిపించడం లేదని బహుజన పరిరక్షణ సమితి నేతలు ఎద్దేవా చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1022వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరంలో పలువురు ముఖ్య అతిథులు పాల్గొని ప్రసంగించారు. గత టీడీపీ పాలనను అడ్డుపెట్టుకుని పేదల సొమ్మును మార్గదర్శి వంటి సంస్థల ద్వారా బొక్కేసిన రామోజీ వంటి గద్దలను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈపూరి ఆదాం, పల్లె బాబు, బొలిమేర శామ్యూల్, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తాం : నారా లోకేశ్



కందుకూరు: టీడీపీ అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని, భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివా రం నెల్లూరు జిల్లా వలేటివారిపాలెంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి అర్హులకు సక్రమంగా అందడం లేదన్నారు. జగనన్న సురక్ష పేరుతో ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారని ఆరోపించారు. తా ము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు.

విజయవాడలో సుధ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం



ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో అతిథులు

అమరావతి: విజయవాడలోని ఎంజీ రోడ్డులో సుధ ఫెర్టిలిటీ సెంటర్ ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ ప్రసాద్ (డీఎం నెఫ్రాలజీ), బేతం రాజేష్ బాబు, రత్నకమల్ బాబు, విద్యాపూర్ణం, ,డాక్టర్ కే సుధాకర్ (ఎండీ సుధ హాస్పిటల్స్), డాక్టర్ ప్రదీప సుధాకర్ (వైస్ ప్రెసిడెంట్, సుధ ఫెర్టిలిటీ సెంటర్), డాక్టర్ సాయి పుష్ప (కన్సల్టెంట్, సుధ ఫెర్టిలిటీ సెంటర్, సుజాత అయ్యప్పన్ (సుధా ఫెర్టిలిటీ సెంటర్,సీఈవో) తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు పర్యాటకం.. కొత్త అందాల నిలయం

కొల్లేరులో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.187 కోట్లతో ప్రణాళిక

- కొల్లేరు మండలాల్లో 20 ప్రాంతాలను గుర్తించిన అటవీ శాఖ
- ఆటపాక, మాధవాపురం పక్షుల కేంద్రాలకు మెరుగులు



ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరు పర్యాటకం కొత్త పుంతలు తొక్కనుంది. కొల్లేరు మండలాల్లో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి రూ.187 కోట్లు ఖర్చు కాగల ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. అటవీ, పర్యాటక శాఖల అధికారులు ఇప్పటికే 20 పర్యాటక ప్రాంతాలను కొల్లేరులో గుర్తించారు. రానున్న రోజుల్లో కొల్లేరు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో విశిష్ట స్థానాన్ని దక్కించుకుంటుందని పర్యావరణ విశ్లేషకులు భావిస్తున్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో కుదిరిన ఒప్పందాల ప్రకారం ఒబెరాయ్, నోవాటెల్, హయత్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకొస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు కావడంతో విదేశీ పర్యాటకులు సైతం కొల్లేరు పర్యటనకు ఇష్టపడుతున్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారు.



కొల్లేరులో పక్షుల అందాలు

టెంపుల్ టూరిజం సర్కిల్‌గా కొల్లేరు

కొల్లేరు అందాలకు అదనపు ఆకర్షణగా టెంపుల్ టూరిజం మారనుంది. రాష్ట్రంలో అత్యధిక భక్తులు వచ్చే 100 ఆలయాల్లో ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయస్వామి, పంచారామ క్షేత్రాలైన భీమవరం ఉమాసోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి, భీమవరం మావుళ్లమ్మ, కొల్లేటి పెద్దింట్లమ్మ ఆలయాలు ఉన్నాయి. ఇప్పటికే కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద రూ.5 కోట్లతో సమీప జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా అనివేటి మండపం నిర్మిస్తున్నారు. మరోవూపు కైకలూరు మండలం సర్కారు కాలువ వంతెన వద్ద రూ.14.70 కోట్ల నిధులతో వారధి నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ వంతెన ద్వారా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు ప్రయాణ దూరం తగ్గుతుంది. నేరుగా ఆర్టీసీ బస్సులు కొల్లేరు గ్రామాలకు రానున్నాయి.

పర్యాటకానికి పెద్ద పీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే కొల్లేరులో టూరిస్ట్ పాయింట్లను గుర్తించాం. ఎకో, టెంపుల్ టూరిజాలకు కొల్లేరు చక్కటి ప్రాంతం. పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతాం.

– ఎండీహెచ్ మెహరాజ్,
పర్యాటక శాఖ అధికారి

పక్షుల కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు



ఆటపాక, మాధవాపురం పక్షుల కేంద్రాల్లో యాత్రికుల కోసం అటవీ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పక్షుల విహార చెరువు గట్లను పటిష్టపరిచాం. ఎక్కువగా విదేశీ, స్వదేశీ పక్షులు విహరిస్తున్న, పర్యాటకులు చూసే అవకాశం కలిగిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను చేయిస్తున్నాం.

– జె.శ్రీనివాసరావు,
ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కైకలూరు

పర్యాటక రంగానికి ఊతం

కోవిడ్ వల్ల దెబ్బతిన్న పర్యాటక శాఖకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.198.50 కోట్ల ప్యాకేజీని కేటాయించింది. ఇందులో భాగంగా ఇటీవల రూ.2 కోట్లతో కొరటూరు రిసార్ట్స్, జల్లేరు జలాశయం, జీలకర్రగూడెం గుంటుపల్లి గుహలు, పేరుపాలెం బీచ్, సిద్ధాంతం, పట్టిసీమ వంటి ప్రాంతాల్లో పర్యాటక శాఖ వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. టెంపుల్ టూరిజంలో భాగంగా ఇప్పటికే ప్రముఖ దేవాలయాల వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో పూర్తిస్థాయి పర్యాటకాభివృద్ధి కోసం సుమారు రూ.800 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసి ప్రతిపాదనల నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారులు సమర్పించారు

రూ.80 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత

- 27 మంది స్మగ్లర్ల అరెస్ట్
- వీరిలో 20 మంది తమిళ స్మగ్లర్లు



ఎర్రచందనం, స్మగ్లర్లను చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: శేషాచల అడవుల్లో నుంచి అక్రమంగా తరలిస్తోన్న రూ.50 లక్షల విలువైన ఎర్రచందనాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాజంపేట, తిరుపతి జిల్లాల్లోని 3 ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కూంబింగ్ నిర్వహించగా.. స్మగ్లర్లు అక్రమంగా తరలిస్తోన్న 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 20 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి నుంచి ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అరెస్టయిన వారందరూ తమిళనాడుకు చెందిన వారని తెలిపారు.

కడప పరిధిలో మరో 32 దుంగలు స్వాధీనం

కడప సబ్ కంట్రోల్ పరిధిలో మరో 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, 7గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు మురళీధర్ తెలిపారు. బ్రాహ్మణపల్లి వద్ద ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతున్న వ్యక్తులను గమనించి వారిని చుట్టుముట్టినట్టు తెలిపారు. వారిలో వైఎస్సార్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో టీమ్ చింతలకుంట ఫారెస్టు బీటులోని బీడిబావి సెక్షన్‌లో కూంబింగ్ చేస్తుండగా, కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారని, వారిలో అన్నమయ్య జిల్లాకు చెందిన నలుగురిని పట్టుకున్నట్టు వెల్లడించారు. వీరి నుంచి 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందన్నారు.

భాస్కరా... బతికే ఉంటావు

- డాక్‌యార్డ్ ఉద్యోగి అవయవదానం
- కష్టకాలంలోనూ ఆదర్శంగా నిలిచిన కుటుంబ సభ్యులు



మృతుని కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న జీవన్‌దాన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన విశాఖ డాక్‌యార్డ్ ఉద్యోగి అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన భౌతికంగా దూరమైనా.. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మరో నలుగురికి పునర్జన్మ లభిస్తుందని కష్టకాలంలోనూ ఉన్నతంగా ఆలోచించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలోని దానాపురానికి చెందిన ఇప్పిలి భాస్కరరావు (43) ఆర్మీలో హవల్దార్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. అనంతరం విశాఖ డాక్‌యార్డ్‌లోని పెన్షన్ సెక్షన్‌లో ట్రేడ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం సత్తివానిపాలెంలో నివాసం ఉంటున్న భాస్కరరావు మూడు రోజుల క్రితం తన ఇంట్లో మెట్లపై నుంచి జారిపడడంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అయన్ను చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించారు. వెంటిలేషన్‌పై ఉంచి చికిత్స అందిస్తున్న ఆయనకు శనివారం బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ సిబ్బంది భాస్కరరావు కుటుంబ సభ్యులను కలిసి అవయవదానం ఆవశ్యకతను వివరించారు. దీంతో భాస్కరరావు అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన అవయవాలను ఆస్పత్రి వైద్యులు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భాస్కరరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

శ్రీవారికి స్వర్ణ అభిషేక శంఖం

- కానుకగా అందజేసిన ఇన్ఫోసిస్ అధినేత దంపతులు



టీటీడీ ఈవో ధర్మారెడ్డికి బంగారు అభిషేక శంఖాన్ని అందిస్తున్న నారాయణమూర్తి దంపతులు

తిరుమల: శ్రీవారికి బంగారు అభిషేక శంఖాన్ని ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి దంపతులు ఆదివారం కానుకగా అందజేశారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో వారు శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి స్వర్ణ అభిషేక శంఖాన్ని అందజేశారు. దాదాపు 2 కేజీల బరువు ఉండవచ్చు నని టీటీడీ వర్గాలు తెలిపాయి. నారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ.. 1953 నుంచి తాము శ్రీవారిని దర్శించుకుంటున్నామని చెప్పారు.

స్వామి వారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి, మణిపూర్ యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంవీ మురళీధరన్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. సీఎస్ తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ధ్యాన మందిరం నిర్మాణ పనులను పరిశీలించారు.

నేడు ఆణివార ఆస్థానం

శ్రీవారి ఆలయంలో సోమవారం సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని నిర్వహించనున్నారు. ప్రతిఏడాది సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతి నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు పుష్పపల్లకీపై తిరుమల పురవీధులలో ఊరేగుతారు. దీంతో జూలై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఈ గౌరవం సీఎం జగన్ చలవే

- ట్రాన్స్‌జెండర్ సహస్ర ప్రశంసలు



నందిగామ: వైఎస్ జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి మేలు జరుగుతోందనేందుకు తానే ఉదాహరణ అని ఎన్టీఆర్ జిల్లా నందిగామకి చెందిన ట్రాన్స్‌జెండర్ ఇనపనుర్తి సహస్ర అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే యాచక వృత్తి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ నేడు సూపర్‌వైజర్‌గా రాణిస్తున్నానని తెలిపారు. 'నా అసలు పేరు సురేష్. చిన్నతనం నుంచి మహిళగా మారాలని కోరిక. పదవ తరగతి పూర్తికాగానే ఢిల్లీకి వెళ్లాను. అక్కడ హిజ్రాగా మారి నందిగామ వచ్చాను. అందరూ నన్ను దూరంగా పెట్టారు. చేద్దామంటే పని దొరకలేదు. దీంతో యాచించడం తప్ప మరోమార్గం దొరకలేదు. నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నించా రాలేదు. 2019లో జగన్ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ద్వారా ఏపీఎస్‌బీసీఎల్‌కు చెందిన మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం వచ్చింది. తర్వాత పెళ్లి కూడా చేసుకున్నాను. సీఎం జగన్ చలవవల్లే నేడు నాకు గౌర వం దక్కుతోంది' అని సహస్ర తెలిపింది.

భవన నిర్మాణ కార్మికులకు అందుతున్న సంక్షేమం కనబడటం లేదా?

అసత్యాల పునాదులపై 'ఈనాడు' వక్ర కథనం

- నిర్మాణాత్మక సంక్షేమాన్ని అందిస్తున్న జగన్ సర్కార్‌పై ఆక్రోశం
- కార్మికుల బిడ్డల విద్యకు సర్కార్ ఊతం, వైద్యానికి భరోసా
- వివాహానికి ఆర్థిక సాయం, బీమాతో పెరిగిన ధీమా


సంక్షేమానికి సర్కారు ఎసరు!



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారు నిర్మాణాత్మక సంక్షేమాన్ని అందిస్తుంటే.. రామోజీరావు మాత్రం వక్ర రాతలతో ఈనాడు పత్రికలో ఆక్రోశం వెళ్లగక్కారు. ఆ కార్మికుల 'సంక్షేమానికి సర్కారు ఎసరు' అంటూ అసత్యాల పునాదులపై ఓ కథనాన్ని నిర్మించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి నక్కకు నాకలోకానికి ఉన్నంత వ్యత్యాసం స్పష్టంగా కన్పిస్తోంది. కార్మికుల బిడ్డల విద్యకు ఊతమిస్తున్న ప్రభుత్వం వివాహానికి సైతం ఆర్థిక సాయమందిస్తోంది. ఆ కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించి ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, వైకల్యం పొందినా ఆ కుటుంబానికి బీమా అందించి ప్రభుత్వం ధీమా కల్పిస్తోంది. వాస్తవానికి గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా భవన నిర్మాణ కార్మికులు అనేక సంక్షేమ పథకాలతో ప్రయోజనాలు పొందుతున్నారు.

రిజిస్టర్ కాకపోయినా బీమా

ఈనాడు రాతలు ఎంత అభూత కల్పనలో ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని బట్టి చూస్తే ఇట్టే అర్థమవుతుంది. రిజిస్టర్ అయినా, కాకపోయినా భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే వైఎస్సార్ బీమా ద్వారా ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తోంది. గత ప్రభుత్వం రిజిస్టర్ అయినవాళ్లకి మాత్రమే రూ. 5 లక్షలు ఇచ్చేది. రిజిస్టర్ కాని వాళ్లకు కేవలం రూ. 50 వేలు మాత్రమే ఇచ్చేది. వివాహాలకు గతంలో ఇచ్చేది కేవలం రూ. 20 వేలు మాత్రమే. ఈ ప్రభుత్వం దాన్ని రెట్టింపు చేస్తూ రూ. 40 వేలు అందిస్తోంది. భవన నిర్మాణ కార్మికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అయితే వారికి వేర్వేరు స్కేల్స్ ఉన్నాయి. వివిధ కేటగిరీల్లో గరిష్టంగా ఈ పథకంతో రూ. 1.5 లక్షల వరకూ లబ్ధి చేకూరుతుంది. ఇందులో బోర్డు నుంచి వచ్చేది కేవలం రూ. 40 వేలు. మిగతా డబ్బును ప్రభుత్వం ఖజానా నుంచి భవన నిర్మాణ కార్మికులకు అందిస్తోంది. గతంలో భవన నిర్మాణ కార్మికుల బిడ్డలకు స్కాలర్‌షిప్‌లుగా కేవలం రూ. 1,200 మాత్రమే ఇచ్చేవారు. గ్రాడ్యుయేషన్‌కు ఏడాదికి రూ. 5 వేలు మాత్రమే ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం పిల్లలను స్కూలుకు పంపే తల్లికే ఏడాదికి అమ్మఒడి రూపంలో రూ. 15 వేలు ఇస్తోంది. అవి కాకుండా విద్యాదీవెన, వసతి దీవెనలతో పాటు, విదేశీ విద్యా దీవెన తదితర కార్యక్రమాలన్నీ వర్తింపజేస్తోంది. ఇవికాకుండా ప్రభుత్వం అందించే అన్ని పథకాలతో అర్హులైన భవన నిర్మాణ కార్మికులు విస్తృతంగా ప్రయోజనం పొందుతున్నారు.

- సహజ మరణాలైతే గత ప్రభుత్వం రూ. 60 వేలు మాత్రమే ఇచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ. 1 లక్ష అందిస్తోంది.
- ప్రమాదాల్లో వైకల్యం సంభవిస్తే ప్రస్తుత ప్రభుత్వం రూ. 5 లక్షలు అందిస్తోంది.
- గత ప్రభుత్వం హయాంలో రిజిస్టర్ అవ్వని కార్మికులు ప్రమాదవశాత్తు 50 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం పొందితే రూ. 20 వేలు, 50 శాతంలోపు వైకల్యం అయితే రూ. 10 వేలు వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం ప్రమాద మరణాలకు రూ. 5 లక్షలు, వైకల్యం సంభవిస్తే రూ. 2.5 లక్షలు అందిస్తోంది.
- ఆస్పత్రుల్లో వైద్యానికి గత ప్రభుత్వం నెలకు రూ. 3 వేలు చొప్పున మూడు నెలల సాయం మాత్రమే అందించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచితంగా చికిత్స అనంతరం కూడా వైద్యులు సూచించిన విశ్రాంతి కాలానికి రోజుకు రూ. 225 గరిష్టంగా నెలకు రూ. 5 వేలు సాయం అందిస్తోంది.

అగ్రరాజ్యంలో తెలుగు తేజం

- అమెరికా నుంచి 'ఇమ్మిగ్రెంట్ అచీవ్‌మెంట్ అవార్డ్' అందుకున్న ప్రొఫెసర్ నీలి బెండపూడి
- భారత్, అమెరికా దేశాల మధ్య విద్యావిషయక అంశాలపై కోచర్‌గా నియామకం
- దేశంలోని యూనివర్సిటీల్లో పరిశోధనను మెరుగుపరిచేందుకు సిఫార్సులు
- గత నెలలో అమెరికాలో పర్యటించిన ప్రధాని మోదీతో భేటీ



తెనాలి: అగ్రరాజ్యం అమెరికాలో ఉన్నత విద్యకు విశేష కృషి చేసినందుకు ఇమ్మిగ్రెంట్ అచీవ్‌మెంట్ అవార్డ్ అందుకున్నారు గుంటూరుకు చెందిన తెలుగు మహిళ నీలి బెండపూడి (59). అమెరికాలోని ప్రతిష్టాత్మక పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ అధ్యక్షురాలిగా నియమితులైన తొలి మహిళ నీలి బెండపూడి గత నెలలో భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆయనతో సమావేశమైన వ్యక్తిగా వార్తల్లోకి వచ్చారు. భారతదేశంలోని గొప్ప విద్యాలయాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రెండు దేశాలకు అవసరమైన సిఫార్సులను చేసే కోచర్‌గా ఆమె నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన ప్రొఫెసర్ నీలి విశాఖపట్నంలో చదువుకున్నారు. అక్కడినుంచే అమెరికా వెళ్లారు. ఆమె జీవిత విశేషాల్లో విశాఖ వాసిగానే పేర్కొంటున్నారు. నిజానికి ప్రొఫెసర్ నీలి గుంటూరులో జన్మించారు. తల్లి దత్తావఝుల పద్మ, తండ్రి రమేష్. ఇద్దరూ ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేశారు. ఈ కారణంగా నీలి బీఏ, ఎంబీఏ వరకు చదువు మొత్తం అక్కడే సాగింది.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి..

ఉన్నత చదువుల కోసం 1986లో నీలి బెండపూడి అమెరికా వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్‌లో మార్కెటింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా నైపుణ్యం సాధించి.. తాను విద్య అభ్యసించిన కాన్సాస్ యూనివర్సిటీలో ప్రొవోస్ట్, ఎగ్జిక్యూటివ్ వైస్ చాన్సలర్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్‌తో సహా అనేక అడ్మినిస్ట్రేటివ్ హోదాల్లో సేవలందించారు. ఓహియో స్టేట్ యూనివర్సిటీలో ఇనీషియేటివ్ ఫర్ మేనేజింగ్ సర్వీసెస్ వ్యవస్థాపక డైరెక్టర్‌గా పనిచేశారు. అంతకుముందు హంటింగ్‌టన్ నేషనల్ బ్యాంక్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ కస్టమర్ ఆఫీ సర్‌గానూ విధులు నిర్వర్తించారు. అకాడమీ ఆఫ్ మార్కెటింగ్, అత్యుత్తమ మార్కెటింగ్ టీచర్ అవార్డుతో సహా అనేక జాతీయ అవార్డులను అందుకున్నారు. 2018–21లో కెంటకీలోని లూయిస్‌విల్లే యూనివర్సిటీకి 18వ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 2022 మే 10న పెన్సిల్వేనియా స్టేట్ వర్సిటీ 19వ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ పదవికి ఎన్నికైన తొలి మహిళగా గుర్తింపు పొందారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రతిష్టాత్మక 'ఇమ్మిగ్రెంట్ ఎచీవ్‌మెంట్' అవార్డు అందుకు న్నారు. ప్రొఫెసర్ నీలి బెండపూడిని భారత్‌లోని ప్రముఖ వర్సిటీల్లో పరిశోధనను మెరుగుపరచి ఉన్నత స్థాయిలో నిలబెట్టేలా 2 దేశాల మధ్య ఆరంభమైన కార్యక్రమానికి అవసరమైన సిఫార్సులను ప్రొఫెసర్ నీలి చేశారు. ఇందుకోసం ఆమె కోచర్‌గా నియమితులయ్యారు.

'మంగంపేట'లో ఏపీఎండీసీ సామాజిక సేవ

- రూ.30 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో పలు కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) సామాజిక సేవలో కూడా ముందంజలో ఉంది. అన్నమయ్య జిల్లా మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు పరిధిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) కింద ఈ ఏడాది రూ.30 కోట్లతో పలు కార్యక్రమాలు చేపట్టింది. విద్య, వైద్యం, రక్షిత మంచినీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనతో పాటు క్రీడలకు ప్రోత్సాహం, దివ్యాంగులకు చేయూ త, యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తోంది. ఏపీఎండీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగంపేటలో కార్పొరేట్ స్కూల్ నిర్వహిస్తూ.. 15 గ్రామాలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులకు 1 నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తోంది. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. పదో తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ స్కూల్ నిర్వహణ కోసం రూ.3 కోట్లు ఖర్చు చేస్తోంది. మంగంపేటలో 10 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి.. ప్రతి ఏడాది రూ.2.5 కోట్లతో సమీప గ్రామాల ప్రజలకు వైద్యం అందిస్తోంది. రూ.12 లక్షల విలువైన మందులు, 50కి పైగా వైద్య పరీక్షలను ఉచితంగా చేయిస్తోంది. ప్రతి నెలా సూపర్ స్పెషాలిటీ వైద్యులతో గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తోంది. 2 అంబులెన్స్‌లు కూడా ఏర్పాటు చేసింది. రాజంపేట, రైల్వేకోడూరులో రూ. 1.9 కోట్లతో రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. మంగంపేటతో పాటు మైనింగ్ కార్యకలాపాలు జరిగే ఇతర ప్రాంతాల్లో రూ.16 కోట్లతో 300 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి 3 లక్షల మందికి సురక్షిత మంచినీరు సరఫరా చేస్తోంది. వృత్తి నైపుణ్య శిక్షణ కింద ఈ ఏడాది 100 మందికి బ్యాంకింగ్ పోస్టులకు శిక్షణ ఇస్తోంది. అందులో పలువురికి ఉద్యోగాలు కూడా లభించాయి. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో కలిసి మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి 60 మందికి కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. 30 మంది దివ్యాంగులకు ట్రిస్కూటర్లు ఇచ్చారు. ఇద్దరు క్రీడాకారులకు స్పాన్సర్‌షిప్ అందించింది. ఏపీఎండీసీ 214 మందికి రూ.2 వేల చొప్పున పెన్షన్ అందిస్తోంది. ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 'ఏ సంస్థ చేయని విధంగా మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు, దాని పరిసరాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంస్థ ఆర్జిస్తున్న నికర లాభాల్లో 2 శాతాన్ని వీటికి ఖర్చు చేస్తున్నాం' అని చెప్పారు.

క్లుప్తంగా...

ప్రపంచ కుబేరుడి భార్యకు కాఫీ ధర ఎక్కువైందట!



ఇదహో: ప్రపంచ కుబేరుల్లో వారెన్ బఫెట్ ఒకరు. ఆయన ఆస్తి 115 బిలియన్ డాలర్లకు పైమాటే. అటువంటి వ్యక్తి భార్య కాఫీ ధర ఎక్కువగా ఉందంటూ ఫిర్యాదు చేయడం ఆసక్తికర అంశంగా మారింది. సన్ వ్యాలీలో ఇటీవల బిలియనీర్ల సమ్మర్ క్యాంప్ జరిగింది. ఓ రిసార్టులో జరిగిన ఈ కార్యక్రమంలో వారెన్ బఫెట్ భార్య ఆస్ట్రిడ్ బఫెట్ కప్పు కాఫీకి నాలుగు డాలర్లు వసూలు చేయడంపై అక్కడి సిబ్బందికి ఫిర్యాదు చేశారట. ఇతర ప్రాంతాల్లోని కాఫీ ధరతో పోలిస్తే ఇది ఎక్కువేనంటూ అసహనం వ్యక్తం చేశారట. ఈ విషయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాగా, సంపద ఎంతున్నా వారెన్ బఫెట్ మహా పొదుపరి. 1958లో 31,500 డాలర్లకు కొనుగోలు చేసిన ఇంట్లోనే ఆయన ఇప్పటికీ నివసిస్తున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రతిష్టాత్మక 'గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐఎన్‌సీ లీడర్‌షిప్ అవార్డు'



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐఎన్‌సీ లీడర్‌షిప్ అవార్డు' వరించింది. భారత్–అమెరికాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, పీపుల్–టు–పీపుల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహించే యూఎస్ ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ ఈ అవార్డును కేంద్రమంత్రికి అందించింది. భారతదేశపు సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు పర్యాటకాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన కృషికి గాను అందిస్తున్నట్లు తెలిపింది. అమెరికాలోని మేరీలాండ్ నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఈ అవార్డును కేంద్రమంత్రికి అందించారు. కిషన్ రెడ్డి ట్విట్టర్‌లో స్పందిస్తూ.. 'యూఎస్ ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్' సంస్థ నుంచి లీడర్ షిప్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశ ఘనమైన చరిత్రను, సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు పర్యాటక రంగాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది' అని పేర్కొన్నారు.

టమాటా ధర కిలో రూ.80

రాయితీతో విక్రయిస్తున్న కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇటీవలే కిలో రూ.250 దాకా పలికిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం దేశంలో సగటు ధర కిలోకు రూ.117గా ఉంది. వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై టమాటాలు విక్రయిస్తోంది. పలు నగరాల్లో కొన్ని రోజులపాటు కిలో రూ.90కి విక్రయించగా, ఆదివారం నుంచి రూ.80కే అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత జాతీయ సహకార వినియోగదారుల సంఘం(ఎన్‌సీసీఎఫ్), భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సంఘం(నాఫెడ్) ద్వారా ప్రభుత్వం టమాటాలను రాయితీపై విక్రయిస్తోంది. ప్రభుత్వ జోక్యంతో రిటైల్ మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయని అధికార వర్గాలు చెప్పాయి. ఆదివారం ఢిల్లీ, నోయిడా, లక్నో, కాన్పూర్, వారణాసి, పాట్నా తదితర నగరాల్లో కిలో టమాటాలు రూ.80 చొప్పున విక్రయించారు. సోమవారం నుంచి మరి కొన్ని నగరాల్లో ఈ రాయితీ ధరతో టమాటాలను విక్రయించనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.178, ముంబైలో రూ.150, చెన్నైలో రూ.132 చొప్పున పలుకుతోంది. సాధారణంగా జూలై–ఆగస్టు, అక్టోబర్–నవంబర్‌లో టమాటా ధరలు పెరుగుతుంటాయి. ఈసారి వర్షాలు ఆలస్యం కావడం వల్ల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, కర్ణాటకలోని కోలార్, మహారాష్ట్రలోని సంగనేరీ నుంచి కేంద్ర ప్రభుత్వం టమాటాలను సేకరిస్తోంది.

1950 నుంచే

పెనుముప్పు శకం ఆరంభం

మానవుల చర్యల వల్ల భూమికి అపార నష్టం

నిర్ధారించిన 'ఆంథ్రోపోసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు

భూగోళంపై గతంలో ఎన్నడూ కనిపించని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. కాలుష్యం, భూతాపం, వాతావరణ మార్పులు పెరిగిపోతున్నాయి. రుతువులు గతి తప్పుతున్నాయి. ఒకవైపు భీకర వర్షాలు, వరదలు, మరోవైపు నిప్పులు కక్కే ఎండలు సర్వసాధారణంగా మారాయి. మొత్తం పుడమి ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అయితే, మానవుల నిర్వాకం వల్ల భూమిపై అవాంఛనీయ ఈ పరిణామం ఎప్పుడు మొదలైందో తెలుసా? 1950 నుంచి 1954 మధ్య మొదలైందని 'ఆంథ్రోపోసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు గుర్తించారు. భూమాతను ప్రమాదంలోకి నెట్టివేసే కొత్త శకానికి అదొక ఆరంభమని అంటున్నారు. ఈ పరిణామానికి ఆంథ్రోపోసీన్ అని నామకరణం చేశారు. మనిషి, నూతన అనే అర్థాలున్న గ్రీక్ పదాలతో ఈ కొత్త పదం ఏర్పడింది. మొదట దీనిని 2000 సంవత్సరంలో పాల్ క్రట్‌జెన్, యూగీన్ స్టార్మర్ అనే శాస్త్రవేత్తలు ఉపయోగించారు. దీనిని ప్రస్తుత 'జియోలాజికల్ టైమ్ ఇంటర్వెల్'గా పరిగణిస్తున్నారు. 'ఆంథ్రోపోసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు ఇంకా ఏం చెప్పారంటే..

- సాక్షి, నేషనల్ డెస్క్

- ఆంథ్రోపోసీన్‌లో భాగమైన పరిణామాలు, మార్పులు 1,000 లేదా అంతకంటే ఎక్కువ కాలం కొనసాగుతాయి.
- ఇవి మొత్తం భూమి ఆవరణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కొన్ని మార్పులు ప్రభావం భూమిపై శాశ్వతంగా ఉంటుంది.
- శిలాజ ఇంధనాల వాడకం, అణ్వాయుధాలను ఉపయోగించడం, పొలాల్లో రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగం, భూమితో పాటు నదులు, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం వంటివి ఆంథ్రోపోసీన్‌కు కారణమవుతున్నాయి.



- మానవుల చర్యల భూమికి జరుగుతున్న నష్టం అనూహ్యంగానే ఉందని, ఈ నష్టం రానురాను మరింత పెరుగుతుందని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్‌కు చెందిన జియాలజిస్ట్ కోలిన్ వాటర్స్ ఆందోళన వ్యక్తం చేశారు.
- సుమారు 6.6 కోట్ల సంవత్సరాల క్రితం బలమైన గ్రహ శకలాలు భూమిని ఢీకొట్టడం వల్ల రాక్షస బల్లులు అంతరించిపోయాయి. ఇప్పుడు మానవ చర్యలు సైతం అదే కేటగిరీకి సమానంగా ఉన్నాయి. 1950వ దశకం తర్వాత భూగోళంపై ఎన్నో రకాల జీవులు అంతరించిపోయాయి.
- గ్రహ శకలాలు ఢీకొట్టడం అనేది ఒక కొత్త శకానికి దారితీసింది. మనుషుల కార్యకలాపాలు కూడా భూమిపై కొత్త శకానికి నాంది పలికాయి.
- ఇప్పటికైనా మేల్కొని నష్ట నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలు తలెత్తుతాయనడంలో సందేహం లేదు.

పిల్లల ఫొటోల్ని షేర్ చేయకండి

- తల్లిదండ్రులకు అస్సాం పోలీసుల సూచన
- ఏఐ ఫొటోలతో వినూత్న ప్రచారం



గువాహటి: సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కోసం చిన్నారుల ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంపై అస్సాం పోలీసులు వినూత్న ప్రచారం ప్రారంభించారు. ఇందుకోసం పోలీసులు కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన చిన్నారుల చిత్రాలను వాడుకున్నారు. 'పిల్లలు సోషల్ మీడియా ట్రోఫీలు కాదు, నెటిజన్ల దృష్టిలో పడేందుకు చిన్నారుల గోప్యతతో వ్యాపారం చేయకండి, మీ చిన్నారుల కథ చెప్పే అవకాశం వారికే ఇవ్వండి, లైక్స్ పాతబడిపోతాయి కానీ, డిజిటల్ మరకలు శాశ్వతం'వంటి సందేశాలను జత చేశారు. ఇటీవలి కాలంలో ఫ్యామిలీ వ్లాగర్లు ప్రచారం కోసం చిన్నారులను కూడా వాడుకోవడం ఎక్కువైపోయింది. సోషల్ మీడియాలో తాము ఎలా కనిపిస్తామో తెలియని చిన్నారులను ప్రచారం కోసం ఉపయోగించుకోవడం ఎన్నో విధాలుగా నష్టం తెస్తుందని పోలీసులు చెబుతున్నారు. తమ పిల్లల చిత్రాలను షేర్ చేయడం హానికరం కాదని తల్లిదండ్రులు మొదట్లో భావించవచ్చు. కానీ, పిల్లలను గురించి అవసరం లేకున్నా ఎక్కువ మందికి తెలియడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ చర్య పిల్లల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడంతోపాటు, వారి మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అస్సాం పోలీసుల ప్రయత్నంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది అద్భుతం, నేటి తల్లిదండ్రులకు ఇలాంటి సందేశాలు ఎంతో అవసరమని పేర్కొంటున్నారు. అస్సాం పోలీసులు ఇటీవల సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు బాలీవుడ్ సినిమాలతో ప్రభావితమైన సైబర్ నేరగాళ్ల కృత్రిమ మేధ చిత్రాలను ట్వీట్ చేసి ప్రశంసలు అందుకున్నారు.

హిమాచల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా

దివ్యాంగ మహిళలు



ప్రతిభ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ఇద్దరు దివ్యాంగ మహిళలు అరుదైన ఘనత సాధించారు. అంధులైన వీరిద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులయ్యారు. పట్టుదల, అంకితభావంతో తమ కలలను నిజం చేసుకున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ముస్కాన్ ప్రముఖ గాయకురాలు. హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఎన్నికల సంఘం యూత్ ఐకాన్‌గా ఇప్పటికే గుర్తింపు పొందారు. దేశ విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. 2013లో రాజ్‌కియా కన్య మహావిద్యాలయలో సంగీతంలో ప్రవేశం పొందారు. ఇప్పుడు అదే విద్యాసంస్థలో సంగీతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ముస్కాన్ చురుగ్గా ఉంటున్నారు. సాధారణమధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ప్రతిభా ఠాకూర్ సైతం అంధురాలు. పీహెచ్‌డీ పూర్తిచేశారు. విద్యా రంగంలో సేవలు అందించాలన్నది ఆమె చిన్నప్పటి కల. రాజీవ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితురాలైంది.

మా దగ్గరా బోలెడు క్లస్టర్ బాంబులు

కీవ్: ఉక్రెయిన్‌కు అమెరికా విధ్వంసకర క్లస్టర్ బాంబులను సరఫరా చేయడంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పందించారు. తమ వద్ద కూడా క్లస్టర్ బాంబుల నిల్వలు దండిగా ఉన్నాయని ప్రకటించారు. ఈ వివాదాస్పద ఆయుధాలను ఉక్రెయిన్ వాడిన పక్షంలో తగు రీతిలో స్పందించే హక్కు తమకుందని హెచ్చరించారు. 'మా వద్ద క్లస్టర్ బాంబులు ఉన్నప్పటికీ ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటి వరకు వాటిని వాడలేదు. అటువంటి అవసరం కూడా మాకు రాలేదు' అని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ ఇప్పటికే క్లస్టర్ బాంబులను వాడినట్లుగా పలు ఆధారాలను అసోసియేటెడ్ ప్రెస్, అంతర్జాతీయ మానవతావాద సంస్థలు చూపుతున్నాయి. రష్యాపై ఉక్రెయిన్ ఎదురుదాడి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో, యుద్ధక్షేత్రంలో రష్యా ఆర్మీపై ఉక్రెయిన్ పైచేయి సాధించాలంటే విధ్వంసకర క్లస్టర్ బాంబులే మార్గమని అమెరికా అంచనా వేస్తోంది. క్లస్టర్ బాంబుల సరఫరాపై నెలలపాటు అమెరికా మల్లగుల్లాలు పడింది. ఉక్రెయిన్‌కు వీటిని అందజేయాలన్న నిర్ణయానికే అధ్యక్షుడు బైడెన్ చివరికి మొగ్గు చూపారు. ప్రమాదకరమైనవిగా భావించే క్లస్టర్ బాంబులను చివరిసారిగా అమెరికా 2003లో ఇరాక్ యుద్ధంలో వాడినట్లు చెబుతోంది. ప్రస్తుతం ఆ దేశం వద్ద 30 లక్షల క్లస్టర్ ఆయుధ నిల్వలున్నాయి. డొనెట్స్క్, ఖెర్సన్ ప్రాంతాలే లక్ష్యంగా గత 24 గంటల్లో రష్యా రెండు షహీద్ డ్రోన్లను, రెండు క్రూయిజ్ మిస్సైళ్లను, రెండు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైళ్లతోపాటు 40 వైమానిక దాడులు, 46 రాకెట్ దాడులు జరిపిందని ఉక్రెయిన్ తెలిపింది.





ప్రధాని మోదీ గౌరవార్థం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ పారిస్‌లో శుక్రవారం ఇచ్చిన విందుకు హాజరైన వారితో సెల్ఫీ దిగుతున్న సినీ నటుడు, దర్శకుడు ఆర్.మాధవన్. చారిత్రక లౌవ్రె మ్యూజియంలో ఈ కార్యక్రమం జరిగింది.

కన్నడ నాట పొత్తు రాజకీయం

చేతులు కలిపే దిశగా బీజేపీ–జేడీఎస్ ● కాంగ్రెస్‌కు చెక్, అధిక ఎంపీ సీట్లే లక్ష్యం



శివాజీనగర: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కన్నడనాట బీజేపీ, జేడీఎస్ పార్టీలు పొత్తు పెట్టుకోవాలని జాతీయస్థాయి నాయకులు భావిస్తుంటే, రాష్ట్ర బీజేపీ ఇందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. తమ ఓటు బ్యాంకును అప్పనంగా జేడీఎస్‌కు అప్పజెప్పడమేనని రాష్ట్ర బీజేపీ నాయకులు ఆందోళనతో ఉన్నారు. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్‌లను కాదని ప్రతిపక్ష కాంగ్రెస్ విజయదుందుభి మోగించి సర్కారును ఏర్పాటు చేయడం తెలిసిందే. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలవకుండా చేతులు కలపాలని జేడీఎస్, బీజేపీలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై బీజేపీ హైకమాండ్‌తో జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామి చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 18న ఢిల్లీలో ఎన్‌డీఏ సమావేశం జరగనుంది. దీనికి జేడీఎస్‌ను ఆహ్వానించాలని బీజేపీ హైకమాండ్ యోచిస్తోంది. పిలుపు వస్తే వెళ్లాలని కుమారస్వామి సిద్ధమయ్యారు. అక్కడ చర్చలు ఫలిస్తే లోక్‌సభ ఎన్నికలకు పొత్తు కుదిరే అవకాశముంది. కానీ కుమారస్వామితో పొత్తు పెట్టుకొంటే పాత మైసూరు భాగంలో పార్టీ ప్రభావం తగ్గుతోంది, అంతేకాకుండా ఒక్కలిగుల ఓట్ బ్యాంకును కోల్పోతాము. పొత్తు వద్దని బీజేపీ రాష్ట్ర నాయకులు, అందులోనూ ఒక్కలిగ నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇది గ్రహించిన కుమారస్వామి రాష్ట్ర నాయకులను కాదని బీజేపీ కేంద్ర నాయకులతో పొత్తు చర్చలకు సిద్ధంగా ఉన్నారు. జేడీఎస్‌తో చేతులు కలిపి ఎక్కువ ఎంపీ స్థానాలను గెలుపొందాలని బీజేపీ కూడా ఆశిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రికార్డుస్థాయిలో 20కి పైగా ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఈసారి అదే జాదూను పునరావృతం చేయాలనుకుంటోంది. కాగా, బీజేపీ–జేడీఎస్ పొత్తు వార్తలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. అవకాశవాద జేడీఎస్ పార్టీ అధికారం కోసం ఎంతకైనా దిగజారుతుందని ఆరోపించింది.

జేడీఎస్‌ను చీల్చేందుకు కాంగ్రెస్ ఎత్తుగడ

ఇదిలా ఉండగా, అధికార కాంగ్రెస్ పార్టీ మరో ఎత్తుగడలో ఉంది. బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్న జేడీఎస్ ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకోవాలని చూస్తోంది. సుమారు 12 జేడీఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకు రావటం ద్వారా పార్టీ ఫిరాయింపు చట్టం వర్తించకుండా చూడాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జేడీఎస్‌కు 16 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అలా వచ్చే వారికి మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. అదనుచూసి జేడీఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని పథకం వేస్తోంది.

చర్చలు జరిగాయి: బొమ్మై

పొత్తు గురించి బీజేపీ మాజీ సీఎం బస్వరాజ బొమ్మై ఆదివారం స్పందిస్తూ తమ హైకమాండ్, జేడీఎస్ అధినేత దేవేగౌడ మధ్య పొత్తులపై చర్చలు జరిగాయన్నారు. చర్చలు సఫలమైతే రాజకీయ మార్పులు తథ్యమన్నారు.

మధ్యప్రదేశ్‌లో యువతిపై గ్యాంగ్‌రేప్

నిందితుల్లో బీజేపీ నేత మైనర్ కుమారుడు

దతియా: ఓ యువతిని, ఆమె చెల్లెల్ని నలుగురు యువకులు కిడ్నాప్ చేశారు. యువతిపై సామూహిక అత్యాచారం చేయడంతోపాటు ఆమె చెల్లెల్ని లైంగికంగా వేధించారు. నిందితుల్లో స్థానిక బీజేపీ నేత కుమారుడు కూడా ఉన్నారు. బాధితురాలు మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఓ యువతి(19)ని, ఆమె చెల్లిని నలుగురు వ్యక్తులు నిర్బంధించి, ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ యువతిపై నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె చెల్లిని లైంగికంగా వేధించారు. ఘటన అనంతరం వారిద్దరూ ఇంటికి చేరుకున్నారు. మనస్తాపానికి గురైన బాధితురాలు ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఘటనపై బాధితురాలి చెల్లెలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్ద సంఖ్యలో జనం నిరసనకు దిగడంతో పోలీసులు నిందితులపై పోక్సోతోపాటు 376డి (గ్యాంగ్‌రేప్), దౌర్జన్యం (354), 342 (నిర్బంధం) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బీజేపీ జిల్లా నేత కొడుకు(మైనర్) కూడా ఉన్నాడు. మరొకరికి కోసం గాలిస్తున్నారు. ఘటనపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర బుధోలియా స్పందించారు. పోలీసు విచారణలో తమ పార్టీ నేత కొడుకు కూడా ఉన్నట్లు బాధితురాలు వెల్లడిస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

బెంగళూరులో విపక్షాల వ్యూహరచన

నేడు, రేపు సమావేశాలు

బనశంకరి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేయడానికి బెంగళూరులో సోమ, మంగళవారాల్లో కాంగ్రెస్ సహా 24 ప్రతిపక్ష పార్టీలు సమావేశం కానున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ ఆధ్వర్యంలో జరిగే భేటీలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చిస్తారు. బిహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ సీఎంలు నితీశ్‌కుమార్, స్టాలిన్, మమతాబెనర్జీ కూడా పాల్గొననున్నారు. జూన్ 23న బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పట్నాలో ప్రతిపక్షాల మొదటి సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. తాజా సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్) నితీశ్‌కుమార్ (జేడీయూ), మమతా బెనర్జీ (టీఎంసీ), ఎంకే.స్టాలిన్ (డీఎంకే), హేమంత్‌సోరెన్ (జేఎంఎం), ఉద్ధవ్ ఠాక్రే (ఎస్ఎస్–యుబీటీ), శరద్‌పవార్ (ఎన్సీపీ), డి.రాజా(సీపీఐ), లాలూప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), అఖిలేశ్‌యాదవ్ (ఎస్పీ), సీతారాం ఏచూరి (సీపీఐఎం), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీపీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐఎంఎల్) తదితరులు పాల్గొంటారు.

భేటీకి ఆప్ కూడా..

ఢిల్లీ యంత్రాంగంపై పెత్తనం కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ తెలిపింది. కేంద్రంలోని బీజేపీ ప్రయత్నాలు సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని తెలిపింది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లును తిరస్కరిస్తామని స్పష్టం చేసింది. దీనిపై ఆప్ స్పందించింది. బెంగళూరులో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశానికి తాము కూడా హాజరవుతామని ఆ పార్టీ నేత రాఘవ్ చద్దా తెలిపారు. ఆదివారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

అలాస్కాలో భూకంపం.. స్వల్ప సునామీ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాలోని అలాస్కాలో శనివారం భూకంపం సంభవించింది. అధికారులు సునామీ హెచ్చరికను సైతం జారీ చేశారు. సుమారు గంట తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. అలాస్కాలో సునామీ సంభవించే అవకాశం ఉందంటూ శనివారం రాత్రి అధికారులు సైరన్లతో హెచ్చరికలు చేశారు. ప్రజలను షెల్టర్లలోకి తరలించారు. అలాస్కాలోని శాండ్ పాయింట్‌కు 106 కిలోమీటర్ల దూరంలో భూమిలో 13 మైళ్ల లోతులో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఎటువంటి నష్టం సంభవించినట్లు సమాచారం లేదని పేర్కొంది.

పవార్‌తో అజిత్ భేటీ

పార్టీని ఐక్యంగా ఉంచాలని విజ్ఞప్తి



శరద్ పవార్‌ను కలిసివస్తున్న అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ తదితరులు

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని ఐక్యంగా ఉంచాలని ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌కు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గం విజ్ఞప్తి చేసింది. అజిత్ పవార్‌తోపాటు ఆయన వర్గానికి చెందిన కొందరు మంత్రులు ఆదివారం దక్షిణ ముంబైలోని వైబీ చవాన్ సెంటర్‌లో శరద్ పవార్‌తో సమావేశమయ్యారు. అజిత్ ఈ నెల 2న తన బాబాయ్ శరద్ పవార్‌పై తిరుగుబాటు చేసి, తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరి, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత శరద్ పవార్‌తో ఆయన ముఖాముఖి సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా అజిత్ వెంట మంత్రులు హసన్ ముష్రీఫ్, ఛగన్ భుజబల్, అదితి తత్కారే, దిలీప్ వాల్సే పాటిల్ తదితరులు ఉన్నారు. శరద్ పవార్‌తో భేటీ అనంతరం అజిత్ వర్గంలోని ముఖ్యనేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. పార్టీని ఐక్యంగా ఉంచాలంటూ తమ అధినేతను కోరామని చెప్పారు. తాము చెప్పిందంతా ఆయన నిశ్శబ్దంగా విన్నారని, ప్రతిస్పందించలేదని తెలిపారు. శరద్ పవార్ తమకు దేవుడిలాంటివారని, ఆయన ఆశీస్సుల కోసం వచ్చామని పేర్కొన్నారు. తమను ముందుండి నడిపించాలంటూ విన్నవించామని చెప్పారు. అజిత్ పవార్ వర్గం నేతలు శరద్ పవార్‌ను కలవడంలో ఎలాంటి తప్పు లేదని బీజేపీ ముంబై శాఖ అధ్యక్షుడు ఆశిష్ షెలార్ అన్నారు. శరద్ పవార్‌ను అజిత్ వర్గం తమ అధ్యక్షుడిగా భావిస్తోందని స్పష్టం చేశారు. మొత్తానికి అజిత్ వర్గం శరద్ పవార్‌ను కలిసి మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

నేడు అమిత్ షా సమక్షంలో..

1.44 లక్షల కిలోల డ్రగ్స్ ధ్వంసం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విధ్వంసానికి కేంద్రం రంగం సిద్ధం చేసింది. సోమవారం ఢిల్లీలో హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో నిర్వహించనున్న 'డ్రగ్స్ స్మగ్లింగ్, జాతీయ భద్రత' సదస్సులో ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ ఎన్సీబీ పరిధిలో పట్టుకున్న 6,590 కిలోలు సహా 1,44,000 కిలోల మాదకద్రవ్యాలను (రూ.2,416 కోట్లు) ధ్వంసం చేయనున్నారు. దీంతో కలిపి జూన్ 1, 2022 నుంచి జులై 15, 2023 వరకూ రాష్ట్రాల్లోని ఎన్సీబీ, యాంటీ నార్కొటిక్స్ టాస్క్ ఫోర్స్‌ల ప్రాంతీయ యూనిట్లు సమష్టిగా సుమారు రూ.9,580 కోట్ల విలువైన 8.76 లక్షల కిలోల డ్రగ్స్‌ను ధ్వంసం చేశాయి. సోమవారం నాటితో ఏడాదిలో ధ్వంసమయ్యే డ్రగ్స్ మొత్తం 10 లక్షల కిలోలు దాటనుంది. డ్రగ్స్ రహిత భారతదేశాన్ని సృష్టించడానికి ప్రభుత్వం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జీరో టోలరెన్స్ విధానం అవలంబిస్తోందని హోంశాఖ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.



స్పెయిన్‌లో కార్చిచ్చు..

స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో కార్చిచ్చు చెలరేగింది. శనివారం ఉదయం నుంచి మొదలైన మంటలు సుమారు 11వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని దహించివేశాయి. మంటలను అదుపు చేసేందుకు ప్రభుత్వం 400 మంది సిబ్బందిని రంగంలోకి దించింది. ఇప్పటి వరకు 4 వేల మందికి పైగా ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించింది. మంటల్లో 12కు పైగా నివాసాలు ఆహుతయ్యాయి. అగ్ని కీలలను అదుపు చేసేందుకు సీప్లేన్‌లను కూడా వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

– మాడ్రిడ్

తిరుత్తణిలో భక్తుల రద్దీ సాధారణం

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఫలితంగా గంట వ్యవధిలోనే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఇక ఈ ఆలయంలో ఆడినెలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేకంగా ఆగస్టు 7 నుంచి ఆడికృత్తిక తెప్పోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇక ఆడి నెల ప్రారంభం కానున్న క్రమంలో సోమవారం నుంచి భక్తులు మురుగన్ మాల ధరించి ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. దీంతో కొండ ఆలయానికి భక్తుల తాకిడి పెరగనుంది. ఫలితంగా కావళ్లతో ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

శ్రీరంగం నుంచి ఊరేగింపుగా తిరుపతికి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న ఆలయ నిర్వాహకులు

కొరుక్కుపేట: భూలోక వైకుంఠంగా పేరుగాంచిన తిరుచ్చిలోని శ్రీరంగం రంగనాథుడి దేవాలయం 108 వైష్ణవ దేవాలయాలలో మొదటిది. ఇక్కడ సంవత్సరం పొడవునా వివిధ ఉత్సవాలు జరుగుతుంటాయి. మొగలాయ రాజుల దండయాత్ర సమయంలో తిరుపతి కొండపై నంపెరుమాళ్ విగ్రహాలను భద్రపరిచి సుమారు 50 ఏళ్లపాటు వాటిని సంరక్షించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా శ్రీరంగం రంగనాథుని ఆలయం నుంచి తిరుపతి వెంకటాచలపతి ఆలయానికి ఆడి మాసం తొలి రోజున వస్త్ర కైంకర్యం నిర్వహిస్తారు. ఆడి మాసాన్ని పురస్కరించుకుని శ్రీరంగం ఆలయం నుంచి తిరుపతి వెంకటా చలపతి ఆలయానికి పట్టువస్త్రాలు, గొడుగులను వ్యాన్‌లో ఆదివారం ఉదయం అర్చకులు తీసుకువెళ్లారు. ఆలయ జాయింట్ కమిషనర్ శివరాంకుమార్ భద్రతను పర్యవేక్షించారు.

షాపులోకి దుసుకెళ్లిన లారీ – ముగ్గురి మృతి

అన్నానగర్: రామనాథపురం జిల్లా తొండి ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం దేవి పట్నం సమీపంలోని అమ్మారి గ్రామానికి ఇసుక లోడుతో లారీ బయలుదేరింది. మార్గంమధ్యలో దేవీపట్నం బస్టాండ్ సమీపంలోని వంకలో మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా షాపులో కూర్చున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రామస్వామి(54) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉలగసుందరం (63), జగన్నాథన్ (55), లారీ డ్రైవర్ సురేష్ (37) తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురినీ చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉలగసుందరం, జగన్నాథన్ మృతి చెందారు. దేవీ పట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ముగ్గురు మహిళల దుర్మరణం



కొరుక్కుపేట: విల్లుపురం జిల్లా కోటకుప్పం సమీపంలోని పుదుకుప్పం మత్స్యకార గ్రామానికి చెందిన మహిళలు పుదుచ్చేరి పెద్ద మార్కెట్‌కి వెళ్లి చేపలను కొనుగోలు చేసి కలప, కిలిపుత్తుపట్టు వంటి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఆదివారం ఉదయం లక్ష్మి (45), గోవిందమ్మాళ్ (50), పుదుకుప్పానికి చెందిన నాయక్ (46), కోమలం (52), గెంగయ్యమ్మాళ్ (53), ప్రేమ (45) పుదుక్కుప్పం ఈసీఆర్ రోడ్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. వీరిని చెన్నై నుంచి పుదుచ్చేరికి ఉదయం 5 గంటలకు ఎదురుగా వస్తున్న కారు అనూహ్యంగా అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మి(45), గోవిందమ్మాల్ (50), గెంగయ్యమ్మాళ్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన మిగిలిన ముగ్గురిని జిప్మర్ ఆసుపత్రికి తరలించారు. కోట కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి కారు నడుపుతున్న చెన్నైకి చెందిన డ్రైవర్‌ను అదుపులోకి ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రానికి చేరుకున్న హజ్ యాత్రికులు



హజ్ యాత్రికులను ఆహ్వానిస్తున్న మంత్రి సెంజి మస్తాన్

సాక్షి, చెన్నై: మూడేళ్ల అనంతరం చెన్నై నుంచి హజ్ యాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణమైన యాత్రికుల బృందాన్ని ఆదివారం విమానాశ్రయంలో మంత్రి సెంజి మస్తాన్ ఆహ్వానించారు. కరోనా కారణంగా రెండేళ్లు హజ్ యాత్రకు అనుమతి దక్కలేదు. గత ఏడాది కేరళ నుంచి తమిళ యాత్రికులు బయలు దేరాల్సి వచ్చింది. ఎట్టకేలకు మూడేళ్ల అనంతరం చెన్నై నుంచి తమిళనాడు ప్రభుత్వం తరఫున హజ్ కమిటీ ఎంపిక చేసిన బృందాలు గత నెల హజ్‌యాత్రకు తీసుకెళ్లాయి. చెన్నై నుంచే విమానాలు బయలుదేరడంతో హజ్ యాత్ర కోసం ముస్లింలు బృందాలుగా వెళ్లారు. 40 రోజుల యాత్రను ముగించుకుని చెన్నైకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. వారిలో తొలి బృందం ఆదివారం ఉదయం చెన్నైకు చేరుకుంది. విమానాశ్రయంలో వీరిని రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్, వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ విభాగం అధికారులు ఆహ్వానించారు.

మద్యం రహిత రాష్ట్రమే లక్ష్యం

సాక్షి, చెన్నై: మద్యం, పొగాకు రహిత రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పీఎంకే వ్యవస్థాపకుడు రాందాసు, ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రతిజ్ఞ చేశారు. పీఎంకే 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాడవాడలా పార్టీ జెండాలను నేతలు ఎగురవేశారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం ఎస్టేట్‌లో ఆ పార్టీ వ్యవస్థాపకుడు రాందాసు జెండాను ఆవిష్కరించారు.

ప్లస్-2, ఇంజినీరింగ్ ర్యాంకుల్లో బాలికలు సత్తా చాటితే, నీట్ మార్కుల ఆధారంగా కేటాయించిన వైద్య సీట్లలో అబ్బాయిలు అదర గొట్టారు. రెండు విభాగాల్లో టాప్ టెన్ ర్యాంకుల్లో ఏకంగా 13 మంది చోటు సంపాదించారు. ఏడుగురు విద్యార్థినులు సైతం ర్యాంకులు దక్కించుకున్నారు. ప్రభుత్వ కోటా సీట్ల భర్తీలో విల్లుపురానికి చెందిన ప్రభంజన్ 720 మార్కులతో తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారికి అమలు చేస్తున్న స్థానిక కోటాగా 7.5 శాతం రిజర్వేషన్ సీట్లలో తొలి ర్యాంక్‌ను 569 మార్కులతో సేలానికి చెందిన కృతిక తొలి స్థానం దక్కించుకుంది.

- ‘నీట్’ కౌన్సెలింగ్‌లో అత్యధిక ర్యాంకుల కైవసం
- 2 విభాగాల్లో టాప్‌టెన్‌లో 13 మందికి చోటు
- జాబితా విడుదల చేసిన మంత్రి సుబ్రమణియన్
- సీట్ల కేటాయింపునకు సిద్ధమైన వైద్య విద్యా డైరెక్టరేట్
- జూలై 25 నుంచి శ్రీకారం
- 5400 సీట్లకు 40 వేల మంది దరఖాస్తు
- తొలి ర్యాంకర్లుగా ప్రభంజన్, కృతిక



ర్యాంకుల జాబితాను విడుదల చేస్తున్న మంత్రి ఎం. సుబ్రమణియన్

అబ్బాయిల హవా!

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో 36 ప్రభుత్వ వైద్య కళాశాలలు, రెండు దంత వైద్య, ఈఎస్ఐ కళాశాలలోని ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టరేట్ చర్యలు ప్రారంభించింది. ఇందులో ప్రభుత్వ కోటా పరిధిలో 5,400 సీట్లు ఉన్నాయి. వీటిని వైద్య విద్యా డైరెక్టరేట్ భర్తీ చేయనుంది. ఈ సీట్ల కోసం నీట్‌మార్కుల ఆధారంగా 40,193 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 3,994 దరఖాస్తులు అధికంగా వచ్చాయి. వీటిని పరిశీలించి నీట్‌మార్కుల ఆధారంగా రాష్ట్రంలో టాపర్లుగా ఉన్న ర్యాంకర్ల జాబితాను ఆదివారం ఆరోగ్య శాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్, కార్యదర్శి గగన్ దీప్ సింగ్ బేడీ విడుదల చేశారు. ర్యాంకుల జాబితాను ప్రభుత్వ కోటా సీట్లు, 7.5 శాతం రిజర్వేషన్ కోటా సీట్లుగా విభజించి రెండు విభాగాలుగా ప్రకటించారు.

గిండిలో కౌన్సెలింగ్

రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎం. సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర వైద్య విద్యా కమిటీ జాతీయ స్థాయి కౌన్సెలింగ్‌కు ఈనెల 20వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్టు ప్రకటించిందన్నారు. సకాలంలో జాతీయ కౌన్సెలింగ్ మొదలైన పక్షంలో రాష్ట్రంలో ఈనెల 25వ తేదీ నుంచి వైద్య సీట్ల భర్తీ ప్రక్రియకు శ్రీకారం చుడుతామని ప్రకటించారు. సీట్ల భర్తీ ప్రక్రియ మొత్తం గిండిలోని కలైంజ్ఞర్ శత జయంతి స్మారక మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల కోసం స్థానిక కోటాగా ఉన్న 7.5 శాతం రిజర్వేషన్ సీట్ల కోసం 3,042 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. క్రీడా కోటా కింద 179 మంది, మాజీ సైనికోద్యోగుల కోటా కింద 401, ప్రత్యేక ప్రతిభావంతుల కోటా కింద 98 మంది దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. ఈ ఏడాది 7.5 శాతం స్థానిక కోటా సీట్లు అదనంగా 606 మంది విద్యార్థులకు దక్కనున్నాయని ప్రకటించారు. తెన్‌కాశి, పెరంబలూరు, మైలాడుతురై, తిరుపత్తూరు, రాణిపేటలో వైద్య కళాశాలలకు అనుమతి కోరి ఉన్నామని, 2024లో ఈ కళాశాలల ద్వారా అదనంగా సీట్లు దక్కే అవకాశం ఉందన్నారు. కాగా గతంలో టాప్‌టెన్‌లో అత్యధికంగా విద్యార్థినులే ఉండే వారు. అయితే, ఈ సారి విద్యార్థులు అత్యధిక శాతం మంది ర్యాంకుల్లో సత్తా చాటడం విశేషం.



ప్రభుత్వ కోటా సీట్లలో..



ప్రభుత్వ కోటా సీట్లలో జాతీయ స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించిన ప్రభంజన్

ప్రభుత్వ కోటా సీట్లలో టాపర్లుగా టాప్‌టెన్‌లో 8 మంది విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులు నిలిచారు. 720మార్కులో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచిన విల్లుపురానికి చెందిన ప్రభంజన్ తమిళనాడులోనూ తొలి ర్యాంకర్‌గా నిలిచాడు. చెన్నైకు చెందిన సూర్య సిద్దార్ 715 మార్కులతో రెండు ర్యాంకు, సేలానికి చెందిన వరుణ్ 715 మార్కులతో మూడో ర్యాంకు దక్కించుకున్నాడు. కోయంబత్తూరుకు చెందిన సంజన 705 మార్కులతో నాలుగో ర్యాంక్, తిరువళ్లూరు రోశన్ 705 మార్కులతో ఐదో ర్యాంకు, చెన్నైకు చెందిన ప్రకాష్ 705 మార్కులతో ఆరో ర్యాంకు, సేలానికి చెందిన కవియరసు 705 మార్కులతో ఏడోర్యాంకు, చెన్నైకు చెందిన అభినేష్ 705 మార్కులతో 8వ ర్యాంకు, కాంచీపురానికి చెందిన లక్షన్యా అభికేషన్ 705 మార్కులతో 9వ ర్యాంకు, తిరువణ్ణామలై తమిళ్ ఇనియన్ 10వ ర్యాంకు దక్కించుకున్నారు.

7.5 శాతం కోటా సీట్లల్లో..



7.5 శాతం కోటాలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన కృతిక

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని 7.5 శాతం కోటా రిజర్వేషన్‌తో టాప్ టెన్‌లో ఐదుగురు బాలురు, మరో ఐదుగురు బాలికలు ఉత్తమ ర్యాంకులు దక్కించుకున్నారు. తొలి ర్యాంకును సేలానికి చెందిన కృతిక 569 మార్కులతో దక్కించుకున్నారు. 565 మార్కులతో ధర్మపురికి చెందిన పచ్చయప్పన్ రెండో ర్యాంకు, 560 మార్కులతో కాంచీపురానికి చెందిన మురుగన్ మూడో ర్యాంకు, 544 మార్కులతో తిరువణ్ణామలై కు చెందిన రోజా నాలుగు ర్యాంకు, శివగంగైకు చెందిన అన్నపూర్ణి 538 మార్కులతో ఐదో ర్యాంకును దక్కించుకున్నారు. సేలంకు చెందిన అర్చన 537మార్కులతో 6వ ర్యాంకు, అరియలూరుకు చెందిన అన్నపూర్ణి 533 మార్కులతో 7వ ర్యాంకు, పెరంబలూరుకు చెందిన పుగలేంది 531 మార్కులతో 8వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. తేనికి చెందిన గణేష్ 530 మార్కులతో 9వ ర్యాంకు, తిరుపత్తూరుకు చెందిన శ్యామ్ 523 మార్కులతో 10వ ర్యాంకును సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తాను టాపర్‌గా నిలవడంపై విద్యార్థిని కృతిక ఆనందం వ్యక్తం చేశారు. తన తల్లి సహకారం, ప్రోత్సాహంతోనే తాను ఈ పరీక్ష రాసినట్టు ఆమె వివరించారు. అయితే టాపర్ నిలుస్తానని మాత్రం ఊహించుకోలేదని పేర్కొన్నారు.

నేడు బెంగళూరుకు సీఎం స్టాలిన్



సీఎం స్టాలిన్



పళణి స్వామి

సాక్షి, చెన్నై: ప్రతిపక్ష పార్టీల సమావేశం నిమిత్తం సీఎం స్టాలిన్ సోమవారం బెంగళూరుకు బయలు దేరనున్నారు. రెండు రోజులు ఆయన అక్కడే ఉంటారని సమాచారం. పాట్నా వేదికగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో గత నెల 23వ తేదీన 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి పక్ష పార్టీల సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఇందులో లౌకికవాద పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఒకే వేదిక మీదకు వచ్చారు. ఈ సమావేశానికి డీఎంకే దివంగత నేత కలైంజ్ఞర్ కరుణానిధి ప్రతినిధిగా సీఎం స్టాలిన్ హాజరయ్యారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పే విధంగా వ్యూహాలకు పదును పెట్టారు. ఇదే సమావేశంలో సోమ, మంగళవారాలలో కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికగా జరగనుంది. ఈ సమావేశానికి సీఎం స్టాలిన్ హాజరు అవుతారా..? అన్న చర్చ తొలుత చోటు చేసుకుంది. ఇందుకు కారణం కావేరి వ్యవహారంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరే. అయితే ఈ సమావేశానికి సీఎం హాజరుకావాలని నిర్ణయించారు. సోమవారం ఉదయం ఆయన బెంగళూరుకు బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం సాయంత్రం చెన్నైకు తిరిగి రానున్నారు.

ఢిల్లీకి రేపు వెళ్లనున్న పళణి

ప్రతిపక్షాలన్నీ ఓ వైపు ఏకమవుతోంటే, మరోవైపు ఎన్‌డీఏ మిత్రపక్షాలతో సమావేశానికి బీజేపీ సిద్ధమైంది. ఈనెల 18వ తేదీన ఢిల్లీ వేదికగా ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రప్రథమంగా పళని స్వామి హాజరు కానున్నారు. ఆదివారం చెన్నైలోని పార్టీ కార్యాలయంలో ఈ సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలు, ఆగస్టులో మదురైలో జరగనున్న మహానాడు విజయవంతం లక్ష్యంగాచేపట్టాల్సిన కార్యక్రమాల గురించి పళణిస్వామి పార్టీ ముఖ్య నేతలతోచర్చించారు. ఈ సమావేశం నిమిత్తం మంగళవారం ఉదయం చెన్నై నుంచి ఢిల్లీకి పళణి వెళ్లనున్నారు. అలాగే ఈ సమావేశం నిమిత్తం తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, పీఎంకే నేత అన్బుమణికి సైతం ఆహ్వానాలు అందాయి. వీరు కూడా బయలుదేరే అవకాశం ఉంది.

ఫుట్‌బోర్డు ప్రయాణంలో ఫైట్!

- రైలు నుంచి జారి పడి ఇద్దరు యువకుల మృతి
- సాత్తూరు సమీపంలో ఘటన

సాక్షి, చెన్నై: వేగంగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఫుట్ బోర్డు వద్ద కూర్చునే విషయంపై ఇద్దరు యువకుల మధ్య రేగిన వివాదం చివరికి వారి ప్రాణాలనే బలి తీసుకుంది. ఇద్దరు గొడవ పడి ప్రమాదవశాత్తూ రైలు నుంచి కింద పడ్డారు. ఒకరు సంఘటనా స్థలంలోనే మరణించగా, మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. విరుదునగర్ జిల్లా సాత్తూరు వద్ద ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. కోయంబత్తూరు నుంచి నాగర్ కోయిల్‌కు రోజూ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం బయలుదేరుతుంది. ఆదివారం సెలవు దినం కావడంతో అన్ రిజర్వుడ్ బోగీల్లో రద్దీ మరీ ఎక్కువగా ఉంది. ఈ సమయంలో రైలు మదురై జంక్షన్ దాటినానంతరం ఫుట్‌బోర్డు వద్ద కూర్చునే విషయంగా తెన్‌కాశి జిల్లా ఆలంకులానికి చెందిన ముత్తుకృష్ణన్(32), తూత్తుకుడి కోవిల్ పట్టికి చెందిన మారియప్పన్ (36) మధ్య గొడవ చోటు చేసుకుంది. విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని ఆర్ఆర్ నగర్ స్టేషన్‌కు సమీపంలో పరస్పరం కొట్టుకుంటూ రైలు నుంచి జారి కింద పడ్డారు. ఈ హఠాత్పరిణామంతో ఆందోళనకు లోనైన ప్రయాణికులు రైలు చైన్ లాగేశారు. భద్రతా సిబ్బంది, రైలు గార్డులు వచ్చి చూడగా ఒకరు ఘటనా స్థలంలోనే తీవ్ర గాయాలతో మరణించాడు. మరొకరు కొన ఊపిరితో ఉండగా ఆస్పత్రికి తరలించారు. మార్గం మధ్యలో అతడు కూడా మృతి చెందాడు.

మహా విషాదానికి 19 ఏళ్లు!



నివాళులర్పిస్తున్న తల్లిదండ్రులు

- కన్నీటి సంద్రంలో కుటుంబాలు
- 94 మంది చిన్నారుల ఫొటోల వద్ద ఘన నివాళి

సాక్షి, చెన్నై: ముక్కుపచ్చలారని 94 మంది పిల్లల్ని బలి కొన్న కుంబకోణం శ్రీకృష్ణా పాఠశాల అగ్ని ప్రమాదం ఘటనకు ఆదివారంతో 19 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో ఆ పిల్లల తల్లిదండ్రులు, ఆప్తులు, పాఠశాలల విద్యార్థులు ఆ ఘటన జరిగిన ప్రదేశంలో ఘన నివాళుర్పించారు. వివరాలు.. 2004 జూలై 16న తంజావూరు జిల్లా కుంబకోణంలోని శ్రీ కృష్ణా పాఠశాలలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదం గురించి అందిరికీ తెలిసిందే. దేశాన్నే కదిలించిన ఈ ఘటనలో ముక్కు పచ్చలారని 94 మంది చిన్న పిల్లలు ఆహుతయ్యారు. ఏటా ఈ ఘటన జరిగిన రోజున కుంబకోణం విద్యార్థిలోకం, తల్లిదండ్రులు మృతి చెందిన పిల్లలకు నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఘటనకు ఆదివారం 19 ఏళ్లు కావడంతో బాధిత తల్లిదండ్రులు తమ పిల్లల స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. కాశిరాయన్ వీధిలో ఉన్న ఆ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లో 94 మంది పిల్లల ఫొటోలను పొందు పరిచారు. కుంబకోణంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు తరలి వచ్చి నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలగించి అంజలి ఘటించారు. అలాగే, పాలకరైలో విద్యార్థుల స్మారకంగా నిర్మించిన స్తూపం వద్ద సైతం పెద్దసంఖ్యలో జనం సైతం తరలి వచ్చి నివాళులర్పించారు. మహామహం పుష్కరిని వద్ద ఆ పిల్లలను స్మరిస్తూ మోక్ష దీపం వెలిగించారు.

స్మారకం ఏర్పాటుపై స్టాలిన్ పునరాలోచన

- సమాధి వద్దే చిన్నపాటి ‘పెన్ను చిహ్నం’?



కరుణ సమాధి, పెన్ను స్మారకం నమూనా

సాక్షి, చెన్నై: దివంగత నేత కరుణానిధి స్మారకంగా మెరీనా సముద్రంలో ఏర్పాటు చేయదలిచిన పెన్ను నిర్మాణం రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. కొన్ని వర్గాల నుంచి విమర్శలు, ఆరోపణలతో పాటు ఖజానాకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో భారీ స్థాయిలో కాకుండా చిన్న పాటి పెన్ను చిహ్నాన్ని కరుణ సమాధి వద్దే ఏర్పాటు చేయాలని ప్రస్తుతం సీఎం స్టాలిన్ భావిస్తున్నట్లు తెలిసింది. వివరాలు.. మెరీనా తీరంలో దివంగత నేతలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి సమాధులు ఉన్న విషయం తెలిసిందే. ఫీనిక్స్ పక్షి ఆకారంలో ఉన్న దివంగత సీఎం జయలలిత సమాధిని తలదన్నే విధంగా తమ నేత కరుణానిధి సమాధి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు డీఎంకే పాలకులు చర్యలు తీసుకున్నారు. అలాగే, ఈ సమాధికి కూతవేటు దూరంలోని సముద్ర ముఖ ద్వారం వద్ద పెన్ను చిహ్నం నిర్మాణానికి నిర్ణయించారు. అద్దాల వంతెన, పార్కులు, 144 అడుగుల ఎత్తులో పెన్ను చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకు వ్యతిరేకంగా విమర్శలు, ఆరోపణలు వచ్చినా..., కేంద్ర పర్యావరణ తదితర అన్ని రకాల అనుమతులు ప్రభుత్వానికి దక్కాయి. అలాగే అనేక రకాల నిబంధనలను నిర్మాణ పనులకు విధించారు. వీటన్నింటినీ అధిగమించి పనులు చేపట్టేందుకు ప్రజా పనుల శాఖ కసరత్తుల్లో నిమగ్నమైంది.

మనసు మార్చుకున్నారా..?

కొన్ని వర్గాల నుంచి విమర్శలు, ఆరోపణలు, వ్యతిరేకతతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రూ. 80 కోట్లు వెచ్చించి భారీ స్మారకం అవసరమా..? అన్న ఆలోచనలో సీఎం స్టాలిన్ ఉన్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. రాష్ట్రంలో బృహత్తర పథకాలు అమల్లో ఉన్న నేపథ్యంలో, కరుణ పేరిట బ్రహ్మాండ ప్రగతి పనులు సాగుతున్న తరుణంలో ఈ చిహ్నం అవసరం లేదని భావిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో రెండు రోజుల క్రితం సీఎం స్టాలిన్‌తో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ భేటీ సమయంలో ఈ పెన్ను చిహ్నం చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఆగస్టు 7వ తేదీ కరుణానిధి వర్ధంతి కావడంతో ఆలోపు స్మారకం నిర్మాణానికి చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం సమాధి పరిసరాలు సుందరంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో అక్కడే ప్రజల్ని ఆకర్షించే విధంగా పెన్ను చిహ్నం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. అదే రోజున సుందరంగా రూపుదిద్దుకున్న సమాధి, చిహ్నంను సీఎం స్టాలిన్ ఆవిష్కరించే అవకాశాలు ఉందని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

చెన్నై వేదికగా హాకీ టోర్నీ

- ఆగస్టు 3 నుంచి 12 వరకు పోటీలు
- వేదికగా మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్



సాక్షి, చెన్నై: ఆసియా ఖండంలోని వివిధ దేశాల జట్టులతో భారీ హాకీ టోర్నీని చెన్నై వేదికగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ ఆదివారం ప్రకటించారు. ఆగస్టు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆసియా ఛాంపియన్ షిప్ హాకీ ట్రోఫీ -2023 పోటీలు ఎగ్మూర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో జరుగుతాయన్నారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలను ఇటీవల చెన్నై వేదికగా రాష్ట్ర ప్రభుత్వం విజయవంతం చేసిన విషయం తెలిసిందే. తమిళనాడు వేదికగా మ రిన్ని అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హాకీ ఇండియా నేతృత్వంలో తమిళనాడు ప్రభుత్వ సౌజన్యంతో ఆసియా ఛాంపియన్ షిప్ పోటీలకు చెన్నైను వేదికగా ఎంపిక చేశామని ఆదివారం క్రీడా మంత్రి ఉదయ నిధి స్టాలిన్ మీడియాకు వెల్లడించారు.

ఆరు దేశాల నుంచి జట్లు

చెన్నై ఎగ్మూర్ మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో ఆగస్టు 3 నుంచి 12 వతేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని మంత్రి ప్రకటించారు. ఇందులో ఆసియా ఖండంలోని జపాన్, మలేషియా, పాకిస్తాన్, చైనా, దక్షిణ కొరియా, భారత్ వంటి ఆరు దేశాల హాకీ జట్టులు తలపడనున్నాయని వివరించారు. చెన్నైను ఈ టోర్నీకి వేదికగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. 2007లో చెన్నైలో హాకీ టోర్నీ జరిగిందని పేర్కొన్నారు. 16 ఏళ్ల అనంతరం చెన్నై మరో మారు వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీలకు తరలి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ పోటీల నిర్వహణతో తమిళనాడు వైపుగా అంతర్జాతీయ పోటీలు మరిన్ని నిర్వహించేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు


అరెస్టయిన అంగ్రేజ్ సదా

తిరువళ్లూరు: కేరళ నుంచి గంజాయిని కొరియర్ ద్వారా తెప్పించి విక్రయించడానికి యత్నించిన బిహార్‌కు చెందిన యువకుడ్ని రెడ్‌హిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ బస్టాండు, మార్కెట్‌యార్డుతో పాటు జనసంచారం ఎక్కువగా వున్న ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల గస్తీ పెంచారు.. ఈ సమయంలో అనుమానస్పదంగా పార్శిల్ బ్యాగుతో సంచరిస్తున్న వ్యక్తిని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడు బిహార్‌కు చెందిన సత్తుందాన్ సదా కుమారుడు అంగ్రేజ్ సదా(19)గా గుర్తించారు. అతడి నుంచి మూడు కిలోల గంజాయి పార్శిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

తిరువళ్లూరు: ఫర్నీచర్ తయారు చేసే దుకాణంలో ఏర్పడిన అగ్నిప్రమాదం కారణంగా రూ.5 లక్షలు మేరకు ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు.. తిరువళ్లూరు పట్టణంలోని జేఎన్‌రోడ్డు ప్రాంతానికి చెందిన లక్ష్మణన్(69). ఇతను కాకలూరులో అయ్యప్ప లైనింగ్ వర్క్స్ పేరిట సోఫాసెట్ ఫర్నీచర్ తయారు చేసే దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శనివారం యథావిధిగా దుకాణాన్ని నిర్వహించి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అయితే దుకాణం నుంచి శనివారం రాత్రి హఠాత్తుగా మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు లక్ష్మణన్‌కు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది దాదాపు 30 నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే రూ. 5 లక్షల విలువ చేసే ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు వాపోయారు. కాగా ప్రమాదానికి గల కారణాలను తాలుకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయాల్లో ప్రదోష పూజలు


అరుణాచలేశ్వరాలయంలో నంది భగవాన్‌కు అభిషేకం చేస్తున్న శివాచార్యులు, పాల్గొన్న భక్తులు

వేలూరు : వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని శివాలయాల్లో ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి కర్పూర హారతులు పట్టారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని పెద్ద నంది భగవాన్‌కు శివాచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి వివిధ కాయకూరలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం శివాచార్యులు కర్పూర హారతి పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడిని అలంకరించిన బంగారు వృషభ వాహనంలో ఉంచి ఆలయ మూడవ ప్రాకారం నుంచి మాడ వీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మాడ వీధుల్లో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వేలూరు కోట మైదానంలోని జలగంతేశ్వరాలయంలోని నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి కర్పూర హారతులు పట్టారు. అదేవిధంగా వాలజలోని శ్రీ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని నంది భగవాన్‌ను దర్శించుకున్నారు. ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడింది. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి


ప్రత్యేక యాప్‌పై యువతులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు

తిరువళ్లూరు: మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం పోలీసులను కలిసి నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని డిప్యూటీ కమిషనర్ గీత తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు, చిన్నారులపై వేధింపులు ఎక్కువయ్యాయని.. అయితే చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదన్నారు. మహిళలు చిన్నారులపై తరచూ జరుగుతున్న వేధింపులపై ఫిర్యాదు చేయడం, అత్యవసర సమయంలో పోలీసులు ఎలా ఆశ్రయించాలి, పోలీసులు తయారు చేసిన ప్రత్యేక యాప్‌ను ఎలా వాడాలనే విషయంపై సెవ్వాపేట, తిరునిండ్రవూర్, పట్టాబిరామ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ గీత మాట్లాడుతూ అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చే యాప్‌ను యువతులు తమ సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు పోలీసుల సాయం కోసం 1098, 1091, 101, 112, 1930, 1906 తదితర టోల్‌ఫ్రీ నంబర్‌లను సంప్రదించాలన్నారు.

విస్తృత సాంకేతికతతో నీటి శుద్ధీకరణ

సాక్షి, చెన్నై : విస్తృత సాంకేతికతతో నీటి శుద్ధీకరణ ప్రాజెక్టులను వేగవంతం చేశామని వీఏ టెక్ బాగ్వెగ్ సీఎండీ రాజీవ్ మిట్టల్ తెలిపారు. కొత్త నీటి శుద్ధీకరణ ప్రాజెక్టుల గురించి స్థానికంగా ఆదివారం ఆయన వివరించారు. ప్రపంచ బ్యాంక్, ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంక్‌ల సహకారంతో అనేక ప్రాజెక్టులపై దృష్టి పెట్టామన్నారు. కొద్ది రోజుల క్రితం బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా చేతుల మీదుగా ఢాకాలో తమప్రాజెక్టు ఒకటి మొదలెట్టామన్నారు. ఇక్కడ పూర్తిగా జల శుద్ధి ప్రక్రియ గ్రీన్ ఫ్యూయల్ ఆధారంగా జరుగుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నీటి శుద్ధీకరణలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు స్వచ్ఛమైన మెరుగైన నీరు అందించడం లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో చేపట్టిన ప్రాజెక్టు తరహాలో ఇక్కడ కూడా తమ ప్రాజెక్టులను విస్తృతం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

వేర్వేరుగా తడిచెత్త, పొడిచెత్త సేకరణ


మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సురేందర్‌షా, చైర్‌పర్సన్ ఉదయమలర్

తిరువళ్లూరు: తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించనున్నట్లు తిరువళ్లూరు మున్సిపల్ కమిషనర్ సురేందర్‌షా వెల్లడించారు. తిరువళ్లూరు మున్సిపాలిటీలోని వేర్వేరు ప్రాంతాల్లో కమిషనర్ సురేందర్‌షా, చైర్‌పర్సన్ ఉదయమలర్ విస్తృతంగా పర్యటించారు. నా చెత్త– నా బాధ్యత పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ప్రసగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువళ్లూరు పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడి నుంచి రోజుకు 20 నుంచి 30 టన్నుల చెత్తకుప్పలను సేకరిస్తున్నాన్నారు. పట్టణంలోని 27 వార్డుల్లో 427 వీధులున్నాయని వాటి నుంచి 173 మంది కార్మికులు రోజూ చెత్త సేకరిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రజలు చెత్తకుప్పలను వేరు చేసి అందించాలని పలుమార్లు కోరినా ఫలితం లేదన్నారు. దీంతో చెత్తకుప్పలను సేకరించిన తరువాత వాటిని వేరుచేసి డంప్‌యార్డు, సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రానికి తరలించడం భారంగా మారిందని కమిషనర్ తెలిపారు. ఇకపై ప్రజలే చెత్తను మగ్గిన, మగ్గని కుప్పలుగా కచ్చితంగా వేరు చేసి కార్మికులకు అందించాలని సూచించారు. ఇదే అంశంపై ప్రజలకు మరింత విస్తృతంగా కార్మికులు అవగాహన కల్పించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో శానిటరీ అధికారి గోవిందరాజన్‌తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్‌లు అరుణజైకృష్ణ, జాన్, ప్రభాకరన్ పాల్గొన్నారు.

హిందూ ఫ్రంట్ ఆధ్వర్యంలో ధర్నా


ఆందోళన నిర్వహిస్తున్న హిందు మున్నణీ నేతలు

తిరువళ్లూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలు, వాటి ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ తిరువళ్లూరు జిల్లా హిందూ మున్నణీ నేతలు ఆదివారం ఉదయం పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ధర్నా నిర్వహించారు. స్థానిక రైతు బజారు వద్ద నిర్వహించిన ఆందోళనకు జిల్లా అధ్యక్షుడు వినోద్‌కన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత హిందువులకు ఆలయాలకు భద్రత కరువైయ్యిందన్నారు. 1947 సంవత్సరం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా హిందూ దేవాలయాలకు 5.25 లక్షల ఎకరాల భూములు వుండగా ప్రస్తుతం 4.78 లక్షల ఎకరాల ఆస్తులు మాత్రమే ఉన్నాయని, మాయమైన 50 వేల ఎకరాల ఆస్తులను వెంటనే గుర్తించి స్వాధీనం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఆలయాలను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారీ పునఃనిర్మించి కుంభాభిషేకం నిర్వహించాలన్నారు.

దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయాల అభివృద్ధి కోసమే వినియోగించాలని కోరారు. ఆలయాల్లో తరచూ మాయమవుతున్న ఆస్తులు, విలువైన ఆభరణాలు, విగ్రహాలను గుర్తించడానికి ప్రత్యేక కమిటీని వేసి నిజనిర్ధారణ చేయాలని కోరారు. ఈ ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేషన్ నిర్వాహకులు మునికృష్ణన్, రాజన్, రఘునాధన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీనీ చిత్రం పైనే ఆశలు


కల్యాణి ప్రియదర్శన్

తమిళసినిమా: సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటీమణుల్లో కల్యాణి ప్రియదర్శన్ ఒకరు. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్, నటి లిజీల వారసురాలైన ఈమె బహుభాషా నటిగా రాణిస్తున్నారు. అయితే ఇప్పటికీ కెరియర్లో సరైన హిట్టు పడలేదు అన్నది వాస్తవం . తరువాత తెలుగులో హలో అంటూ పలకరించిన కల్యాణి ప్రియదర్శన్ అక్కడ వరుసగా మూడు చిత్రాలు చేశారు. తొలి చిత్రం హలో నిరాశ పరిచినా, చిత్రలహరి చిత్రం విజయం సాధించింది. అయితే అది నటుడు సాయి ధరమ్ తేజ్ ఖాతాలోనే పడింది. ఇక మలయాళంలో పలు చిత్రాల్లో నటిస్తూ.. మంచి విజయం కోసం ఎదురుచూస్తున్నారు. తమిళం విషయానికి వస్తే హీరో చిత్రంతో రంగప్రవేశం చేశారు. ఆ తరువాత పుత్రం పొందు కాళై, మానాడు తదితర చిత్రాల్లో నటించారు. అయితే ఇక్కడ శింబు సరసన నటించిన మానాడు చిత్రం విజయం సాధించిన కళ్యాణి ప్రియదర్శన్‌కి పెద్దగా క్రేజీ తీసుకు రాలేదు. అలాంటిది తాజాగా జయం రవి సరసన జీనీ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ప్రతి కృతిశెట్టి, వామిక కబీ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే ఈ చిత్రంతనకు మంచి గుర్తింపు తెచ్చిపడుతుందనే నమ్మకాన్ని కల్యాణి ప్రియదర్శిన్ వ్యక్తం చేస్తున్నారు. తన తాజా తమిళ చిత్రంలో నటించడం చాలా ఎక్సైటింగ్ గా ఉందని పేర్కొన్నారు. ఇది తన కెరీర్లో చాలా విలువైన చిత్రంగా మిగిలిపోతుందని నమ్మకం ఉందన్నారు. ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇది చాలా ఇంట్రెస్టింగ్ కథతో రూపొందుతున్న చిత్రమని చెప్పారు. ఇందులో తనది నటించడానికి అవకాశం ఉన్న పాత్ర అని తెలిపారు. మంచి స్టార్ క్యాస్టింగ్ ఉన్న ఈ చిత్రం మంచి విజయాన్ని సాధిస్తుందని నమ్మకం ఉందన్నారు.

కోలీవుడ్ టాక్స్

విజయకాంత్ వారసుడు హీరోగా నూతన చిత్రం


చిత్ర ప్రారంభోత్సవంలో షణ్ముకపాండియన్ తదితరులు

తమిళసినిమా: నటుడు విజయ్‌కాంత్ కుమారుడు షణ్ముఖ పాండియన్ ఇంతకుముందు మదురై వీరన్ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అయిన విషయం తెలిసిందే. తాజాగా ఈయన కథానాయకుడుగా నటిస్తున్న చిత్రం శనివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. డైరక్టర్స్ సినిమాస్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి కథనం, మాటలు పార్తీపన్ దేసింగు అందించగా, వాల్టర్, రెక్కా చిత్రాలు ఫేమ్ యు.అన్బు దర్శకత్వం వహిస్తున్నారు. కస్తూరి రాజా, ఎమ్మెస్ భాస్కర్, యామిని సుందర్ తదితరులు ముఖ్యపాత్ర పోషిస్తున్న ఇందులో మరికొందరు ప్రముఖ నటీనటుల ఎంపిక జరుగుతుందని దర్శకుడు తెలిపారు. ఇది వైవిధ్య భరిత యాక్షన్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. చిత్ర తొలి షెడ్యూల్ కేరళలోని దట్టమైన అడవుల్లో ప్రారంభించినట్లు తెలిపారు. తదుపరి షెడ్యూల్‌ను ఒడిశా, థాయిల్యాండ్ అడవుల్లో చిత్రీకరించనున్నట్లు చెప్పారు. ఇది అటవీ ప్రాంతంలోని ఏనుగులు, అక్కడి మనుషుల జీవన విధానాన్ని ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. దీనికి ఎస్ఆర్ సతీష్ కుమార్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

ధ్రువ నక్షత్రంలో కదలిక

తమిళసినిమా: నటుడు విక్రమ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ధ్రువనక్షత్రం. నటి రీతూ వర్మ నాయకిగా నటించిన ఈ చిత్రంలో నటుడు పార్తీపన్, రాధికా శరత్ కుమార్, సిమ్రాన్, ఐశ్వర్య రాజేష్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో ఈ చిత్రం 2017లోనే ప్రారంభం అయ్యింది. షూటింగ్ కొంత భాగం లండన్‌లో జరుపుకుంది. ఇందులో నటుడు విక్రమ్ జాన్ అనే పవర్ ఫుల్ పాత్రలో నటించారు. 2018లో విడుదల కావాల్సింది. అనివార్య కారణాల వల్ల కాలేదు. ఈ చిత్రం విడుదల గురించి పలుమార్లు వార్తలు వెలువడ్డాయి. కానీ ఐదేళ్లు దాటినా ధ్రువనక్షత్రం ఇప్పటి వరకు తెరపైకి రాలేదు. ఇంతకు ముందే చిత్రం లోని ఒక పాటను విడుదల చేశారు. తాజాగా రెండో పాటను ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నట్లు ఓ పోస్టర్ ను విడుదల చేశారు. అందులో త్వరలోనే జాన్‌ను చూస్తారు అని పేర్కొన్నారు. దీంతో ధ్రువనక్షత్రం చిత్రానికి త్వరలోనే మోక్షం లభిస్తుందని తెలుస్తోంది. దీంతో పొన్నియిన్ సెల్వన్ చిత్రం తర్వాత ధ్రువనక్షత్రం రాబోతోందని విక్రమ్ అభిమానులు ఆనందంతో ఎదురు చూస్తున్నారు.


విక్రమ్, రీతూవర్మ

మణిరత్నం మద్రాస్ టాకీస్‌లో త్రిష


త్రిష

తమిళసినిమా: నాలుగుపదుల వయస్సులోనూ త్రిషకు అవకాశాలు వెల్లవెత్తుతున్నాయి. పొన్నియిన్ సెల్వన్ చిత్రానికి ముందు అపజయాలతో కొట్టుమిట్టాడుతున్న ఈ చెన్నై సుందరికి మణిరత్నం పొన్నియిన్ సెల్వన్ చిత్రంతో బిగ్ బ్రేక్ ఇచ్చారు. దీనిని రెండు భాగాలుగా త్రిష అందాలను మెరుగుపరచడమే కాకుండా ఆమెలోని అద్భుతమైన అభినయాన్ని బయటకు తీశారు. ఆ చిత్రంలోని ఘటనకు ప్రశంసల వర్షం కురిపించుకున్న త్రిష ఆ తరువాత అవకాశాల జోరులో మునిగితేలుతున్నారు. ప్రస్తుతం విజయ్ సరసన లియో చిత్రంలో నటించిన ఈ బ్యూటీ తదుపరి అజిత్ కథానాయకుడిగా నటించనున్న విడాముయిర్చి చిత్రంలో నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో పాటు సుదీర్ఘ విరామం తరువాత తెలుగులో చిరంజీవితో జతకట్టే అవకాశం వరించింది. మరికొన్ని నూతన అవకాశాలు ఈ అమ్మడి కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో త్రిషకు దర్శకుడు మణిరత్నం నుంచి మరో అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన మెద్రాస్ టాకీస్ పతాకంపై చిత్రాలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా తాజాగా ఆయన నిర్మించే చిత్రంలో త్రిషను కథానాయకిగా ఎంపిక చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

‘బుల్లెట్’కు శ్రీకారం

తమిళసినిమా: రాఘవ లారెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈయన సాధారణ గ్రూప్ డాన్సర్‌గా సినీ జీవితాన్ని ప్రారంభించి నృత్య దర్శకుడుగా, కథానాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఎదిగారు. కాగా ఇప్పుడు ఆయన తమ్ముడు ఎల్విన్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. ఇంతకు ముందు లారెన్స్ కథానాయకుడిగా ఫైవ్ స్టార్ క్రియేషన్స్ పతాకంపై కదిరేశన్ స్వీయ దర్శకత్వంలో రుద్రన్ చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం కమర్షియల్‌గా సక్సెస్ అయ్యింది. కాగా ఇదే జానర్లో తాజాగా ఆయన లారెన్స్ సోదరుడు ఎల్విన్‌ను హీరోగా పరిచయం చేస్తూ బుల్లెట్ అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో లారెన్స్ ముఖ్యపాత్రను పోషించనున్నారు. తెలుగు నటి వైష్ణవి రాజ్ ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌లో నాయకిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రానికి పాండియన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు ఇదే బ్యానర్‌లో డైరీ అనే సక్సెస్ పుల్ చిత్రానికి దర్శకత్వం వహించారన్నది గమనార్హం. కాగా బుల్లెట్ చిత్రం శనివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది పూర్తిగా యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. దీనిని తాను తన తొలి చిత్రంగా తెరకెక్కించాలని భావించారని, అయితే కొన్ని కారణాల వల్ల అలా జరగలేదని, ఇప్పుడు రెండవ చిత్రంగా రూపొందడం సంతోషంగా ఉందన్నారు. తనను కంటిన్యూగా ఆదరిస్తున్న నిర్మాత కదిరేశన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్ర షూటింగ్‌ను చెన్నై, తెన్‌కాశి, హైదరాబాద్ ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి శ్యామ్, సీఎస్ సంగీతాన్ని, అరవింద్ సింగ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.


పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన బుల్లెట్ చిత్రం

క్లుప్తంగా

మంత్రవాది హత్య



మంత్రవాది సికిందర్

తిరువొత్తియూరు: చెన్నై తిరుమంగళం సమీపంలో ఇంటిలో ఒంటరిగా ఉన్న మంత్రవాదిని హత్య చేసిన కేసులో ఇద్దరు కోర్టులో సరెండర్ అయ్యారు. చెన్నై తిరుమంగళం సమీపంలోని పాడికుప్పం గాంధీనగర్‌లో సయ్యద్ సికిందర్ (38) భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. ఇతను మంత్రవాదిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం సికిందర్ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగు పొరుగువారు అనుమానంతో లోపలికి వెళ్లి చూశారు. అతను తలకు బలమైన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. వెంటనే వారు తిరుమంగళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై విచారణ చేపట్టారు. విచారణలో విక్కి, పురుషోత్తమన్ ఇద్దరు మంత్రవాదిని హత్యచేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో వారు శనివారం మదురవాయిల్ కోర్టులో సరండర్ అయ్యారు. వారిని పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

వేలూరు: విద్యార్థినిని లైంగికంగా వేధించిన వేలూరు తొర్రపాడికి చెందిన మూర్‌బాగర్ అలీ(53) అనే ట్యూషన్ మాస్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మూర్‌బాగర్ అలీ అదే ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా ట్యూషన్ నడుపుతున్నాడు. గత సంవత్సరం ట్యూషన్ నడపడం నిలిపి వేసి కాట్పాడిలోని ఒక దుకాణంలో పనిలో చేరాడు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం మళ్లీ ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించాడు. ఈ నెల ఒకటవ తేదీన ట్యూషన్‌లోని ఒక విద్యార్థినిని మూర్ బాగర్ అలీ లైంగికంగా వేధించాడు. ఆ విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు వేలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

యువతి స్నానం చేయడాన్ని వీడియో తీసిన వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: కోవైలో యువతి స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోవై అన్ననూర్ పోలీసులు స్టేషన్ పరిధికి చెందిన యువతి(24) ఇంటిలో స్నానం చేస్తోంది. ఆ సమయంలో ఒక యువకుడు కిటికీ గుండా సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీన్ని గమనించిన యువతి కేకలు వేసింది. ఇరుగు పొరుగు వారు రావడంతో యువకుడు పారిపోయాడు. యువతి ఫిర్యాదు మేరకు అన్ననూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వీడియో తీసిన వ్యక్తి గోకుల్ కృష్ణ అని తెలిసింది. పోలీసులకు భయపడి అతను సెల్ ఫోన్‌లో ఉన్న వీడియోను డిలీట్ చేశాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకటిన్నర టన్నుల బీడీ ఆకులు స్వాధీనం

తిరువొత్తియూరు: తూత్తుకుడి హార్బర్ నుంచి శ్రీలంకకు తరలించేందుకు ప్రయత్నించిన ఒకటిన్నర టన్నుల బీడీ ఆకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూత్తుకుడి క్యూ బ్రాంచ్ పోలీసులు కొత్త హార్బర్ తీరంలో శనివారం ఉదయం గస్తీ చేపట్టారు. ఆ సమయంలో ఈనిగో నగర్ బీచ్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా నిలబడి ఉన్న మినీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. అందులో బీడీ ఆకుల బస్తాలు వున్నాయి. వాటిని శ్రీలంకకు తరలించేందుకు తీసుకువచ్చినట్టు తేలింది. 40 బస్తాల్లో ఉన్న ఒకటిన్నర టన్నుల బీడీ ఆకులను స్వాధీనం చేసుకుని, పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

మహిళా పోలీస్ ఇంటిలో నగలు చోరీ

తిరువొత్తియూరు: సెయింట్ థామస్ మౌంట్‌లో సాయుధ దళం పోలీసు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న మహిళా పోలీస్ ఓంశక్తి ఇంటిలో నగలు చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఓంశక్తి చెన్నై సమీపం ఆలందూర్‌లో ఉన్న సెయింట్ థామస్ మౌంట్ సాయిధ దళం పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ శాస్త్రినగర్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్నారు. ఈమె ఇంటిలో 2వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు నగలను చోరీ చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చెల్లప్ప నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు (42)ను అరెస్టు చేశారు.

ఖరీదైన మోటార్ సైకిల్ చోరీ

తిరువొత్తియూరు: పగటి సమయంలో మెకానిక్ పనిచేస్తూ రాత్రి సమయంలో ఖరీదైన మోటార్ సైకిళ్లను చోరీచేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై పోరూరుకు చెందిన రమేష్ (21) ఇంటి వద్ద నిలిపిన ఖరీదైన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు 15 రోజుల్లో ఆ ప్రాంతంలో ఉన్న 100కు పైగా సీసీ పుటేజీని పరిశీలించారు. చిన్న పోరూర్, భజన ఆలయ వీధికి చెందిన విఘ్నేశ్వరన్ అలియాస్ విక్కీ (22)ని అరెస్టు చేశారు. అతను పగటి సమయంలో మెకానిక్‌గా పనిచేస్తూ రాత్రి సమయంలో ఇళ్ల ముందు నిలిపించిన ఖరీదైన మోటార్ సైకిళ్లను చోరీ చేస్తున్నట్టు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి, అతని నుంచి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

తిరువొత్తియూరు: దిండుకల్లు జిల్లాలో నకిలీ మహిళా డాక్టర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అరెస్టు చేసి ఆసుపత్రిని సీజ్ చేశారు. ఒక మహిళ వైద్య కోర్సు చదవకుండానే దిండుకల్లు గోపాల్‌పట్టిలో క్లినిక్ నిర్వహిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అధికారులు శనివారం తనిఖీ చేయగా ఒక మహిళ రోగులకు వైద్యం చేస్తున్నారు. విచారణలో ఆమె పేరు కళావతి (47) అని, కేరళకు చెందిన వారని, మెడికల్ కోర్సు చదవకుండానే వైద్యం చేస్తున్నట్టు తెలిసింది. సానార్‌పట్టి పోలీసులు ఆమెను అరెస్టు చేసి క్లినిక్‌ను సీజ్ చేశారు.

పద్యకవితకి పట్టుగొమ్మ రంగాజమ్మ

- ప్రముఖ కవి కాసల నాగభూషణం వ్యాఖ్య

కొరుక్కుపేట: తెలుగు సాహిత్య చరిత్రలో నాయక రాజుల యుగంలో రసవంతమైన పద్యకవితకి పట్టుగొమ్మగా కవయిత్రి రంగాజమ్మ నిలిచారని ప్రముఖ కవి, విమర్శకులు కాసల నాగభూషణం కొనియాడారు. పెరంబూర్‌లోని డీఆర్ బీసీసీసీ మహోన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం పెరంబూర్ తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో అనన్య సామాన్య ధారావాహిక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమంలో 100వ ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రంగాజమ్మ రసరమ్య ప్రణయ కావ్యం ఉషా పరిణయం అనే అంశంపై చర్చ చేపట్టారు. పెరంబూరు తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు తమ్మినేని బాబు మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్యానికి సేవ చేసే తలంపుతో అనన్య సామాన్య ధారావాహిక ఉపన్యాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అది ప్రస్తుతం 100వ ఉపన్యాస సభ చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాసల నాగభూషణం మాట్లాడుతూ తంజావూరు రాజధానిగా తమిళ ప్రాంతాన్ని పరిపాలించిన విజయరాఘవ నాయకుడు స్వయంగా కవి, నాట్యకళా కోవిదుడు అని, ఆయన ఆస్థానంలోని కవయిత్రి రంగాజమ్మ అత్యంత ప్రతిభావంతురాలు అని చెప్పారు. ఆమె విజయ రాఘవుని చరిత్రని మన్నారుదాస విలాసం పేరిట ద్విపద కావ్యం, యక్షగానం రచించారని తెలిపారు. హరి వంశం, భాగవతాది గ్రంథాల్లో ఉన్న ఉషా అనిరుద్ధుల కథ ఆధారంగా రచించిన ఉషా పరిణయం ప్రబంధం ప్రస్తుతం లభిస్తున్నాయన్నారు. కవితా ప్రియుడైన విజయ రాఘవుడు ఆమెను ధర్మపత్నిగా స్వీకరించి కనకాభిషేకం చేశాడన్నారు. తంజావూరు సాహితీ భవనం మీద పతాకలో రంగాజమ్మ పేరు ఇప్పటికీ రెపరెపలాడుతూ ఉండడం ఆమె రస కవితా కీర్తికి నిదర్శనమని కొనియాడారు. టీఆర్ఎస్ శర్మ, తమ్మినేని బాబు సేవలను చక్కగా ఒక పద్య రూపంలో ప్రశంసించారు. వక్తను సమితి సెక్రెటరీ టిఆర్ఎస్ శర్మ పరిచయం చేయగా, అరుణా శ్రీనాథ్ ప్రార్థన గీతం ఆలపించారు. ఇటీవల మృతి చెందిన మురళికి రెండు నిముషాల మౌనం పాటించారు. వసుంధర దేవి విస్తాలి శంకర రావు, వంజరపు శివయ్య, కిడాంబి లక్ష్మి కాంత్, సరోజ శర్మ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కాసల నాగభూషణంను సత్కరిస్తున్న తమ్మినేని బాబు, టీఆర్ఎస్ శర్మ తదితరులు

మనిషిని పరిపూర్ణంగా తీర్చిదిద్దేది విద్యే

తమిళసినిమా: నటుడు శివకుమార్ తన పేరుతో ప్రారంభించిన విద్యా ట్రస్ట్ ద్వారా 43 ఏళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా ప్లస్- 2లో అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిక చేసి నగదు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా 44వ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం స్థానిక సాలి గ్రామంలోని ప్రసాద్ ల్యాబ్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ ఆయన కుమారులు, హీరోలు సూర్య, కార్తి పాల్గొన్నారు. వేదికపై 25 మంది విద్యార్థులకు తలా రూ.10 వేలు చొప్పున రూ.2.50 లక్షల నగదు కానుకను అందించారు. అదేవిధంగా పేద విద్యార్థుల కోసం దుండిగల్ విద్యాభివద్ధి బృందం నిర్వహిస్తున్న తాయి తమిళ్ పాఠశాలలకు ఆది సాయం అందించారు. సీనియర్ చిత్ర కళాకారుడు జయరాజ్ సేవా నిరతికి గానూ రూ.లక్ష అందించారు. మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించారు. ఈ వేదికపై నటుడు శివకుమార్ మాట్లాడుతూ తాను 1979లో శివకుమార్ విద్యా ట్రస్టును ప్రారంభించి ప్లస్-2 పరీక్షల్లో అత్యధిక మార్కులను తెచ్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించటం ప్రారంభించానన్నారు. ప్రస్తుతం ఈ బాధ్యతలను సూర్య ఏర్పాటు చేసిన అగరం ఫౌండేషన్ చేపట్టి సమర్థంగా నిర్వహిస్తోందన్నారు. ఉళవన్ ఫౌండేషన్ నిర్వాహకుడు ,నటుడు కార్తీక్ మాట్లాడుతూ ఒక మనిషిని పరిపూర్ణంగా తీర్చి దిద్దడమే విద్య లక్ష్యం అని పేర్కొన్నారు. నటుడు సూర్య మాట్లాడుతూ అగరం ఫౌండేషన్ విద్యాభివృద్ధికి 43 ఏళ్ల క్రితమే శివకుమార్ విద్యా ట్రస్టు గొప్ప పునాదులు వేసిందన్నారు.



విద్యార్థులతో నటులు శివకుమార్, సూర్య, కార్తీ

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

వేలూరు: కాట్పాడి నియోజకవర్గంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ కదీర్ ఆనంద్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడి సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.85.59 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆదివారం సహకార సంఘం అధ్యక్షుడు జయరామన్, కార్యదర్శి మనోహరన్ అధ్యక్షత వహించగా ఎంపీ కదీర్ ఆనంద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్పాడిలో ఈ షాపింగ్ కాంప్లెక్స్‌తో ఒకే చోట అవసరమైన అన్ని వస్తువులు లభిస్తాయని తెలిపారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కార్పొరేటర్ పరమశివం, సహకార సంఘం డైరెక్టర్లు కేఎస్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీ కదీర్ ఆనంద్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వేలూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కార్పొరేషన్ మొదటి జోన్ చైర్మన్ పుష్పలత తెలిపారు. ఆమె అధ్యక్షతన ఆదివారం కాట్పాడి ప్రభుత్వ బాలుర పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం, విద్యాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వృక్షాలను నరికేయడంతో సరైన సమయంలో వర్షాలు కురవడం లేదన్నారు. దీంతో కరువు ఏర్పడి మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందని వాపోయారు. ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచి మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారికి ఇరు వైపులా మొక్కలు నాటుతున్నారని, అదే విధంగా ప్రతి పాఠశాల ఆవరణలోను మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతీశ్వరన్, ఎన్‌సీసీ అధికారి రాజ, ఒకేషనల్ టీచర్ శివజ్ఞానం, పాఠశాల భవన నిర్మాణ చైర్మన్ అన్బు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పుష్పలత

డ్రీమ్ రన్నర్స్ హాఫ్ మారథాన్ విజేతలకు బహుమతులు

కొరుక్కుపేట: చెన్నైలోని బీసెంట్ నగర్ వేదికగా ఆదివారం నిర్వహించిన 12వ ఎడిషన్ హెక్సావేర్ డ్రీమ్ రన్నర్స్ హాఫ్ మారథాన్ -2023 అనూహ్య స్పందన లభించింది. తమిళనాడు, కర్ణాటక, కేరళ మ తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 6,500 మంది రన్నర్లు పాల్గొని మారథాన్‌ని విజయవంతం చేశారు. 21.1 కి.మీ మారథాన్‌ను హైటెక్ అండ్ ప్రొఫెషనల్ సర్వీసెస్, జనరల్ అట్ ప్రాక్టీస్, కన్సల్టింగ్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్ అరుణ్ రామచంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయనతో పాటు మరికొందరు అతిథులు పాల్గొన్నారు. మారథాన్‌లో 21.1 కి.మీ.లో 2400 మంది, 10 కి.మీ కేటగిరీల్లో 4000 మంది రన్నర్లు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు నిర్వాహకులు ప్రదానం చేశారు.



మారథాన్ విజేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొరుక్కుపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చెన్నై జెమిని ప్రెసిడెంట్ రుక్మిణి దేవి తెలిపారు. ఇన్నర్ వీల్ క్లబ్ తరపున విద్యార్థులు, పాఠశాలల నుంచి పాత పేపర్లు, పుస్తకాలు, ఇతర వస్తువులను సేకరించి ఐటీసీ సంస్థకు అప్పగించి, వారి నుంచి విద్యా సామగ్రి, నోటు పుస్తకాలు సేకరించి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చెన్నై కేటీసీటీ పాఠశాలలో విద్యార్థినుల నుంచి పాత పేపర్లు, నోటు పుస్తకాలు తీసుకుని కొత్త నోటు పుస్తకాలు అందజేశారు.



పాత పేపర్లు తీసుకుని కొత్త నోటు పుస్తకాలు అందజేస్తున్న రుక్మిణి దేవి

ఉత్సాహంగా.. మారథాన్



తమిళ కళలు, సంస్కృతిని ప్రోత్సహించే విధంగా, గ్రామీణ ప్రజల సంక్షేమార్థం నిధుల సేకరణలో భాగంగా 3వ ఎడిషన్ తమిళ మారథాన్‌ను ఆదివారం ఉదయం 10 వేల మందితో ఐల్యాండ్ గ్రౌండ్స్ నుంచి నిర్వహించారు. మూడు, ఐదు, పది, నలభైరెండు కిలో మీటర్ల చొప్పున జరిగిన ఈ రన్‌ను గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మాజీ డైరెక్టర్ ఎస్ఎస్‌భాస్కర్, శాస్త్రవేత్త వి.ఆంటోని స్వామి, నిర్వాహకుడు హేమంత్ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన విద్యార్థులు విజేతలుగా నిలవడంతో సర్టిఫికెట్లతో సత్కరించారు. - సాక్షి, చెన్నై

చెన్నై చేరిన తమిళులు

కొరుక్కుపేట: అమర్‌నాథ్‌లో చిక్కుకున్న 17 మంది తమిళులు ఎట్టకేలకు చెన్నై చేరుకున్నారు. వారికి మంత్రి సెంజీ మస్తాన్, అధికారులు స్వాగతం పలికారు. తేని జిల్లాకు చెందిన శంకర్ మురుగానందం, ఆయన భార్య సావిత్రి సహా 17 మంది కొద్ది రోజుల క్రితం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. అక్కడ కొండచరియలు విరిగిపడటంతో శ్రీనగర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినింది. దీంతో వారు అక్కడే ఇరుక్కుపోయారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అమర్‌నాథ్‌లో చిక్కుకున్న తమిళులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారు ఈ నెల 13వ తేదీన వారిని న్యూఢిల్లీ చేర్చారు. రైలులో శనివారం రాత్రి చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ చేరుకున్నారు. వీరికి మంత్రి సెంజీ మస్తాన్, అధికారులు స్వాగతం పలికారు. ఆ తర్వాత 17 మందిని వారి స్వస్థలాలకు పంపించారు.

చెరుకు ట్రాక్టర్‌లో చిక్కుకుని కుమార్తె, తల్లి మృతి

అన్నానగర్: పల్లిపాళయం సమీపంలో శనివారం రాత్రి చెరుకు ట్రాక్టర్‌లో ఇరుక్కుని తల్లి, కుమార్తె మృతి చెందారు. నామక్కల్ జిల్లా పల్లిపాలెం సమీపంలో ఉన్న చిన్నరపాళయానికి చెందిన రాజవేలుకు భార్య తవమణి, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు ఇందుమతి చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం తవమణి, ఇందుమతి ఇరైయమంగలమ్‌కు వెళ్లారు. తిరిగి రాత్రి బైకులో ఇంటికి తిరిగి వస్తున్నారు. కొంబుమేడులో ముందు వెళ్తున్న చెరుకు ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా ఓ వాహనం వచ్చింది. దీంతో బైక్‌కు ట్రాక్టర్ వెనుక చక్రం తగిలింది. ఇందుమతి, తవమణి ట్రాక్టర్ చక్రంలో చిక్కుకుని శరీరం నుజ్జునుజ్జు అయి మృతి చెందారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

తిరువళ్లూరు: అనారోగ్యంతో బాధపడుతూ గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. తిరువళ్లూరు జిల్లా కన్నిగైపేర్‌లోని బస్టాండు వద్ద మహిళ(60) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు వీఏఓ నవీన్‌కు సమాచారం అందించారు. అతను 108 అంబులెన్స్ ద్వారా తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు ఈ నెల 11వ తేదీన తరలించారు. శనివారం పరిస్థితి విషమంగా మారడంతో చెన్నై వైద్యశాలకు తరలించేందుకు యత్నించారు. మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది. పెద్దపాళ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషం తాగి విద్యార్థిని ఆత్మహత్య

తిరువొత్తియూరు: రాసిపురం సమీపంలో పరీక్షలలో ఉత్తీర్ణత కాలేదని ఆవేదన చెంది ఓ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మురుంగపట్టికి చెందిన మోహన సుందరం కుమార్తె సుజిత (21). రాశిపురం తిరువల్లువర్ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. ఇటీవలి సెమిస్టర్ పరీక్షలు రాసింది. ఈ పరీక్షల్లో పాస్ కాలేదని తెలిసింది. దీంతో సుజిత శుక్రవారం రాత్రి సుజిత విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్థానికులు గుర్తించి రాసిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజిత శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్‌షాక్‌తో యువకుడి మృతి

తిరువళ్లూరు: మిక్సీ రిపేర్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పణయంజేరి గ్రామానికి చెందిన నర్మద(22)కు ఆదే ప్రాంతానికి చెందిన సెల్వం కుమారుడు కుప్పన్(23)తో గత ఏడాది వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి చట్నీ తయారు చేయడానికి నర్మద ప్రయత్నించిన సమయంలో హఠాత్తుగా మిక్సీ మరమ్మతుకు గురైంది. దీంతో భర్తను పిలిచి మిక్సీని సరి చేయాలని సూచించింది. ఈ క్రమంలోనే మిక్సీని రిపేర్ చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు ప్రైవేటు వాహనం ద్వారా పొన్నేరిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే కుప్పన్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య

అన్నానగర్: ప్రేమ విఫలం కావడంతో తిరుచ్చి మణికండం తీరన్ సిటీకి చెందిన సత్యశీలన్ కుమారుడు అజయ్ (26) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అజయ్ తిరుచ్చిలోని ఎన్ఐటీ కళాశాలలో ఎంటెక్ చదువుతున్నాడు. కొన్ని రోజులుగా ఒత్తిడికి లోనైన అతడు ఆదివారం ఉదయం బైకులో తిరువెరంబూర్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అక్కడ ద్విచక్ర వాహనాన్ని వదిలేసి తన స్నేహితుడికి వాయిస్ మెసేజ్ పంపాడు. అందులో 'నాకు నాకు బతకడం ఇష్టం లేదు, నా ఏటీఎం , పిన్ నంబర్, పాస్‌బుక్ బైకులో ఉంచాను. మా అమ్మానాన్నకు చెప్పు' అని ఉంది. తరువాత తిరుచిరాపల్లి నుంచి కారైకాల్ వెళ్తున్న రైలు ముందు రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో అజయ్ పంపిన మెసేజ్‌ను తల్లిదండ్రులకు స్నేహితుడు పంపాడు. దిగ్భ్రాంతి చెందిన సత్యశీలన్ తిరువెరంపూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అజయ్ ఆత్మహత్య చేసుకున్నాడని తేలింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో అజయ్ ఓ యువతిని ప్రేమించాడని, ప్రేమ విఫలమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని తేలింది.

డీఐజీ మృతి కేసులో 8 మందికి సమన్లు



విజయకుమార్

సాక్షి, చెన్నై: తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై బలవన్మరణానికి పాల్పడిన కోయంబత్తూరు రేంజ్ డీఐజీ విజయ కుమార్(45) మృతిపై 8 మందిని విచారించేందుకు పోలీసులు నిర్ణయించారు. కోయంబత్తూరు రామనాథ పురం స్టేషన్‌లో జరిగే ఈ విచారణకు హాజరుకావాలని వీరికి ఆదివారం సమన్లు అందాయ. వివరాలు.. కోయంబత్తూరు రేంజ్ డీఐజీగా ఈ ఏడాది జనవరిలో ఐపీఎస్ అధికారి విజయ కుమార్(45) పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈనెల 7వ తేదీన రేస్ కోర్సులోని క్యాంప్ కార్యాలయంలో ఆయన తన భద్రతా సిబ్బంది రవి వద్ద ఉన్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సమాచారం పోలీసు యంత్రాంగాన్ని కలవరంలో పడేసింది. ఈ ఘటనపై అనేక అనుమానాలు, ఆరోపణలు బయలు దేరాయి. అయితే ఆయన తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగా బలన్మరణానికి పాల్పడినట్టు విచారణలో తేలింది. అయితే, సామాజిక మాధ్యమాల వేదికగా కొందరు, ప్రత్యక్షంగా మరికొందరు ఈ వ్యవహారంపై అనుమానాలు, ఆరోపణలు గుప్పించారు. ఈ పరిస్థితులలో కేసును విచారిస్తున్న కోయంబత్తూరు రామనాథపురం పోలీసులు అనుమానాలు, ఆరోపణలు గుప్పించిన వారిని విచారించేందుకు సిద్ధమయ్యాయి. తొలి విడతగా ఎనిమిది మందికి సమన్లు జారీ చేశారు. వీరు మంగళవారం తగిన ఆధారాలతో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు.

రాష్ట్రంలోకి 'జనం'



ప్రముఖ మలయాళ ఛానల్ 'జనం' తమిళనాడులోకి ప్రవేశించింది. వెబ్‌సైట్, యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, డిజిటల్ బ్రాడ్ కాస్టింగ్, తమిళ ఛానల్స్ ప్రత్యక్ష ప్రసారాలకు శ్రీకారం చుట్టింది. చెన్నైలో జరిగిన వేడుకలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, హిందూ మున్నని నేత సి. సుబ్రమణ్యం, శక్తి మసాల గ్రూప్ ప్రమోటర్లు పీసీ దురైస్వామి, శాంతి , అన్నాడీఎంకే నేత వైగై సెల్వన్, పద్మశ్రీ సిర్గాలి శివచిదంబరంతో పాటు నిర్వాహకులు రమేష్ ప్రభ, కృష్ణకుమార్, మధు తదితరులు జనం తమిళ లోగోను ఆవిష్కరించారు. - సాక్షి, చెన్నై

తాగునీరు ఇవ్వాలని గ్రామస్తుల రాస్తారోకో



తిరుత్తణి - షోళింగర్ రోడ్డులో రాస్తారోకో చేస్తున్న అగూరు గ్రామస్తులు

తిరుత్తణి: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేసారు. తిరుత్తణి సమీపం అగూరు దళితవాడలో పది రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నెలకొంది. మహిళలు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి సరఫరా చేయాలని పంచాయతీ నిర్వాహకులను కోరినా పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహం చెందిన మహిళలు ఆదివారం ఉదయం తిరుత్తణి - షోళింగర్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. వాహనాలు రాకపోకలు స్తంభించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణులకు తాగునీరు సరఫరా చేస్తున్న నందినదిలో వరద ప్రవాహంతో బోరువెల్ మునగడంతో సమస్య ఏర్పడిందని తెలిపారు. వేరొక ప్రాంతంలో బోరువేసి నీటిని సరఫరా చేయడానికి రైతులు అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించే వరకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

కువైట్ వెళ్లే విమానంలో సాంకేతిక లోపం

– సిబ్బంది తీరుపై ప్రయాణికుల ఆగ్రహం

సాక్షి, చెన్నై: చెన్నై నుంచి కువైట్‌కు బయలు దేరాల్సిన ఓ విమానం సాంకేతిక కారణాలతో రన్‌వేపై ఆగింది. కొన్ని గంటలైనా విమానం టేకాఫ్ తీసుకోక పోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం వేకువ జామున 2.30 గంటలకు చెన్నై నుంచి కువైటకు జజీరా ఎయిర్ లైన్స్ విమానం టేకాఫ్ తీసుకోవాల్సి ఉంది. 150 మంది ప్రయాణికులతో టేకాఫ్‌కు సిద్ధమైన వేళ రన్‌వే వద్ద విమానం ఆగింది. ఆతర్వాత విమానాన్ని పార్కింగ్ ప్రదేశానికి తీసుకొచ్చి మరమ్మతులపై దృష్టి పెట్టారు. కొన్ని గంటలైనా సరైన సమాధానం లేకపోవడంతో ప్రయాణికులలో ఆగ్రహం పెల్లుబికింది. చివరకు ప్రయాణికులను విమానం నుంచి కిందకు దించేసి వెయింటింగ్ హాల్స్‌కు పంపించారు. మధ్యాహ్నం 12 గంటలైనా విమానం బయలుదేరక పోవడంతో ప్రయాణికులు సిబ్బందిపై విరుచుకు పడ్డారు. చెన్నై విమానాశ్రయ అధికారులు ప్రయాణికులను బుజ్జగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంచుతున్న జెట్

కొరుక్కుపేట: ఆధ్యాత్మిక విషయాలపై వివిధ పోటీలు నిర్వహిస్తూ జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)– చెన్నై విభాగం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అతిథులు, వక్తలు కొనియాడారు.. స్థానిక అశోక్ నగర్‌లో జీఆర్‌టీ మహాలక్ష్మీ పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన రెండు రోజుల వార్షిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. రామాయణంలోని కిష్కింధకాండ క్విజ్, అలాగే పలు శ్లోకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి జెట్ చెన్నై విభాగం అధ్యక్షుడు రవీంద్రకుమార్ రెడ్డి నేతృత్వంలో ప్రముఖ ప్రవచనకర్త శ్రీనివాస్ బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో గత 28 ఏళ్లుగా ఇలాంటి ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించి చిన్నారుల్లో దైవచింతన పెంపొందిస్తున్నట్లు రవీంద్రకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శని, ఆదివారం జరిగిన పోటీలకు శ్రీ సిటీ అధినేత రవి సన్నారెడ్డి, వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ స్పాన్సర్లుగా వ్యవహరించారని, అదే విధంగా జెట్ నిర్వాహకులు, ఇతర దాతల సహకరిస్తున్నారని తెలిపారు.



విజేతలతో జెట్ - చెన్నై నిర్వాహకులు

పేదరిక నిర్మూలన దినంగా కెప్టెన్ పుట్టినరోజు వేడుకలు

తిరుత్తణి: ఆగస్టు 25న కెప్టెన్ విజయకాంత్ పుట్టిన రోజును పేదరికం నిర్మూలన దినంగా నిర్వహించి పేదలకు పెద్దఎత్తున సహాయకాలు పంపిణీ చేయాలని డీఎండీకే జిల్లా నిర్వాహకుల సమావేశంతో తీర్మానించారు. తిరువళ్లూరు వెస్ట్ డీఎండీకే జిల్లా నూతన కార్యకర్తల పరిచయ సమావేశం ఆదివారం తిరుత్తణిలోని విజయ మహల్‌లో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిగా రెండవ సారి ఎంపికైన కృష్ణమూర్తికి కార్యకర్తలు తమ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా వివిధ పోస్టులకు ఎంపికైన శ్రేణులను సైతం సత్కరించారు. లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీని పటిష్టం చేసి సత్తా చాటేందుకు కార్యకర్తలు కృషి చేయాలని తీర్మానించారు. పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, మండల కార్యదర్శి సురేష్‌బాబు,శ్రీఖర్, జనరల్ బాడీ సభ్యుడు వెంకటేశులు నాయుడు సహా అనేక మంది పాల్గొన్నారు.



డీఎండీకే కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

జోరుగా కార్ల ర్యాలీ

కొరుక్కుపేట: డచెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 23వ ఇండియన్ ఆయిల్ డచెస్ ట్రెజర్ హంట్ కార్ల ర్యాలీ -2023 ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగింది. ఈ ర్యాలీలో మొత్తం 115 కార్లు పాల్గొనగా పలువురు సెలెబ్రెటీలతో కలసి డచెస్ క్లబ్ నిర్వాహకురాలు నీనారెడ్డి జెండా ఊపి కారు ర్యాలీని ప్రారంభించారు. కుటుంబ సమేతంగా మహిళలు పాల్గొన్న ఈ ర్యాలీ సవేరా నుంచి 50 కిలో మీటర్ల దూరం సాగింది. ఆద్యంతం కారు ర్యాలీ కొత్త అనుభూతులను నింపిందని నిర్వాహకులు తెలిపారు.



కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నీనారెడ్డి

క్లుప్తంగా...

స్టార్టప్స్‌కు ప్రోత్సాహం

- ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, వాద్వానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు వాద్వానీ ఫౌండేషన్‌తో కలిసి ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ 14 వారాల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. స్టార్టప్స్‌కు తగిన మార్గనిర్దేశం చేసేందుకు 'వెన్ లిఫ్ట్‌ఆఫ్' పేరుతో యాక్సలరేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో టి.అనిల్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఇందులో ఎంపికైన వారి ఆలోచనను పూర్తిస్థాయి వాణిజ్యపరంగా మార్చడానికి అవసరమైన మెంటర్, రియల్‌టైమ్ ఫండింగ్, పారిశ్రామికవేత్తలతో అనుసంధానం తదితర అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. దీన్ని పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో https://entrepreneur.-wfglobal.orgలో దరఖాస్తు చేయాలని సూచించారు. ఈనెల 25 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఎంపికైన స్టార్టప్స్‌కు వచ్చే నెల 3 నుంచి శిక్షణ మొదలుపెడతామని అనిల్ చెప్పారు. ఎంపికైన స్టార్టప్స్ విశాఖ, కాకినాడ, విజయవాడ, తిరుపతిలో ఉన్న ఇంక్యుబేషన్ స్పేస్‌లలో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అన్ని జిల్లాల మలేరియా అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా అనుమానిత లక్షణాలున్న 35,22,451 మందికి పరీక్షలు చేయగా, 1,630 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని, బాధితులకు ఉచిత వైద్యం అందించామని వివరించారు. మరో 40,194 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా, 2,329 మందికి వ్యాధి సోకినట్టు గుర్తించామన్నారు. రాష్ట్రంలోని 54 ప్రభుత్వాస్పత్రులను సెంటినల్ సర్విలెన్స్ ఆస్పత్రులుగా గుర్తించి, అక్కడ డెంగీ నిర్ధారణ పరీక్షలతోపాటు బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డెంగీ, మలేరియా అనుమానితులకు గ్రామ స్థాయిలోనే ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఆర్‌డీటీ కిట్స్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు.

ఉలవపాడు మామిడికి ఆ దేశాలు ఫిదా

న్యూయార్క్, కెనడా దేశాలకు ఎగుమతి

- బంగినపల్లి రకానికి క్రేజ్
- ఇక్కడ కేజీ రూ.120.. అక్కడ రూ.500


కవర్లు కట్టిన నాణ్యమైన కాయలు

ఉలవపాడు: ఉలవపాడు మామిడికి విదేశాల్లోనూ మంచి పేరుంది. జాతీయ రహదారిపై ఒంగోలు–కావలి పట్టణాలకు మధ్య గల ఉలవపాడు గ్రామంలో బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, బెంగళూరు, నీలం, కొబ్బరి మామిడి, పునాస్, హిమామ్ పసంద్ మామిడి రకాలు సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే బంగినపల్లి రకం ఈ ఏడాది అమెరికాలోని న్యూయార్క్ నగరం, కెనడా దేశానికి సైతం ఎగుమతి అయ్యింది. మండలంలో మామిడి చివరి దశలో ఉన్న సమయంలో విదేశాలకు ఎగుమతులు జరిగాయి. ఈ ఏడాది ఉలవపాడులోని రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ విదేశీ కంపెనీలతో సమావేశమై ఎగుమతులకు అనుమతులు సాధించారు. నాణ్యమైన కాయలను అమెరికా, కెనడా దేశాలకు ఎగుమతులు చేశారు. బెంగళూరులోని ఇన్నోవా ప్యాక్ హౌస్ ద్వారా అమెరికాలోని న్యూయార్క్ నగరానికి, విజయవాడలోని బీ ఫ్రెష్ ప్యాక్ హౌస్ నుంచి కెనడాకు ఎగుమతులు చేశారు. న్యూయార్క్‌కు 1,269 కిలోలు, కెనడాకు 2,538 కిలోలు ఎగుమతి అయ్యాయి. న్యూయార్క్‌కు ఒకసారి, కెనడాకు రెండుసార్లు ఎగుమతి చేశారు.

కేజీ రూ.500 చొప్పున..

విదేశాలకు ఉలవపాడు నుంచి కవర్లు కట్టకుండా నాణ్యత గల కాయలు కేజీ రూ.85కు ఎగుమతులు చేయగా.. కవర్లు కట్టిన కాయలు కేజీ రూ.120 చొప్పున ఎగుమతి చేశారు. విమాన ఎగుమతి, రేడియేషన్ చార్జీలతో కలిపి కేజీ 6 డాలర్లు (రూ.500)గా విక్రయించారు. ఈ కాయల రుచి అద్భుతంగా ఉందని విదేశీయుల నుంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది.

నాణ్యత గల కాయల్ని పంపించాం



ఉలవపాడు నుంచి కవర్లు కట్టిన నాణ్యమైన కాయలను విదేశాలకు పంపించాం. మంచి నాణ్యత కలిగిన కాయలను ఎంపిక చేసి వారికి మెచ్చేలా చేసి పంపించాం. వచ్చే ఏడాది మరింత ముందుగా ఎగుమతి ప్రారంభించి అందరికీ అందేలా చూస్తాం.
– బాలచంద్ర, రైతు స్ఫూర్తి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్

కాయలు బాగున్నాయి



ఉలవపాడు బంగినపల్లి మామిడి కాయలు చాలా బాగున్నాయి. వచ్చే ఏడాది అధిక మొత్తంలో కాయలు దిగుమతి చేసుకుంటాం.
– మిథున్, వ్యాపారి, న్యూయార్క్

రుచి అద్భుతం



మామిడి కాయల రుచి అద్భుతంగా ఉంది. న్యూయార్క్‌లో కూడా ఉలవపాడు బంగినపల్లిని ఇష్టపడుతున్నారు. ఒక బాక్స్‌లో 10 కాయలు ఉంటాయి. ఆ బాక్స్‌ను 24 డాలర్లకు (రూ.1,970) కొన్నాను.
– గౌతమ్, కొనుగోలుదారు, న్యూయార్క్

ఓటర్ల జాబితాపై జాగ్రత్త

- మరో 9 నెలల్లో ఎన్నికలు.. ప్రతి రోజూ కీలకమే.. ఏమరుపాటు వద్దు: సజ్జల
- దొంగ ఓట్ల తొలగింపు, అర్హులను చేర్చడంలో పార్టీ యంత్రాంగం చురుగ్గా ఉండాలి
- అసైన్డ్, చుక్కల భూములపై ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వలంటీర్లపై విపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈనెల 21వతేదీ నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో పార్టీ యంత్రాంగం క్రియాశీలకంగా వ్యవహరించేలా శాసనసభ్యులు, కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పరిశీలకులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ 175కి 175 స్థానాలను ఖాయంగా గెలుచుకునే వాతావరణం ఉందన్నారు. దొంగ ఓట్ల తొలగింపుతోపాటు అర్హులను ఓటర్లుగా చేర్చేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. 2014 – 19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బోగస్, సెకండ్ ఓట్లను చేర్చి వారికి అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేసిందన్నారు. బూత్ స్థాయిలో బోగస్ ఓట్లను గుర్తించి ఎన్నికల కమిషన్ దృష్టికి తేవాలన్నారు. పార్టీ బూత్ కమిటీల ఇన్ ఛార్జులు, గృహ సారథులతో దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని సూచించారు. తరచూ ముందస్తు ఎన్నికలనే ప్రచారాన్ని తెరపైకి తెస్తూ క్యాడర్‌ను కాపాడుకునేందుకు టీడీపీ ఆపసోపాలు పడుతోందని వ్యాఖ్యానించారు. శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ పరిశీలకులు, జేసీఎస్ కోఆర్డినేటర్లతో సజ్జల ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దీనికి సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సజ్జల ఏమన్నారంటే..

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..

దాదాపు 25 లక్షలకు పైగా అసైన్డ్ భూములు, 2 లక్షల ఎకరాల మేర చుక్కల భూములకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 1.87 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారు. దశాబ్దాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన దుస్థితికి సీఎం జగన్ పరిష్కారం చూపారు. ప్రభుత్వం తీసుకున్న ఇలాంటి మంచి నిర్ణయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. లబ్ధిదారులతో ఎక్కడికక్కడ కార్యక్రమాలను నిర్వహించాలి. రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న దేవాలయాల నిర్వహణను ధర్మకర్తలకే అప్పగించడం లాంటి నిర్ణయాలు తీసుకున్నాం.

సంధాన కర్తలుగా పార్టీ పరిశీలకులు..

పార్టీ పరిశీలకులుగా నియమితులైనవారు శాసనసభ్యులకు, పార్టీ కోఆర్డినేటర్లకు సంధానకర్తలుగా వ్యవహరించాలి. సీఎం జగన్ మాటల్లో చెప్పాలంటే ఆయా నియోజకవర్గాలలో పరిశీలకులు ఎక్కువ సమయం వెచ్చించాలి. స్థానిక నేతల మధ్య చిన్న చిన్న బేధాభిప్రాయాలుంటే సర్దుబాటు చేయాలి. అవసరమైతే పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ల దృష్టికి, కేంద్ర కార్యాలయం దృష్టికి తేవాలి. ప్రజల ఆశీస్సులను ఓట్లుగా మలుచుకుని ఫలితాలు సాధించేలా కృషి చేయాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం, ఏమరుపాటు పనికిరాదని గడప గడపకూ సమీక్షల్లో సీఎం జగన్ స్పష్టం చేసిన విషయాన్ని మరోసారి గుర్తు చేస్తున్నా.

నియోజకవర్గ స్థాయిలో..

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 70 శాతం పూర్తైంది. ప్రజలకు మన ప్రభుత్వం ఏం చేసిందో చెప్పగలిగాం. పార్టీని ప్రతి కుటుంబానికి చేరువ చేయగలిగాం. పేదలు, పెద్దలు, మహిళలు, శ్రామికులు, యువకులు, విద్యార్థులు, రైతులు అందరూ తిరిగి జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారు. విపక్షాల విషపూరిత ప్రచారాన్ని పార్టీ సోషల్ మీడియా ద్వారా విజయవంతంగా ఎదుర్కోగలుగుతున్నాం. ప్రతిపక్షాలు సొంత మీడియాతోపాటు సోషల్ మీడియా ద్వారా సీఎం జగన్, శాసన సభ్యులపై దుష్ప్రచారం చేస్తున్నాయి. విపక్ష నేతలు బూతులు తిడుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ప్రజాబలం లేని నేతలు కూడా బరితెగించి మాట్లాడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో సొంత టీమ్‌లను ఏర్పాటు చేసుకుని వీటిని సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా తిప్పికొట్టాలి. ప్రజలకు వాస్తవాలను తెలియచెప్పాలి. అవసరమైతే పార్టీ కేంద్ర కార్యాలయం సహకారం తీసుకోండి. మన పథకాలను వివరిస్తూ సీఎం జగన్ పాలన రాష్ట్రానికి ఎందుకు అవసరమనేది తెలియ చెప్పాలి.

వలంటీర్లలో ఆత్మస్థైర్యం పెంచాలి..

ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రిక లాంటి వలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అత్యంత బలంగా తయారైంది. ప్రజల ఆదరాభిమానాలు చూరగొంది. అలాంటి వ్యవస్థపై చంద్రబాబు, పవన్, పచ్చమీడియా ద్వేషం, అక్కసు పెంచుకుని విద్వేషపూరిత ప్రచారాన్ని చేస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి. వలంటీర్ల మనోస్థైర్యం దెబ్బతినకుండా వారి ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల సహకారంతో కార్యక్రమాలను నిర్వహించి ప్రతిపక్షాల విమర్శలను పటాపంచలు చేయాలి. నాడు జన్మభూమి కమిటీలు ప్రజలను ఎలా వేధించుకుతిన్నాయో గుర్తు చేస్తూ వలంటీర్ల నిస్వార్థ సేవల గురించి వివరించాలి.

తెలంగాణ

రాజుతో అంగరక్షకుడి సహగమనం

- సజీవ సమాధి చేసే అరుదైన ఆచారం
- జడ్చర్ల సమీపంలో వెలుగుచూసిన ఆధారం
- స్మారక ఆత్మాహుతి శిల గుర్తింపు


గొల్లత్తగుడి సమీపంలో గుర్తించిన ఆత్మాహుతి శిల

సాక్షి, హైదరాబాద్: సతీ సహగమనం గురించి అందరికీ తెలిసిందే. భర్త చితిపైనే భార్యను సజీవంగా దహనం చేసే దారుణ పద్ధతది. కానీ, రాజు చనిపోతే అంగరక్షకులను అతనితోపాటు సజీవ సమాధి చేసే మరో వికృత ఆచారం కొన్ని ప్రాంతాల్లో కొనసాగింది. స్వామి భక్తితో ఆత్మాహుతి చేసుకున్న అంగరక్షకుడు/ఆంతరంగిక సేవకుడి(లెంక) స్మృతిలో ఏర్పాటు చేసిన స్మారక ఆత్మాహుతి శిల ఇటీవల వెలుగుచూసింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ శివారు ఆల్వాన్‌పల్లిలో ఉన్న అతి పురాతన జైన దేవాలయం గొల్లత్తగుడి వెనక దీన్ని గుర్తించారు. అక్కడి శిథిల శైవమఠం గోళకీ ఆలయం పరిసరాల్లో ఆరు వీరగల్లు శిలలున్నాయి. వాటిల్లో ఒకటిగా ఉన్న ఈ శిలను కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, ముచ్చర్ల దినకర్‌లు పరిశీలించారు. దానిపై పరిశోధన చేసి, అది చనిపోయిన రాజుతోపాటు సజీవంగా సమాధి చేయించుకున్న అంగరక్షకుడు/ఆంతరంగిక సేవకుడిదిగా తేల్చారు. స్థానికంగా ఉన్న రాజు లేదా రాజు హోదాలో ఉన్న వ్యక్తి చనిపోయినప్పుడు అతని సేవకుడు కూడా ఆత్మార్పణ చేసుకోవటంతో తొలుత సేవకుడిని సమాధి చేసి, దాని మీద రాజు శవాన్ని సమాధి చేసినట్టు పేర్కొన్నారు. ఈ శిలమీద చనిపోయిన రాజు చిత్రం, దిగువ ఆ సేవకుడి చిత్రాన్ని చెక్కారు. వారు శివైక్యం చెందారనటానికి గుర్తులు చెక్కి ఉన్నాయి.

యుద్ధంలో చనిపోతే...

'శిల మీద లఘు శాసనం ఉంది. అది ఆ సేవకుడు, రాజుకు సంబంధించే ఉండి ఉంటుంది. అస్పష్టంగా ఉన్నందున చదవటం సాధ్యం కావటం లేదు'అని హరగోపాల్ పేర్కొన్నారు. ఇక్కడికి చేరువలోని గంగాపూర్ ప్రాంతంలో గతంలో చాలా యుద్ధాలు జరిగాయని, ఓ యుద్ధంలో స్థానిక రాజు/ ఆ స్థాయి వ్యక్తి చనిపోవటంతో అతని సేవకుడు కూడా సజీవ సమాధి ద్వారా ఆత్మార్పణ చేసుకుని ఉంటాడని, దానికి గుర్తుగా స్థానిక దేవాలయం వద్ద ఈ ఆత్మాహుతి శిలను ఏర్పాటు చేసి ఉంటారని ఆయన చెప్పారు. ఏడెనిమిది శతాబ్దాల్లో దీన్ని ఏర్పాటు చేసి ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు. ఏపీలోని గుంటూరు జిల్లా ఈపూర్‌లో గతంలో కాకతీయ రాణి రుద్రమ మరణంతో ప్రమేయమున్న ఇలాంటి శిల్పం లభించిందని, అది చెన్నై మ్యూజియంలో ఉందని, మరోటి త్రిపురాంతకంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో తొలిసారి వెలుగు చూసిన ఈ శిల్పానికి చరిత్రలో ప్రాధాన్యముంటుందన్నారు.

ఆపుకోలేక.. చెప్పుకోలేక..

పెద్దల్లో పెరుగుతున్న యూరినరీ సమస్యలు

- ప్రతి 10 మందిలో నలుగురు బాధితులు
- కన్న బిడ్డలకూ చెప్పుకోలేని దుస్థితి


కాకినాడ జీజీహెచ్‌లో యూరినల్ సమస్యకు చికిత్స పొందుతున్న బాధితులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సగటు మనిషి ఆయుర్దాయం నూరేళ్లుగా లెక్క కడుతూంటారు. ఇందులో సగం అంటే 50 ఏళ్లు వచ్చేసరికి సాధారణంగా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతూంటాయి. అలా వచ్చే కొన్ని సమస్యలను కంటికి రెప్పలా చూసుకునే కన్న పిల్లలకు కూడా చెప్పుకోలేక కొంతమంది లోలోపలే కుమిలిపోతున్నారు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన 60 నుంచి 70 శాతం మందిలో హఠాత్తుగా చుక్కలు చుక్కలుగా యూరిన్ (మూత్రం) రావడం సమస్యగా ఉంటోంది. దీనిని వైద్య పరిభాషలో 'స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్' అని పిలుస్తుంటారు. దీనికి వయోభారంతో వచ్చే కండరాల బలహీనత ప్రధాన కారణమని యూరాలజీ నిపుణులు చెబుతున్నారు. 50 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి 10 మందిలో ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు ఈ సమస్యతో బాధపడేవారని, ఇప్పుడు ఆ సంఖ్య ఐదు నుంచి ఆరు ఉంటోందని యూరాలజీ వైద్యులు అంటున్నారు. కొంతమంది ఈ సమస్యను ఎవ్వరికీ చెప్పలేక.. ముందు జాగ్రత్తలు తీసుకోలేక కేన్సర్ బారిన పడుతూ ప్రాణాల మీదకే తెచ్చుకుంటున్నారని అంటున్నారు.

మహిళల్లో అధికం

స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ పురుషుల్లో కంటే నాలుగు పదులు దాటిన మహిళల్లో ఎక్కువని ఇటీవల ఒక అధ్యయనంలో తేలింది. పెల్విక్ కండరాల బలహీనత, ఈస్ట్రోజన్ హార్మోన్ స్రావంలో లోపాలు లైంగిక సామర్థ్యాన్ని దెబ్బ తీసి కాపురాల్లో చిచ్చుపెడుతున్నాయి. అసాధారణ పరిస్థితుల్లో మూడు పదుల వయసు దాటిన వారిని కూడా ఈ సమస్య వెంటాడుతోంది. రుతుస్రావం నిలిచిపోయే పరిస్థితిలో ఏర్పడే పోస్ట్ మెనోపాజల్ దశలో స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్, వెజైనల్ డ్రైనెస్ సమస్యలు మొదలవుతాయి. అధిక కాన్పులు, శస్త్రచికిత్సలు, ప్రొస్టేట్ చికిత్స మహిళల్లో మూత్రం చుక్కలు చుక్కలుగా రావడానికి కారణమవుతున్నాయి. పురుషుల్లో మధుమేహం, శస్త్రచికిత్సలతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. తుమ్మినా, దగ్గినా తెలియకుండానే మూత్ర విసర్జన, వెజైనల్ సమస్యలు దీని లక్షణాలుగా చెబుతున్నారు.

మూత్రం చుక్కచుక్కలుగా పడుతున్న వారికి కాకినాడ జీజీహెచ్‌లో యూరాలజీ, వెజైనల్ డ్రైనెస్ సమస్యకు గైనకాలజీ ఓపీల్లో సేవలందిస్తున్నారు. గడచిన ఆరు నెలల వ్యవధిలో ఈ రెండు విభాగాల ఓపీకి ప్రతి నెలా వస్తున్న కేసులను పరిశీలిస్తే రోగుల సంఖ్య పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం వంటి ప్రాంతాల్లో కూడా యూరాలజీ వైద్యుల వద్ద అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్య పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్, వెజైనల్ డ్రైనెస్‌కు అధునాత వైద్య సదుపాయాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో అందుబాటులోకి తీసుకువచ్చామని స్థానిక సృజనా ఆస్పత్రి కాస్మెటిక్ గైనకాలజిస్టు డాక్టర్ ఏఎల్ సత్యవతి చెప్పారు. ముంబైకి చెందిన ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణురాలు సీజెల్ అజ్మీరా భాగస్వామ్యంతో ఈ సేవలు తీసుకువచ్చారు.

మానసిక సమస్యలు ఉత్పన్నం



స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ సహా, పెల్విక్ కండరాల బలహీనత, ఈస్ట్రోజన్ అసమతుల్యతలు మానసిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మహిళలు సంసార, సాధారణ జీవితాల్లో ఇబ్బందులు పడుతున్నారు. చెప్పుకోలేని వేదనతో సతమతమవుతూంటారు. తొలి దశలో నిర్వహించే కౌన్సెలింగ్‌లోనే ఈ సమస్యలను ధైర్యంగా వైద్య నిపుణుల వద్ద ప్రస్తావిస్తే తక్షణ పరిష్కారం ఉంటుంది.
– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, కాకినాడ

మందులు అవసరం లేని చికిత్స



అవాంఛిత మూత్రం కేసులు పెరుగుతున్నాయి. స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ సమస్యకు చెమట పట్టని వ్యాయామాలతో పెల్విక్ కండరాల పటిష్టత ద్వారా మందుల అవసరం లేని పరిష్కారం లభిస్తోంది. దీనికి అధునాతన బీటీఎస్ ఎంసెల్లా చైర్‌ను వినియోగిస్తాం. 28 నిమిషాల వ్యవధిలో 11 వేల పెల్విక్ వ్యాయామాలు చేయించడం ఈ యంత్రం ప్రత్యేకత. వీటిని కెగెల్స్ ఎక్సర్‌సైజ్‌లు అంటారు. వెజైనల్ డ్రైనెస్ నివారణకు వెజైనల్ రెజువనేషన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం. కుర్చీలో కూర్చోవడం ద్వారా నొప్పి లేని చికిత్స అందిస్తాం.
– డాక్టర్ ఏఎల్ సత్యవతి, కాస్మెటిక్ గైనకాలజీ నిపుణురాలు, కాకినాడ

ఆగితే తగ్గదు



మూత్రం లీకేజీ, వెజైనల్ డ్రైనెస్‌లు నానాటికీ అధికమవుతున్న సమస్యలు. ముఖ్యంగా పోస్ట్ మెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. తగ్గుతుందిలే అన్న ధీమా ఎంత మాత్రం సరికాదు. దీనివలన సమస్య తగ్గదు సరికదా, మానసిక సమస్యలు ఎక్కువై మానవ సంబంధాలు దెబ్బతింటాయి. ఇది శారీరక అనారోగ్యాలకూ దారి తీస్తుంది. తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి. ఈ ఇబ్బందిని చెప్పుకొనేందుకు చాలా మంది మహిళలు ముందుకు రాకపోవడమే అసలు సమస్య. మందులు అవసరం లేని అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. సత్ఫలితాలిస్తున్నాయి.
– డాక్టర్ మణికంఠన్ జంధ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ

బ్రహ్మాండం..కాణిపాకం బ్రహ్మోత్సవం

సత్యప్రమాణాల దేవుడు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సల ఏర్పాట్లకు దేవస్థానం రెండు నెలల ముందే శ్రీకారం చుట్టింది. లక్షలాదిగా తరలివచ్చే భక్తజనాన్ని దృష్టిలో ఉంచుకుని మహా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. సెప్టెంబర్ 18వ తేదీ వినాయక చవితి నుంచి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీటవేస్తు, ఉభయదారులు, ప్రజాప్రతినిధులు, వీఐపీలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి చిన్న పొరబాటు చోటు చేసుకోకుండా దర్శనం కల్పించేలా ముందస్తు ఏర్పాట్లను ప్రారంభించింది.


కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం

- సెప్టెంబర్ 18 నుంచి బ్రహ్మోత్సవాలు
- రెండు నెలల ముందు నుంచి ఏర్పాట్లుకు దేవస్థానం శ్రీకారం
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్యలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో స్వయంభుగా వెలిసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు రెండు నెలల ముందే తగు ఏర్పాట్లుకు నడుం బిగించారు. గతంలో కంటే ప్రస్తుతం వేలాదిగా భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివస్తున్నారు. నిత్యం భక్తులు 20 వేలకు పైగా విచ్చేస్తున్నారు. సెలవురోజుల్లో, పండుగ రోజుల్లో 50 వేలకు పైగా భక్తులు వస్తున్నారు. ఒక్కోసారి దర్శనానికి 6,7 గంటల సమయం కూడా పడుతోంది. బ్రహ్మోత్సల సమయంలో దర్శనం, ఉత్సవమూర్తుల ఊరేగింపు చూసేందుకు భక్తులు అశేషంగా తరలివస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులతో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తు పలు అంశాలను చర్చిస్తూ, ఏర్పాట్లకు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా

గతంలో బ్రహ్మోత్సవాలకు ముందు హడావుడిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేవారు. భక్తులకు ఈ సౌకర్యాలు సరిపోయేవి కావు. దీంతో ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రత్యేక క్యూలు, నిత్య అన్నప్రసాదం, లడ్డూ, పులిహోరా ప్రసాదాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి, వీఐపీలు, సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ దర్శనాలు, మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయంలో, ఊరేగింపులో స్వామివారిని దర్శించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చిస్తున్నారు.


భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

ఆలయంలో భక్తుల రద్దీ

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. స్వామివారి దర్శనార్థం ఉదయం నుంచి భక్తులు తరలి రావడంతో కంపార్ట్‌మెంట్‌లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు త్వరితగతిన దర్శనం చేసుకునేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.

భక్తులకు సంతృప్తి కలిగించేలా..

శ్రీవినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రాల నుంచి కూడా అశేషంగా తరలివస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరి కాకుండా రెండు నెలలకు ముందు నుంచే మహా ఏర్పాట్లకు శ్రీకారం చుట్టాం. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించి ప్రత్యేక దర్శనం కల్పిస్తే బాగుంటుందని చర్చిస్తున్నాం. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు చాలా బాగా దర్శనం చేసుకున్నాం అనే సంతృప్తి కలిగించేలా ఏర్పాట్లు చేస్తాం.
–మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్

భక్తులందరికీ నిత్య అన్న ప్రసాదం



ప్రస్తుతం నిత్యాన్నదానంలో 7 వేల మందికి భోజనం పెడుతున్నాం. బ్రహ్మోత్సవాల సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్న ప్రసాదం అందించాలని భావిస్తున్నాం. ఏర్పాట్లు బ్రహ్మాండంగా ఉండాలనే రెండు నెలలకు ముందే ముందస్తు చర్యలు ప్రారంభించాం. బ్రహ్మోత్సవాలకు వారం ముందే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులతో సమీక్షిస్తూ సలహాలు తీసుకుంటున్నాం. అన్నిశాఖల అధికారులు, ఉభయదారులతో సమన్వయంగా పనిచేస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తాం
–వెంకటేశు, ఆలయ ఈఓ

మంచిమాట

జీవనం.. జీవితం



ఏది మనిషికి విజయం? తన జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ అవడమే మనిషికి విజయం. ఫలవంతమూ, సారవంతమూ ఐన జీవనం జీవితానికి విజయం; ఫలవంతమూ, సారవంతమూ ఐతే జీవితానికి జీవనం విజయం'.

మనిషికి జీవనం లేకపోతే జీవితం లేదు; జీవితం లేకపోతే జీవనం లేదు. జీవనం, జీవితం ఈ రెండూ లేకపోతే మనిషి లేడు. ఉన్న మనిషికి ఉండే జీవనం, జీవితం మనిషి సఫలం అయ్యేందుకే కాని విఫలమూ, విధ్వంసమూ అయ్యేందుకు కాదు; విఫలమూ, విధ్వంసమూ చేసేందుకు కాదు.

మనిషి మస్తిష్కం ఆకాశం ఐతే అక్కడ నుంచి నాణ్యమైన, సరైన భావనల వానపడితే ఆ వానకు మనసు తడిస్తే జీవనం పూస్తుంది; జీవితం రూపొందుతుంది. జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ అవాలంటే మస్తిష్కమూ, మనసూ నాణ్యతతోనూ, సరిగ్గానూ ఉండాలి లేదా నాణ్యతతోనూ, సరిగ్గానూ పని చేస్తూ ఉండాలి. మస్తిష్కమూ, మనసూ నాణ్యతతోనూ, సరిగ్గానూ పని చేస్తూ ఉంటే జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ ఔతూ మనిషికి మాన్యత వస్తుంది.

పుట్టేశాం కదా అని కాలాన్ని తోసెయ్యడం జీవనం కాదు; కాలంవల్ల తోసెయ్యబడడం జీవితం కాకూడదు. అభిప్రాయాల్నీ, మనోభావాల్నీ పేర్చుకుంటూ పోవడం జీవనం కాదు; వాటినే మోసుకుంటూ వాటి బరువుకు కుంగిపోవడం, నలిగిపోవడం జీవితం కాకూడదు. వాగులో కొట్టుకుపోవడం కొనసాగడం ఔతుందా? ప్రవాహంలో ముందుకు ఈదడమూ, అవసరానికి అనుగుణంగా ప్రవాహానికి ఎదురు ఈదడమూ జీవనం అవుతుంది; నదిలో కొట్టుకు పోవడమా? కాదు, కాదు నదిలా ప్రవహించడం జీవితం ఔతుంది.

రాని పిలుపును విని వడివడిగా వెళ్లడం జీవనం కాదు; లేని చోటును వెతుక్కుంటూ వెళ్లడం జీవితం కాదు. ఉన్న దారిలో లేని తలుపులు మూసుకుని ఉన్నాయి అని అనుకుని ఊరికే పడి ఉండడం జీవనం కాదు; కొండే అడ్డుగా ఉన్నా దారీ, తీరూ మార్చుకుని నీరులా ముందుకు సాగడమే జీవితం.

మనిషికీ ఆచరణల ప్రయోగం, ఆశల ప్రణాళిక, నమ్మకాల ప్రదర్శన, అభిప్రాయాల ప్రకటన, గుణాల ప్రతాపం, భావాల ప్రవాహం, ఆలోచనల ప్రస్థానం మనిషి జీవనం, జీవితం. జీవనం, జీవితం వీటిని మనిషి ఏ మేరకు ఫలవంతం చేసుకుంటున్నాడు? ఎంత సారవంతం చేసుకుంటున్నాడు? తన జీవనం, జీవితం వీటివల్ల మనిషి ఏ మేరకు ఫలవంతం ఔతున్నాడు? ఎంత సారవంతం ఔతున్నాడు? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన జవాబులు మాత్రమే రావాలి లేదా సాధించుకోవాలి. అందుకనే మనిషికి జీవనం, జీవితం ఉన్నాయి; అందుకనే జీవనం, జీవితం వీటితో మనిషి ఉన్నాడు.

జీవితం ఒక గుంటగానూ, ఆ గుంటలో పడిపోయి పరుగెత్తుతూ ఉండడం జీవనంగానూ అవకూడదు. తనను తాను కోల్పోవడం మనిషికి జీవితం అవుతుందా? అవదు, అవదు; తన నుంచి తాను కోలుకోవడం ఏం ఔతుంది? అదే జీవితం ఔతుంది! పోగొట్టుకోవడం జీవనం అవదు అన్న తెలివిడి వస్తే పొందడం అన్నది జీవితం అవుతుంది అని తెలియవస్తుంది మనిషికి.

మనిషి తననుంచి తాను విడివడడం అన్న కళను అభ్యసించి నేర్చుకోవాలి. జన్మతః మనిషికి మానసికంగానూ, చింతనపరంగానూ లోపాలూ, దోషాలూ ఉంటాయి. లోపాలూ, దోషాలూ లేని మనిషి ఉండడం ఉండదు. తన లోపాల్నీ, దోషాల్నీ వదులుకోవడం కోసం మనిషి తన నుంచి తాను విడివడాలి లేదా విడుదల అవాలి. అలా జరిగితే అప్పుడు అది జీవనం ఔతుంది. తనను తాను మాటిమాటికీ సరి చూసుకుంటూ, సరి చేసుకుంటూ తనలోకి తాను చేరుతూ ఉంటే అప్పుడు అది జీవితం ఔతుంది.

జీవితం తనతో ఉన్నప్పుడు మనిషి దాన్ని ఉపయోగించుకోవడం జీవనం; జీవనం ఉపయోగపడడంవల్ల ఉన్నతిని పొందడం జీవితం. జీవనానికి జీవితం ఉండాలి; జీవితానికి జీవనం పండాలి; మహిలో మనిషి మెరవాలి. జీవనమూ, జీవితమూ ఉన్నాయి కాబట్టి మరణించాక కూడా మనిషి పరిమళించాలి.

– రోచిష్మాన్

గురువాణి

సైన్స్ ఆగిపోయిన సమయాన...



ఆపిల్ చెట్టు నుంచి పండు కిందపడిపోతుందని అందరికీ తెలుసు... కానీ అది కిందనే ఎందుకు పడాలి..? అని అడిగిన వాడు సర్ ఐజాక్ న్యూటన్. ఉత్తమమైన ప్రశ్న వేస్తే సారవంతమైన పరిష్కారాలు బయటికి వస్తాయి. భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని, అంతరిక్షంలో గ్రహాల కదలికలకు సంబంధించిన విషయాలను ప్రతిపాదించిన ఆయన అఖండ మేధావి, గణిత, భౌతిక శాస్త్రవేత్త. ''అంతరిక్షంలో గ్రహాలు ఎలా తిరుగుతున్నాయి... అన్న విషయాన్ని ఆకర్షణ సిద్ధాంతం ప్రతిపాదన చేస్తుందనీ, కానీ అక్కడ గ్రహాలు పెట్టిన వారు ఎవరు? అలా పెట్టి వాటిని నియమబద్ధమైన రీతిలో ఇంత వేగంతో ఇలానే కదలాలని నియంత్రిస్తున్నది ఎవరు? ...అన్న విషయాన్ని చెప్పదు'' అని కూడా ఆయన అన్నారు అందుకే పెద్దలు..'' సైన్స్ ఎక్కడ ఆగిపోతుందో... అక్కడ ఆధ్యాత్మికత మొదలవుతుంది'' అంటూంటారు. ఉన్న విషయాన్నే కనుక్కొని ప్రతిపాదిస్తే-డిస్కవరీ, సృష్టిలో ఇతః పూర్వం లేని విషయాన్ని మొట్టమొదటిసారిగా తెలుసుకుంటే - ఇన్వెన్షన్. ఈ రెండింటి ద్వారా నిరూపణచేస్తూ వెడుతుంది సైన్స్. కానీ ఆ సైన్స్ ఎక్కడ ఆగిపోతుందో... అక్కడ వేదాంతం ప్రారంభం అవుతుంది. అదే న్యూటన్ మాటల్లో తెలుస్తున్నది. మంట పైకే రావాలి, కిందకు పోతే ఎవరికీ పనికిరాదు. నీరు కిందకు పోకుండా పైకి వెడితే సృష్టి నిలబడదు. గాలి దానంతట అది కదులుతూ పోతుంటుంది. సముద్రాలు భూమిని పూర్తిగా ముంచెత్తకుండా ఒక హద్దు దగ్గరే ఆగిపోతుంటాయి... ఇవి కంటికి కనిపించే విషయాలే అయినా ఎవరు వాటిని అలా నియంత్రిస్తున్నారు లేదా ఏ శక్తి వాటిని అలా శాసిస్తున్నది అన్న విషయం ఈ భౌతిక నేత్రానికి కనపడేది కాదు. మొగ్గ పువ్వు అవుతుంది. పరిమళం వెదజల్లుతుంటుంది. పువ్వు పిందె అయింది, పిందె కాయ అయింది, కాయ పండు అయింది, గుజ్జు రసమయింది, బాగా పండిన తరువాత చెట్టుకున్న ముచ్చెను వదిలి కిందపడిపోతున్నది.. సూర్యుడు, చంద్రుడు, ఆకాశంలో చుక్కలు... ఇవన్నీ మనకు కనపడేవే... కానీ వాటిని చక్కగా నియమబద్ధంగా చేసి మనకు చూపుతున్న ఆ శిల్పి ఎవరు? ఆయన మాత్రం కనపడడు.


మరి ఆయనను చూడాలని ఉందా!!! ఒక్కటే మార్గం. భక్తి. దీని ద్వారా భారతదేశం సృష్టి రహస్యాలను విప్పి చూపింది... ఎప్పటినుంచో చూపుతూ వస్తున్నది... అందుకే సనాతనమయింది. వేదం ప్రమాణంగా నిర్ణయింపబడింది. అది ఎవరో రచించినది కాదు.. అది ఈశ్వర వాక్కు. భగవద్గీత కూడా అంతే... అందుకే సర్వజనాదరణ పొందింది. సైన్స్ పరిమితులను గురించి న్యూటన్ నిజాయితీగా చెప్పినా గొప్ప మాట చెప్పాడు.

రామకృష్ణ పరమహంస చెప్పినట్లు ... నీటిని ఎవరు ఏ పేరు పెట్టి పిలిచినా, దాహం తీరుస్తుంది... అలా తీర్చడం దాని లక్షణం. సైన్స్ అందుకోలేని లేదా విప్పి చెప్పలేని విషయాలను ఆధ్యాత్మికత జన సామాన్యానికి సుళువుగా అందిస్తుంది భక్తి అనే మాధ్యమం ద్వారా.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

ధర్మ యజ్ఞం



పూర్వం కురు రాజ్యాన్ని ఇంద్రప్రస్థ నగరం రాజధానిగా ధనంజయ కౌరవ్యుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతని ఆస్థాన పురోహితుడు, మంత్రి సుచీరతుడు అనే పండితుడు. ఒకరోజున వారిద్దరూ కూర్చొని పరిపాలన విషయాలు చర్చించుకుంటూ ఉండగా 'ధర్మయజ్ఞం' అనే విషయం చర్చకు వచ్చింది.

''అశ్వమేధం, రాజసూయం, పుత్రకామేష్టి మొదలైన యాగాలు తెలుసు. ధర్మ యాగం ఎలా చేయాలి ఆచార్యా!'' అని అడిగాడు రాజు.

''మహారాజా! నాకూ పూర్తిగా తెలియదు. మన రాజ్యంలో భగీరథీ తీరంలో విదుర పండితుడు ఉన్నాడు. ఆయన సర్వజ్ఞుడు. వెళ్ళి వివరంగా తెలుసుకు వస్తాను. శెలవియ్యండి'' అని అడిగి మరునాడు బయలుదేరి వెళ్ళి విదుర పండితుణ్ణి కలుసుకున్నాడు. విదురుడు తన మిత్రుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు. కుశల ప్రశ్నల తర్వాత తాను వచ్చిన విషయం చెప్పాడు సుచీరతుడు.

అంతలో ఎందరో శిష్యులు ఆయన సందర్శన కోసం వచ్చారు. దానితో ....''మిత్రమా! నేను ఈ సమయంలో ధర్మయాగం గురించి చెప్పలేను. అదిగో.. అక్కడ అడవి సమీపంలో నా పెద్ద కుమారుడు భద్రకారుని ఆశ్రమం ఉంది. అతనూ పండితుడే. వెళ్ళి భద్రకారుణ్ణి అడుగు'' అని చెప్పి పంపాడు. సుచీరతుడు ఆయన వద్దకు వెళ్లి తాను వచ్చిన విషయాన్ని వివరించగా... ''మహాశయా! మీ ప్రశ్నకు సమాధానం చెప్పే యోగ్యత నాకు లేదు. ఇంకా రెండు యోజనాల దూరం ముందుకు వెళ్ళు. అక్కడ నదీతీరంలో ఒక ఆశ్రమం ఉంటుంది. అది నా పెద్ద తమ్ముడు సంజయునిది. అతడు ప్రాజ్ఞుడు. నీకు అతను సమాధానం చెప్తాడు'' అని సగౌరవంగా సాగనంపాడు భద్రకారుడు.

సుచీరతుడు వెళ్ళే సమయానికి సంజయుడు అక్కడ లేడు. తిరిగి వచ్చేసరికి సాయంత్రం అయ్యింది. వచ్చాక, సుచీరతునికి తగు సత్కారాలు చేశాడు. ఆ విషయం తెలుసుకుని-

''సుచీరతా! నేను కూడా దీనికి సమాధానం చెప్పలేను. నిజం చెప్పాలంటే అందుకు తగను. సదాచార భ్రష్టుణ్ణి. ఇందుకు తగినవాడు మా అందరికంటే చిన్నవాడు మా తమ్ముడు సంభవుడు. అతని ఆశ్రమం ఈ పక్కనే ఉంది. వెళ్ళు'' అని మర్యాద పూర్వకంగా చెప్పాడు. సుచీరతుడు మరునాటి వేకువనే లేచి సంభవుని దగ్గరకు వెళ్ళాడు. విషయం అంతా చెప్పాడు.

ఉదయం స్నానాదికాలు పూర్తయ్యాక వారిద్దరూ ఒక మామిడి చెట్టు కింద కూర్చున్నారు.

''సుచీరతా! ధర్మయాగం చేసేవారు ఐదు విషయాలు పాటించాలి. అందులో మొదటిది; ఎప్పుడు చేసే పని అప్పుడే చేయాలి. తరువాత చేయవచ్చులే అని బద్ధకించకూడదు. నిర్లక్ష్యం తగదు. ఈ రెండు లక్షణాల్ని సమయపాలన అనే యజ్ఞగుండంలో కాల్చి బూడిద చెయ్యాలి.

ఇక రెండోది; ఎవ్వరు ఏది చెప్పినా జాగ్రత్తగా వినాలి. విన్న ప్రతిదాన్ని ఆచరించకూడదు. బాగా ఆలోచించి సరైన వాటిని మాత్రమే ఆచరించాలి.

మూడోది; ఏ విషయంలోనూ హద్దు దాటకూడదు. ప్రకృతిలో ఒక్కో శక్తికి ఒక్కో హద్దు ఉంటుంది. సమాజంలో ఒక్కో వ్యక్తికి ఒక్కో హద్దు ఉంటుంది. అర్హత ఉంటుంది. ప్రతి వారు తమ తమ హద్దులు తెలుసుకోవాలి. ఈ హద్దులు అమానవీయ, అకుశల విషయాల్లో లింగ భేదాల్లో కాదు. మన సామాజిక నైతిక నడవడికలో తండ్రికి, తల్లికి, తనయులకీ, గురువులకీ ఒక్కొక్కరికి ఒక్కో హద్దులుంటాయి. వారి వారి హద్దుల్లో వారికి గౌరవ మర్యాదలు దక్కుతాయి. నైతిక హద్దులు దాటడం చాలా ప్రమాదం.

అలాగే అధర్మ కార్యాలు చేయకూడదు. మనం చేసే పనులు మనకూ, పరులకూ హితాన్ని, సుఖాన్ని ఇవ్వాలి. ఇలా అందరికీ సుఖాన్నిచ్చేవే ధర్మకార్యాలు. అధర్మ కార్యాలు చేసేవారు రేవు కాని చోట నదిలో స్నానానికి దిగిన వారితో సమానం. అది వారికే ప్రమాదం.

ఇక ఐదో విషయం; చెడు తలపులు మానాలి. చెడు చేష్టలే కాదు. చెడ్డ ఆలోచనల్ని మన మనసులోకే రానీయకూడదు. ఒకవేళ వచ్చినా యజ్ఞ జ్వాలలో మండించే సమిధల్లా వాటిని కాల్చి బూడిద చెయ్యాలి.

సుచీరతా! ఈ ఐదూ పాటిస్తే అదే ధర్మ యాగం. ఈ యాగం చేసినవారు శుక్ల పక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెంది, పున్నమి చంద్రునిలా శోభిల్లుతారు'' అని చెప్పాడు.

సుచీరతుడు ఇంద్రప్రస్థం చేరి ధనంజయ కౌరవ్యునికి ఈ విషయాలు చెప్పాడు.

తన రాజ్యంలో ప్రజలందరూ- 'ధర్మయాగం' చేయవలసిందిగా రాజు చాటింపు వేయించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

మరికొన్ని రోజులు...


● ప్రభాస్

దాదాపు ముప్పై రోజులుగా ఫారిన్ ట్రిప్‌లో ఉన్నారు ప్రభాస్. ఈ ట్రిప్ ఇప్పటికే పూర్తి కావాల్సిందట.. కానీ మరికొన్ని రోజులు ఆయన అక్కడే ఉండనున్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశాపటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఇది. ఈ సినిమా టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని 'శాన్ డియాగో కామిక్ కాన్ 2023' వేడుకలో లాంచ్ చేస్తారు. ఈ నెల 20న (భారతీయ కాలమానం ప్రకారం ఈ నెల 21) జరగనున్న ఈ వేడుక కోసం ప్రభాస్ మరికొన్ని రోజులు అమెరికాలోనే ఉండి, ఆ తర్వాత ఇండియాకి తిరిగొస్తారట. అనంతరం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్: సీజ్‌ఫైర్' ప్రమోషన్స్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. కాగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్'(ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా చేస్తున్నారు ప్రభాస్. అలాగే 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమాకి ప్రభాస్ పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే.

యాక్షన్ మోడ్


● ఎన్టీఆర్

'దేవర' సినిమా కోసం ఎన్టీఆర్ యాక్షన్ మోడ్ కంటిన్యూ అవుతోంది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన లెంగ్తీ షూటింగ్ షెడ్యూల్ ముగిసింది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు, ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. పీటర్ హెయిన్స్ కొరియోగ్రఫీ చేసిన ఈ యాక్షన్ ఎపిసోడ్ సముద్రతీరం నేపథ్యంలో ఉంటుందని తెలిసింది. కాగా అతి త్వరలో మరో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారట కొరటాల శివ. సో.. దేవరగా ఎన్టీఆర్ యాక్షన్ మోడ్ మరికొన్ని రోజులు కంటిన్యూ అవుతుందనుకోవచ్చు. కాగా హీరో అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ 'దేవర' సినిమాలో ఒక పాత్రలో కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కల్యాణ్‌రామ్, కె.హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా 2024 ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ప్రత్యేక శిక్షణ.. బాలీవుడ్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్న 'వార్ 2' లో తన పాత్ర కోసం ఎన్టీఆర్ స్పెషల్ గెటప్‌లో కనిపిస్తారట. ఇందుకు సంబంధించిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఎన్టీఆర్ ప్రత్యేకమైన శిక్షణ తీసుకోనున్నారని ఇండస్ట్రీ టాక్.

ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్?


● రవితేజ


హీరో రవితేజ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్‌గా చార్జ్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. అజయ్‌దేవగన్ హీరోగా రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహించిన 'రైడ్' (2018) సినిమా హిందీలో ఘన విజయం సాధించింది. నిజాయితీ గల ఓ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ అమీ పట్నాయక్ (అజయ్ దేవగన్) తనకు ఎదురైన సవాళ్లను ఏ విధంగా సాల్వ్ చేశాడన్నదే 'రైడ్' కథాంశం. ఈ సినిమా తెలుగులో రీమేక్ కానుందంటూ వార్తలు వచ్చాయి. కొందరు హీరోల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. తాజాగా మరోసారి 'రైడ్' రీమేక్ ప్రస్తావన టాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ రీమేక్‌లో రవితేజ హీరోగా నటిస్తారని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తుందని టాక్. మరి.. 'రైడ్' రీమేక్‌లో రవితేజ నటిస్తారా? లేదా? తెలియాలంటే వేచి చూడాలి.

నిజమైన వసూళ్లు చెప్పమంటాను!


● కాజోల్

షారుక్ ఖాన్–కాజోల్ బాలీవుడ్ హిట్ పెయిర్. వీరిద్దరి కాంబోలో పలు సినిమాలు వచ్చినా 1995లో వచ్చిన 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' (తెలుగులో ప్రేమించి పెళ్ళాడుతా) సినిమా ఎవర్‌గ్రీన్. అయితే తాజాగా కాజోల్ సరదాగా చేసిన వ్యాఖ్యలపై షారుక్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆమెపై మండిపడుతున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. కాజోల్ లాయర్‌గా నటించిన 'ది ట్రయల్' వెబ్ సిరీస్ గత శుక్రవారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. 'ది ట్రయల్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు కాజోల్. 'ఇప్పటికిప్పుడు షారుఖ్ ఖాన్ ఎదురైతే మీరు అడిగే ఒక్క విషయం ఏంటి?' అని విలేకరులు ఆమెను ప్రశ్నించగా..'పఠాన్' సినిమా నిజమైన వసూళ్లు ఎంతో చెప్పమంటాను' అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు కాజోల్. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ ఏడాది జనవరి 25న విడుదలైన 'పఠాన్' సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు చేసిందని యూనిట్ పేర్కొంది. తాజాగా కాజోల్ చేసిన వ్యాఖ్యలతో 'పఠాన్' కలెక్షన్స్ నిజమా? కాదా? అనే సందేహాలు కొందరు వ్యక్తం చేస్తుండగా, షారుక్ ఫ్యాన్స్ మాత్రం కాజోల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారితోషికం ఇవ్వకున్నా నటించేవాణ్ణి - విజయ్ సేతుపతి



''షారుక్ ఖాన్ కోసమే 'జవాన్' చిత్రంలో నటిస్తున్నాను. నాకు ఒక్క రూపాయి పారితోషికం ఇవ్వకపోయినా కూడా ఆయనతో కలిసి నటించేవాణ్ణి'' అన్నారు నటుడు విజయ్ సేతుపతి. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వైవిధ్యమైన పాత్రలతో దక్షిణాది ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన 'ముంబైకర్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. సంతోష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత నెల (జూన్ 2) విడుదలైంది. ప్రస్తుతం ఆయన షారుక్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వం వహిస్తున్న హిందీ సినిమా 'జవాన్' లో విలన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ–''షారుక్ అంటే నాకు అభిమానం. ఆయన కోసమే 'జవాన్'లో విలన్‌గా చేస్తున్నా. నాకు పారితోషికం ఇవ్వకున్నా ఆయనతో కలిసి నటించేవాణ్ణి'' అంటూ షారుక్ ఖాన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. 'జవాన్' సినిమా సెప్టెంబర్ 7న విడుదల కానుంది. కాగా త్యాగరాజన్ కుమార్ రాజా దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సూపర్ డీలక్స్' (2019) లో విజయ్ సేతుపతి నటనపై షారుక్ ఖాన్ గతంలో ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

ఫాంటసీ రెయిన్‌బో



హీరోయిన్ రష్మిక మందన లీడ్ రోల్‌లో నటిస్తున్న తొలి చిత్రం 'రెయిన్‌బో'. మలయాళ నటుడు దేవ్ మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీతో శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్. ప్రకాష్ బాబు, ఎస్ఆర్. ప్రభు తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''రొమాంటిక్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'రెయిన్‌బో'. తమిళనాడు, కొడైకెనాల్ పరిసర ప్రాంతాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. అతిత్వరలోనే సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: కెఎం భాస్కరన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తంగ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరవేంద్రరాజ్ భాస్కరన్.

● రష్మిక మందన

పల్లెటూరి ప్రేమ కథ


● యష్ రంగినేని

''పల్లెటూరిలో జరిగే ప్రేమ కథే 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఒక అనూహ్య ఘటన వల్ల హీరో, హీరోయిన్ల ప్రేమ కథ ఎలాంటి మలుపులు తిరిగింది? అనే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో, పక్కా వాణిజ్య అంశాలతో తెరకెక్కిన ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని నిర్మాత యష్ రంగినేని అన్నారు. చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' ఈ నెల 21న విడుదలవుతోంది. చిత్ర నిర్మాత యష్ రంగినేని మాట్లాడుతూ– ''నాకు పాత తెలుగు సినిమాలంటే ఇష్టం. లండన్ వెళ్లినప్పుడు ఎన్టీఆర్‌గారి పాత సినిమాలు చూస్తుంటాను. 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' ని చెందు బాగా తీశాడు. నేను కూడా ఓ పాత్ర చేశాను. విజయ్ దేవరకొండతో మేము నిర్మించిన 'పెళ్ళి చూపులు, డియర్ కామ్రేడ్' సినిమాలను త్వరలో రీ రిలీజ్ చేస్తాం'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● సంజయ్‌రావు, ప్రణవి

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను ఈ నెల 29న విడుదల చేస్తోంది. ''మ్యారేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ కొత్త పాయింట్‌ను ఈ సినిమాలో చర్చించబోతున్నాం. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది. సినిమా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. బ్రహ్మాజీ, సప్తగిరి తదితరులు నటించిన ఈ సినిమాకు సహ–నిర్మాతలు: చింతా మెర్వాన్, సీహెచ్ చైతన్య పెన్మత్స, నిహార్ దేవెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



ఆదుకున్న ధనంజయ, మాథ్యూస్

పాకిస్తాన్ జట్టుతో గాలెలో ఆదివారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 65.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు సాధించింది. 54 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ లంక జట్టును ఏంజెలో మాథ్యూస్ (64; 9 ఫోర్లు), ధనంజయ డిసిల్వా (97 బ్యాటింగ్) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యం జోడించారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది మూడు వికెట్లు పడగొట్టాడు.



పోరాడి ఓడిన లక్ష్య సేన్

యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ పోరాటం ముగిసింది. అమెరికాలో జరిగిన ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 17–22, 24–22, 17–21తో ప్రపంచ ఏడో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. లక్ష్య సేన్‌కు 3,045 డాలర్ల (రూ. 2 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4,900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.


అల్‌కరాజ్ అద్భుతం

ఆల్ ఇంగ్లండ్ క్లబ్ వేదికపై కొత్త చరిత్ర నమోదైంది. క్లే కోర్టు స్పెషలిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకొని, హార్డ్‌కోర్ట్‌పై తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన తర్వాత ఇప్పుడు గ్రాస్ కోర్టుపై స్పెయిన్ 'బేబీ బుల్' మెరిశాడు. 23 గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ జొకోవిచ్ వరుస విజయాలకు విరామమిస్తూ యువ సంచలనం కొత్త శకానికి నాంది పలికాడు. రెండు పదుల వయసుకే కీర్తి శిఖరంపై నిలిచిన కార్లోస్ అల్‌కరాజ్ అద్భుత ఆటతో ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో విజేతగా నిలిచాడు. ఐదు సెట్‌ల పాటు హోరాహోరీగా సాగిన సమరంలో 'ఆల్‌టైమ్ దిగ్గజం' జొకోవిచ్‌ను 'పచ్చిక' కరిపించి చాంపియన్‌గా అవతరించాడు. వరల్డ్ నంబర్‌వన్‌గా తన అద్వితీయ ఆటను అతను సాధించిన గెలుపు టెన్నిస్‌లో రాబోయే నూతన శకానికి నాంది పలికింది. 24వ టైటిల్‌తో పాటు క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జొకోవిచ్ ఆఖరి వరకు తన స్థాయికి తగ్గ ఆటతో ప్రయత్నించినా... ఇద్దరి మధ్య ఉన్న '16' ఏళ్ల అంతరం ఆట చివర్లో అతని జోరుకు అడ్డుకట్ట వేసింది. నాదల్ వారసుడిగా గుర్తింపు తెచ్చుకొని పిన్న వయసులోనే పలు రికార్డులకు చిరునామాగా మారిన అల్‌కరాజ్ సగర్వంగా తన రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని ప్రదర్శించాడు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		జొకోవిచ్
9	ఏస్‌లు	2
7	డబుల్ ఫాల్ట్‌లు	3
5/19	బ్రేక్ పాయింట్లు	5/15
28/46	నెట్ పాయింట్లు	39/65
66	విన్నర్స్	32
45	అనవసర తప్పిదాలు	40
168	మొత్తం పాయింట్లు	166

- 'వింబుల్డన్' విజేతగా స్పెయిన్ స్టార్
- కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్
- హోరాహోరీ ఫైనల్లో ఓడిన జొకోవిచ్


అల్‌కరాజ్

లండన్: వింబుల్డన్‌లో వరుసగా 35వ విజయంతో ఐదో టైటిల్, ఓవరాల్‌గా 24వ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకోవాలనుకున్న నొవాక్ జొకోవిచ్ కోరిక నెరవేరలేదు. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) ఓడిపోయాడు. 4 గంటల 42 నిమిషాల పాటు సాగిన పోరులో అల్‌కరాజ్ 1–6, 7–6 (8/6), 6–1, 3–6, 6–4 స్కోరుతో జొకోవిచ్‌పై నెగ్గాడు. 2022లో యూఎస్ ఓపెన్ సాధించిన అల్‌కరాజ్‌కు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఈ ఏడాది వరుసగా ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి జోరు మీదున్న 36 ఏళ్ల జొకోవిచ్ మూడో గ్రాండ్‌స్లామ్ తుది పోరులో ఓటమితో నిరాశగా నిష్క్రమించాడు. విజేత అల్‌కరాజ్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ జొకోవిచ్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 12 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

హోరాహోరీగా...

అంచనాలకు తగినట్లుగా జొకోవిచ్ దూకుడుగా ఆటను మొదలు పెట్టాడు. 5–0తో దూసుకుపోయాడు. అదే జోరులో తొలి సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో హోరాహోరీ సమరం సాగింది. అల్‌కరాజ్ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంతో జొకోవిచ్ కూడా ప్రతీ పాయింట్ కోసం శ్రమించాల్సి వచ్చింది. స్కోర్లు 4–4, 5–5, 6–6తో సమమవుతూ వచ్చాయి. టైబ్రేక్‌లో చివరకు బ్యాక్‌హ్యాండ్ విన్నర్‌తో పాయింట్ నెగ్గిన అల్‌కరాజ్ సెట్‌ను గెలుచుకున్నాడు. ఈ సెట్ 85 నిమిషాలు సాగడం విశేషం. ఈ సెట్ నాలుగో గేమ్‌లో 29 షాట్‌ల ర్యాలీతో స్టేడియం హోరెత్తింది.


జొకోవిచ్

పట్టు కోల్పోయిన జొకో...

రెండో సెట్ గెలిచిన ఉత్సాహంలో అల్‌కరాజ్ మూడో సెట్‌లో తన జోరును కొనసాగించాడు. 3–1తో అతను ముందంజ వేశాడు. అయితే ఐదో గేమ్ ఈ మ్యాచ్ మొత్తానికే హైలైట్‌గా సాగింది. 27 నిమిషాల పాటు 13 'డ్యూస్'లతో సాగిన ఈ గేమ్‌లో ప్రతీ పాయింట్ కోసం ఇద్దరు ఆటగాళ్లు తీవ్రంగా పోరాడారు. ఈ గేమ్‌ను గెలుచుకొని 4–1తో ఆధిక్యంలో నిలిచిన అల్‌కరాజ్‌కు మరో రెండు గేమ్‌లు గెలుచుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఓడితే టైటిల్ కోల్పోయేస్థితిలో నాలుగో సెట్ బరిలోకి దిగిన జొకోవిచ్ తన స్థాయి ఆటను ప్రదర్శించి సెట్ సాధించాడు. చివరి సెట్‌లో 1–1తో సమంగా నిలిచిన తర్వాత మూడో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌లను నిల బెట్టుకొని అల్‌కరాజ్ విజయం ఖరారు చేసుకున్నాడు.

జ్యోతికి రజతం... జ్యోతికశ్రీకి కాంస్యం

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో స్థానం

బ్యాంకాక్: ప్రతిష్టాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ తమ రెండో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్ 6 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 27 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. 2017లో భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ అత్యధికంగా 29 పతకాలతో అగ్రస్థానంలో నిలువగా... 1989, 1985 ఆసియా చాంపియన్‌షిప్‌లలో 22 పతకాల చొప్పున సాధించింది.

చివరిరోజు ఆదివారం భారత అథ్లెట్లు 13 పతకాలు సొంతం చేసుకున్నారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు జ్యోతి యర్రాజీ రజతం, దండి జ్యోతికశ్రీ కాంస్య పతకం సాధించారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గి చరిత్ర సృష్టించిన జ్యోతి యర్రాజీ 200 మీటర్ల విభాగంలో రజతం గెలిచింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 23.13 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది.


జ్యోతి


జ్యోతికశ్రీ

మహిళల 4×400 మీటర్ల రిలేలో దండి జ్యోతికశ్రీ, హీనా మలిక్, ఐశ్వర్య మిశ్రా, శుభ వెంకటేశన్ బృందానికి కాంస్య పతకం దక్కింది. జ్యోతికశ్రీ బృందం 3 నిమిషాల 33.73 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచింది. పురుషుల 4×400 మీటర్ల రిలేలో అమోజ్ జేకబ్, అజ్మల్, మిజో కురియన్, రాజేశ్‌లతో కూడిన భారత బృందం (3ని:01.80 సెకన్లు) రజతం సాధించింది. మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో అభా ఖతువా (భారత్) ఇనుప గుండును 18.06 మీటర్ల దూరం విసిరి జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం గెలిచింది. మహిళల 5000 మీటర్ల రేసులో పారుల్ చౌదరీ (15ని:52.35 సెకన్లు) రజతం, అంకిత (16ని:03.33 సెకన్లు) కాంస్యం నెగ్గారు. పురుషుల 5000 మీటర్ల విభాగంలో గుల్‌వీర్ సింగ్ (13ని:48.33 సెకన్లు) కాంస్యం సాధించాడు. పురుషుల జావెలిన్ త్రోలో డీపీ మనూ (81.01 మీటర్లు) రజతం దక్కించుకున్నాడు. పురుషుల 800 మీటర్లలో కిషన్ కుమార్ (1ని:45.88 సెకన్లు), మహిళల 800 మీటర్లలో కేఎం చందా (2ని:01.58 సెకన్లు) రజత పతకాలు నెగ్గారు. పురుషుల 20 కిలోమీటర్ల నడకలో వికాశ్ సింగ్ (1గం:29ని:32 సెకన్లు) కాంస్యం, మహిళల 20 కిలోమీటర్ల నడకలో ప్రియాంక గోస్వామి (1గం:34ని:24 సెకన్లు) రజతం గెలిచారు.

భారత మహిళల జట్టుకు షాక్

వన్డేల్లో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఓటమి

మిర్పూర్: భారత మహిళల జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో రెండు వరుస టి20లను గెలిచి సిరీస్‌ను చేజిక్కించుకుంది. తర్వాత ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకొని ఆఖరి టి20లో ఘోరంగా ఓడింది. తాజాగా ఆదివారం మొదలైన వన్డే సిరీస్‌లో అదే ధోరణి కొనసాగించి మరో ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 40 పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం సిరీస్‌లో 0–1తో వెనుకబడింది. వర్షంతో 44 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బంగ్లా 43 ఓవర్లలో 152 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (39; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

భారత బౌలర్లలో అమన్‌జోత్ కౌర్ (4/31) రాణించగా, దేవిక వైద్యకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత సులువైన లక్ష్యమే ఎదురైనా బ్యాటర్ల నిలువెత్తు నిర్లక్ష్యం భారత మహిళల జట్టును 35.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూల్చింది. ఈ మ్యాచ్‌కు ముందు బంగ్లాదేశ్‌తో ఆడిన ఐదు వన్డేల్లోనూ నెగ్గిన భారత్ తొలిసారి ఓటమి చవిచూసింది. దీప్తి శర్మ చేసిన 20 పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోరంటే మన మహిళల జట్టు వైఫల్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. స్టార్ స్మృతి మంధాన (11), హర్మన్‌ప్రీత్ (5), జెమీమా (10) అంతా పెవిలియన్ బాట పట్టారు. వన్డే క్రికెట్లోనూ అరంగేట్రం చేసిన ఆంధ్ర అమ్మాయి బారెడ్డి అనూషకు వికెట్ దక్కలేదు. బ్యాటింగ్‌లో 2 పరుగులు చేసి రనౌటైంది.



సౌత్ జోన్ ఖాతాలో దులీప్ ట్రోఫీ

- 13 ఏళ్ల తర్వాత మళ్లీ టైటిల్
- ఫైనల్లో వెస్ట్ జోన్‌పై విజయం

బెంగళూరు: సౌత్ జోన్ గతేడాదే దులీప్ ట్రోఫీని ఎగరేసుకుపోదామనుకుంటే వెస్ట్ జోన్ జట్టు అడ్డుకుంది. ఇప్పుడు అదే వెస్ట్ జోన్‌ను... చతేశ్వర్ పుజారా, సూర్యకుమార్ యాదవ్, పృథ్వీ షాలున్న గట్టి జట్టుకు షాక్ ఇచ్చి గత ఫైనల్ పరాజయానికి సౌత్ జోన్ బదులు తీర్చుకుంది. ఈ సీజన్ 'దులీప్ ట్రోఫీ'ని హనుమ విహారి సారథ్యంలోని సౌత్ చేజిక్కించుకుంది. ఫైనల్లో 75 పరుగుల తేడాతో వెస్ట్‌జోన్‌పై ఘనవిజయం సాధించింది. 13 ఏళ్ల తర్వాత ఈ దేశవాళీ టోర్నీని మళ్లీ ముద్దాడింది. సౌత్‌కిది 14వ టైటిల్. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో 298 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో... ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 182/5తో ఆట కొనసాగించిన వెస్ట్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 84.2 ఓవర్లలో 222 పరుగుల వద్ద ఆలౌటైంది. ఐదో రోజు ఆట మొదలైన కాసేపటికే కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (95; 11 ఫోర్లు) వెనుదిరగడంతో సౌత్ విజయం లాంఛనమైంది. లోయర్ ఆర్డర్, టెయిలెండర్లలో ధర్మేంద్రసింగ్ జడేజా (15; 2 ఫోర్లు) మినహా ఇంకెవరూ కనీసం 10 పరుగులైనా చేయలేకపోయారు. వైశాక్, సాయికిశోర్‌లకు చెరో 4 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో వెస్ట్ వెన్ను విరిచిన విద్వత్ కావేరప్ప (7/53)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

దులీప్ ట్రోఫీతో కెప్టెన్ విహారి


భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

భారత వాయుసేనలో అగ్నివీర్ నియామకాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత వాయుసేన.. అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలచేసింది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్(సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు)/ఇంటర్ ఒకేషనల్ లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్ /ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్ /ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్–2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్–1, అడాప్టబిలిటీ టెస్ట్–2), ఫేజ్–3(మెడికల్ ఫిట్‌నెస్ట్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 27.07.2023.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువుతేది:** 17.08.2023.
» **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 13.10.2023.
» **వెబ్‌సైట్:**https://agnipathvayu.cdac.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 14 ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో ఆఫీసర్ స్కేల్ 2, 3, 4, 5 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** ఏజీఎం–బోర్డ్ సెక్రటరీ–కార్పొరేట్ గవర్నెన్స్–01, ఏజీఎం–మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎంఐఎస్)–01, చీఫ్ మేనేజర్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎంఐఎస్)–01, చీఫ్ మేనేజర్, మార్కెట్ ఎకనామిక్ అనలిస్ట్–01, చీఫ్ మేనేజర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆడిట్–01, ఎకనామిస్ట్–02, మెయిల్ అడ్మినిస్ట్రేటర్–01, ప్రొడక్షన్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్ ఫర్ ఈఎఫ్‌టీ స్విచ్–02, ప్రొడక్షన్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్ ఫర్ యూపీఐ స్విచ్–04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఎస్, సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్–3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230, స్కేల్–2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810, స్కేల్–4 పోస్టులకు రూ.76,010 నుంచి రూ.89,890, స్కేల్–5 పోస్టులకు రూ.89,890 నుంచి రూ.1,00,350.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 400 స్కేల్2, స్కేల్3 ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో ఆఫీసర్ స్కేల్ 2, 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ స్కేల్3–100, ఆఫీసర్ స్కేల్2–300.
» **అర్హత:** 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు 25 నుంచి 38 ఏళ్లు. ఆఫీసర్ స్కేల్–2 పోస్టులకు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్–3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230. స్కేల్–2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.68,810.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీసెర్చ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–01, రీసెర్చ్ అసిస్టెంట్–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ,ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** రీసెర్చ్ అసోసియేట్‌కు 40 ఏళ్లు, రీసెర్చ్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.35,000, రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ.20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.07.2023.
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

గ్రూప్-2.. సక్సెస్ ప్లాన్

» ఆగస్ట్ 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు
» పోటీలో అయిదున్నర లక్షల మంది అభ్యర్థులు
» నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే విజయం

గ్రూప్-2 సర్వీసెస్ పరీక్ష..! తహశీల్దార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఏసీటీఓ.. వంటి క్రేజీ పోస్ట్‌లు ఉండే సర్వీసు! గెజిటెడ్ ర్యాంకుతో కొలువు ఖరారు చేసే పరీక్ష! అన్నింటికీ మించి సర్కారీ కొలువు సొంతం చేసుకునే అవకాశం! అందుకే గ్రూప్ 2కు లక్షల మంది పోటీపడుతుంటారు. తెలంగాణలో గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. పరీక్ష తేదీలు సమీపిస్తుండడమే! ఆగస్ట్ 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ సన్నాహకాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్ 2లో విజయానికి ప్రిపరేషన్ ప్లాన్..

మొత్తం 783 పోస్ట్‌లకు 5,51,943 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అంటే.. ఒక్కో పోస్ట్‌కు 705 మంది పోటీ ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ స్థాయి పోటీలో నెగ్గాలంటే.. అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

సిలబస్‌కు సరితూగే

గ్రూప్–2 అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో..ఇప్పటివరకు చదివిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇప్పుడు కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా.. సిలబస్‌కు సరితూగే పరిమిత పుస్తకాలను మాత్రమే చదవాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలున్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్2లో విజయానికి విశ్లేషణాత్మక అధ్యయనం ముఖ్యం. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. కాని అన్ని కోణాల్లో అవగాహన ఉంటేనే సమాధానాలు గుర్తించగలిగేలా ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి ప్రస్తుత సమయంలో డిస్క్రిప్టివ్ విధానంలో చదువుతూ.. ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

కామన్ టాపిక్స్

అభ్యర్థులు కామన్ టాపిక్స్‌ను ఒకే సమయంలో చదివేలా ప్లాన్ చేసుకోవాలి. పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లలోని ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

ఏదీ వదలకుండా

ఇప్పటి వరకు ప్రిపరేషన్‌ను పూర్తి చేసే క్రమంలో ఏమైనా టాపిక్స్ వదిలేస్తే వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే టాపిక్స్‌ను లోతుగా చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ఇంతకాలం రాసుకున్న సొంత నోట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యమైన అంశాలు, పాయింట్లతో రాసుకున్న నోట్స్‌ను పదే పదే చదువుతూ ముందుకు సాగాలి. మతాలు,సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

ప్రభుత్వ విధానాలు

- రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం ప్రభుత్వ విధానాలపై ప్రచురితమైన అధికారిక డాక్యుమెంట్లను పరిశీలించాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు రూపొందించారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి.
- తెలంగాణ ఏర్పాటుకు ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు.. నిధులు.. నియామకాలు.. వంటి వాటిపై ఎలాంటి విధానాలు తెచ్చారో తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన పాలసీలపై అవగాహన పెంచుకోవాలి. ఎస్సీలు,ఎస్టీలు,మహిళలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించి తెచ్చిన పథకాలను అధ్యయనం చేయాలి.



పేపర్-4కు ప్రత్యేకంగా

గ్రూప్–2 అభ్యర్థులు పేపర్–4పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. ఇందులో 'తెలంగాణ ఆలోచన (1948–1970), ఉద్యమ దశ(1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014)).. అని మూడు దశలను పేర్కొన్నారు. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం- 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకూ జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు –వాటి సిఫార్సులపై పట్టు సాధించాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణకు కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

'స్పెషల్' ఫోకస్

తెలంగాణ ప్రత్యేక అంశాలను చదివేటప్పుడు.. తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీ పేరుతో ప్రత్యేకంగా ఉన్న టాపిక్స్‌ను మరింత లోతుగా అధ్యయనం చేయాలి. చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యమున్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం–విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపైనా అవగాహన అవసరం. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు–ఉత్పాదకతతోపాటు, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులపై పట్టు సాధించాలి.

రివిజన్.. రివిజన్

గ్రూప్–2 అభ్యర్థులు పునశ్చరణకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని గ్రహించాలి. పరీక్ష తేదీలకు కనీసం పది రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకోవాలి. రివిజన్ సమయంలో షార్ట్ నోట్స్, సొంత నోట్స్‌లను అనుసరించాలి. దీంతోపాటు ప్రీవియస్ పేపర్స్, ప్రాక్టీస్ పేపర్స్ సాధన కూడా గ్రూప్2 పరీక్షలో విజయానికి దోహదం చేస్తుంది.

గ్రూప్-2 పరీక్ష ఇలా..

పేపర్	సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
1	జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్	150	150
2	హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ 1) సోషియో కల్చరల్ హిస్టరీ ఆఫ్ ఇండియా, తెలంగాణ 2) భారత రాజ్యాంగ సమీక్ష, రాజకీయాలు 3) సామాజిక స్వరూపం, సమస్యలు, పబ్లిక్ పాలసీలు	150	150
3	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 1) ఇండియన్ ఎకానమీ: సమస్యలు, సవాళ్లు 2) ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ 3) అభివృద్ధి సమస్యలు, మార్పు	150	150
4	తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 1) ఐడియా ఆఫ్ తెలంగాణ(1948-1970) 2) మొబిలైజేషన్ దశ (1971-1990) 3) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశ (1991-2004)	150	150
మొత్తం		600	600

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	502	66,061
నిఫ్టీ ▲	151	19,565

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్డాక్	14,114	▽	25
డోజోన్స్	34,509	▲	114
ఎఫ్టీఎస్ఈ 100	7,435	▽	6
డాక్స్	16,105	▽	36
షాంఘై	3,237	▲	1
నికాయ్	32,391	▽	28

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఇంటి రుణ భారం తగ్గే దారేది..!

20 ఏళ్ల కాలానికి రెట్టింపు చెల్లింపు ● అసలు ఎంతో.. వడ్డీ అంతే ● వీలైనప్పుడు ముందస్తు చెల్లింపులు
నిర్ణీత గడువు కంటే ముందే గుడ్బై ● దీనివల్ల వడ్డీలో గణనీయమైన ఆదా

ఇంటిని కొనుగోలు చేయడం ప్రతి ఒక్కరి జీవితంలో అదిపెద్ద ఆర్థిక లక్ష్యం. ఇందుకోసం భారీ మొత్తం అవసరంపడుతుంది. ఎన్నో ఏళ్లపాటు కష్టార్జితాన్ని పొదుపు, మదుపు చేసి ఇల్లు కొనుక్కోవడం ఒక మార్గం అయితే, 20-25 ఏళ్ల కాలానికి రుణం తీసుకుని ఇంటిని సమకూర్చుకోవడం రెండో మార్గం. రెండు దశాబ్దాల క్రితం అయితే ఎక్కువ మంది జీవితాంతం కష్టపడి పొదుపు చేసి ఇంటిని సమకూర్చుకునే వారు. కానీ, ఇందులో మార్పు వచ్చింది. రుణం మార్గంలో చిన్న వయసులోనే సొంతింటివారయ్యే అవకాశం ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. కానీ, ఇదేమంత చిన్న విషయం కానే కాదు. తీసుకున్న అసలు రుణాన్ని, వడ్డీ సహా చెల్లించుకోవాలి. పైగా రుణం ఎంత ఇవ్వాలి, ఎంత వడ్డీ, ఎన్నేళ్ల కాల వ్యవధి అనే అంశాలను రుణమిచ్చే సంస్థే నిర్ణయిస్తుంటుంది. ఈ విషయంలో రుణదాతకు ఉన్న స్వేచ్ఛ తక్కువ. అందుకే రుణంపై ఇంటిని సమకూర్చుకునే వారు తప్పకుండా కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. దీర్ఘకాలం పాటు రుణ బాధ్యత మోయకుండా, ఆ భారాన్ని దింపుకునే, తగ్గించుకునే మార్గాల గురించి తెలుసుకోవాలి.



ఇంటి రుణంపై చెల్లించే ఈఎంఐ ఓ సగటు మధ్య తరగతి కుటుంబానికి చాలా పెద్ద మొత్తమే అవుతుంది. నెలవారీ ఆర్జనలో 30–40 శాతం వరకు ఉండొచ్చు. 20 ఏళ్ల కాలానికి గృహ రుణం తీసుకున్నారని అనుకుంటే.. గడువు పూర్తయ్యే నాటికి రుణదాత చెల్లించే మొత్తం రెట్టింపు అవుతుంది. అంటే తీసుకున్న రుణం ఎంతో, అంత మేర వడ్డీ కూడా ఇక్కడ చెల్లించాల్సి వస్తుంది. కానీ, ఆర్థిక కోణం నుంచి చూస్తే ఇదేమంత లాభదాయక విషయం కాదన్నది వాస్తవం. ఇంటి రుణం విషయంలో కొంత లాభపడాలంటే ఆ రుణాన్ని వీలైనంత తొందరగా ముగించేయడం మెరుగైన ఆలోచన అవుతుంది.

'రుణ' వాటా తగ్గాలి

ఇంటిని కొనుగోలు చేసే వారు రుణాన్ని వీలైనంత తక్కువకు పరిమితం చేసుకోవాలన్నది ప్లాన్ రూపీ ఇన్వెస్ట్మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు అమోల్ జోషి సూచించారు. అంటే రుణం వీలైనంత తక్కువగా ఉండాలి. కానీ, ఆచరణలో ఎక్కువ కేసుల్లో దీనికి విరుద్ధంగా జరుగుతుందంటున్నారు అమోల్ జోషి. ''ఇంటి రుణం తీసుకునే వారు సరిపడా సైజు, చక్కని వసతులు వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. దీనివల్ల వారు తీసుకోవాల్సిన రుణం మొత్తం పెరిగిపోతుంటుంది''అని జోషి వివరించారు. కానీ, రుణం వస్తుంది కదా అని ఖరీదైన ఇంటిని సులభంగా కొనుగోలు చేయడం కాకుండా, తిరిగి నెలవారీ ఎంత మేర చెల్లించాల్సి వస్తుందన్నది కూడా పట్టించుకోవాలి. ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి గృహ రుణం తీసుకున్నారని అనుకుంటే.. 8.5 శాతం వార్షిక వడ్డీపై 20 ఏళ్లకూ కలిపి అసలుకు సరిపడా వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు రూ. కోటి రుణం తీసుకుంటే 8.5 శాతం రేటుపై, 20 ఏళ్లలో రూ.1.08 కోట్లను వడ్డీ రూపంలోనే చెల్లించాల్సి వస్తుంది.

వడ్డీ భారం తగ్గాలంటే..?

పైన చెప్పుకున్నట్టు అసలుకు సమానంగా వడ్డీ చెల్లించకూడదని మీరు కోరుకునేట్టు అయితే, రుణాన్ని నిర్దేశిత గడువు కంటే ముందుగానే చెల్లించేసేలా ప్రణాళిక ప్రకారం నడుచుకోవడం చక్కని మార్గం. అది కూడా రుణాన్ని తీసుకున్న తొలినాళ్ల లోనే ముందస్తు అదనపు చెల్లింపులను ప్రారంభించాలి. ఎందుకంటే ఆరంభం లోనే రుణంపై వడ్డీ భారం ఎక్కువ పడుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ వడ్డీ భారం తగ్గుతూ, అసలులో ఎక్కువ జమ అవుతుంది. పైన చెప్పుకున్న ఉదాహరణలో రూ.కోటి రుణాన్ని తీసుకున్న మూడేళ్ల తర్వాత నుంచి నెలవారీ ఈఎంఐకి అదనంగా ముందస్తు చెల్లింపులు మొదలు పెట్టి.. రుణాన్ని 14–15 ఏళ్ల లోనే తీర్చేసేట్టు అయితే, రూ.20–25 లక్షల వరకు వడ్డీ రూపంలో ఆదా చేసుకోవచ్చు. అలా కాకుండా అదనపు ముందస్తు చెల్లింపులను జాప్యం చేశారనుకుంటే.. పదో ఏట తర్వాతే మొదలు పెట్టేట్టు అయితే అప్పుడు వడ్డీ రూపంలో ఆదా చేసుకునేది స్వల్పంగానే ఉంటుంది. అందుకే రుణం తీసుకున్న తర్వాత వీలైనంత ముందుగా అదనపు చెల్లింపుల మార్గాలను అన్వేషించుకోవాలి. ''వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలోనే ఉన్నాయి. ఇంకొంత పెరిగే అవకాశాలు లేకపోలేదు. కనుక వడ్డీ భారాన్ని వీలైనంత తగ్గించుకునేందుకు ముందస్తు చెల్లింపులు మంచి ఆప్షన్ అవుతుంది. ఒకవేళ వడ్డీ రేట్లు ఇక్కడి నుంచి తగ్గుముఖం పడితే ముందస్తు చెల్లింపుల రూపంలో వడ్డీని మరింత మేర ఆదా చేసుకున్నట్టు అవుతుంది''అని సృజన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యవస్థాపక భాగస్వామి దీపాలి సేన్ సూచించారు. ముందస్తు చెల్లింపుల్లో మరో ఆప్షన్ను కూడా పరిశీలించొచ్చు. ఈఎంఐ రుణ కాలవ్యవధి అంతటా మారకుండా స్థిరంగా ఉంటుంది. కానీ, వేతన జీవి ఆదాయం ఏటా పెరుగుతూ వెళుతుంది. దీనికి తగ్గట్టుగా రుణ ఈఎంఐని ఏటా పెంచుకుంటూ, మధ్యలో అదనంగా సమకూరే మొత్తాన్ని కూడా ముందస్తు చెల్లింపులకు వినియోగించుకుంటే, 20 ఏళ్ల రుణాన్ని 10 ఏళ్లలోనే ముగించేయవచ్చు. దీనివల్ల వడ్డీ రూపంలో గణనీయమైన మొత్తం ఆదా అవుతుంది. ఏటా ఈఎంఐ పెంచుకోవడాన్ని స్టెపప్ ఈఎంఐగా చెబుతారు. పెరిగే వేతనాలు, బోనస్లను ఇందుకు వినియోగించుకోవాలి.



వీలైనంత ముందుగా..

నిర్ణీత గడువు కంటే ముందుగానే గృహ రుణాన్ని వదిలించుకోవడం వల్ల వడ్డీ రూపంలో పెద్ద మొత్తమే ఆదా అవుతుందని స్పష్టంగా తెలుస్తోంది. కనుక దీన్ని విస్మరించకూడదు. అయితే, రుణ గ్రహీత చెల్లింపుల సామర్థ్యమే అంతిమంగా దీన్ని నిర్ణయిస్తుంది. భారతీయుల్లో ఎక్కువ మంది దీర్ఘకాలం పాటు రుణ భారాన్ని మోయడానికి ఇష్టపడని వారేనని నిపుణులు సైతం చెబుతున్నారు. ''పదేళ్ల క్రితం వరకు ఎక్కువ శాతం రుణాలు ఏడు నుంచి 9 ఏళ్ల మధ్యలోనే ముగించినట్టు మా డేటా తెలియజేస్తోంది. కాకపోతే ముందస్తుగా రుణాన్ని తీర్చేయడం అన్నది ఇప్పుడు 9–12 ఏళ్లకు మారింది. భారత్లో ఎక్కువ మంది రుణాల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు''అని మార్ట్గేజ్ వరల్డ్ సీఈవో విపుల్ పటేల్ తెలిపారు. ఏక మొత్తంలో కొంత రుణాన్ని తీర్చి వేయడానికి సాధారణంగా మూడు నుంచి ఐదేళ్లు అయినా వ్యవధి అవసరం పడొచ్చు. ఎందుకంటే ఎంతో కొంత సమకూర్చుకోవడానికి ఇంత మేర కాల వ్యవధి అవసరం కనుక. ఏటా ఈఎంఐను పెంచుతూ చెల్లించడం ఒక ఆప్షన్ అయితే, మధ్యలో వచ్చే బోనస్, ఇతరత్రా వెసులుబాటు లభించినప్పుడు అదనంగా ఒకే విడత చెల్లించడం మరో మార్గం. ''రుణ గ్రహీత తన ఇష్టం ప్రకారం ఈఎంఐని పెంచి చెల్లించడం కాకుండా, స్టెపప్ ఈఎంఐ ఆప్షన్ను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల ఆటోమేటిక్గా ఈఎంఐ పెరుగుతుంది. లేకపోతే కొన్ని ఆకర్షణీయమైన ఖర్చులతో ముందస్తు చెల్లింపులపై ప్రభావం పడుతుంది''అని దీపాలిసేన్ సూచించారు.

అన్ని అంశాలు చూసిన తర్వాతే


వ్యక్తిగత ఆర్థిక అంశాల్లో గృహ రుణం అన్నది ఒక్క భాగం మాత్రమే. కనుక ముందస్తుగా రుణాన్ని చెల్లించే ముందు, ఇతర బాధ్యతలు, అవసరాలు, వెసులుబాటును కూడా చూసుకోవాలన్నది నిపుణుల సూచన. అందరి ఆర్థిక పరిస్థితులు ఒకే మాదిరిగా ఉండవు. తమ క్లయింట్ల విషయంలో భిన్న వ్యవహార శైలిని చూస్తుంటామని అమోల్ జోషి వెల్లడించారు. ''పెరుగుతున్న జీవనశైలి ఖర్చులతో నెలవారీ పొదుపు కష్టంగా మారుతోంది. కనుక వ్యక్తులు సింగిల్ షాట్కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏడాదికోసారి ముందస్తు చెల్లింపునకే ప్రాధాన్యం ఇస్తున్నారు'' అని జోషి వివరించారు. జీవితంలో ఎన్నో అవసరాలు పెరుగుతుంటాయి. కనుక వాటికి కూడా ప్రాధాన్యం ఇస్తూ గృహ రుణాన్ని ముందుగా తీర్చివేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గృహ రుణాన్ని ముందుగా తీర్చివేయాలని భావించే వారు తమ ఆదాయపన్ను కోణంలోనూ దీన్ని ఓ సారి విశ్లేషించుకోవాలి. ఎందుకంటే పాత పన్ను విధానంలో గృహ రుణంపై అసలు, వడ్డీ మొత్తం కలిపి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.3.5 లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు. కనుక రూ. 9 లక్షల వరకు వార్షికాదాయం కలిగిన వారికి గృహ రుణం రూపంలో గణనీయమైన మొత్తమే ఆదా చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 2 లక్షల మొత్తం వడ్డీ చెల్లింపులకే పన్ను ప్రయోజనం సెక్షన్ 24(బీ) కింద ఉంటుంది. సెక్షన్ 80సీ కింద అసలుకు జమ చేసే రూ.1.5 లక్షలకు కూడా పన్ను ఆదా ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే, ఒక ఆర్థిక సంవత్సరంలో గృహ రుణంపై వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల లోపునకు తగ్గిపోయినప్పుడు, పన్ను పరిధిలో ఉన్న వారు ముందస్తు చెల్లింపుల వైపు మొగ్గు చూపించొచ్చు.

●●●

''గృహ రుణం పెద్ద మొత్తంలో తీసుకుంటే, సమీప కాలంలో వేరే ఇతర పెద్ద ఆర్థిక లక్ష్యాలు లేకుంటే.. వీలైనంత అదనపు మొత్తంతో రుణాన్ని ముందుగా తీర్చివేయడమే మంచిది. అది నెలవారీ కావచ్చు, ఏడాదికోసారి కావచ్చు. మిగిలిన గృహ రుణం కొంతే ఉంటే, అప్పుడు మిగులు మొత్తాన్ని పెట్టుబడులు, ముందస్తు చెల్లింపులు అనే రెండు భాగాలుగా విభజన చేసుకోవాలి''అని దీపాలి సేన్ సూచించారు. గృహ రుణం అనేది పెద్ద బాధ్యత. సొంతింటి కల సాకారానికి దీని సాయం తీసుకోవడంలో తప్పు లేదు. కానీ, ఈఎంఐ రూపంలో నెలవారీ ఎంత చెల్లింపుల సామర్థ్యం తమకు ఉంది, తమ కుటుంబ ఆదాయం, అవసరాలు, ఆరోగ్య చరిత్ర, ఇతర ఆర్థిక బాధ్యతలు ఇలాంటి ఎన్నో అంశాలు విశ్లేషించిన తర్వాతే దీనిపై స్పష్టతకు రావడానికి వీలుంటుంది. ఈ విషయంలో నిపుణుల సహాయం తీసుకునేందుకు వెనుకాడకూడదు. చెల్లింపుల సామర్థ్యం పూర్తి స్థాయిలో లేదంటే, ఇంటి కొనుగోలుకు అయ్యే వ్యయంలో ఎక్కువ మొత్తాన్ని సమకూర్చుకున్న తర్వాతే, గృహ రుణం విషయంలో ముందుకు వెళ్లడం ఆర్థిక సౌకర్యాన్నిస్తుంది.

భారం ఎంత తగ్గుతుంది..

- **గృహ రుణం:** రూ.కోటి
- **కాలవ్యవధి:** 20 ఏళ్లు
- **వడ్డీ రేటు:** 8.5 శాతం
- **ఈఎంఐ:** రూ.86,782
- **నికర వడ్డీ చెల్లింపు:** 1.08 కోట్లు
- **ఉదాహరణ:** మూడేళ్ల తర్వాత నుంచి నెలవారీ రూ. 20వేలు అదనంగా చెల్లించడం/మూడేళ్ల తర్వాత నుంచి ఏటా ఒకేసారి రూ. 2 లక్షల చొప్పున చెల్లించడం/ఏడేళ్ల తర్వాత ఒకే విడత రూ.20 లక్షలు జమ చేయడం
- **నికర వడ్డీ భారం:** రూ.77.67 లక్షలు/ రూ.79.39 లక్షలు/రూ.79.45లక్షలు
- **ఆదా అయ్యే వడ్డీ:** రూ.30.63 లక్షలు/ రూ.28.91లక్షలు/రూ.28.85 లక్షలు
- **రుణం ముగింపు కాలం:** 14ఏళ్లు/15ఏళ్లు/15ఏళ్లు



హౌసింగ్ డాట్ కామ్ ద్వారా వ్యక్తిగత రుణాలు

ఫిన్బాక్స్తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ప్రాపర్టీ టెక్నాలజీ సంస్థ 'హౌసింగ్ డాట్ కామ్' ఫిన్బాక్స్ భాగస్వామ్యంతో వ్యక్తిగత రుణాలను ఆఫర్ చేయనున్నట్టు ప్రకటించింది. రూ.10 లక్షల వరకు రుణాలను తక్షణమే జారీ చేయనున్నట్టు తెలిపింది. రెంటల్ సెక్యూరిటీ డిపాజిట్, ఇంటి నవీకరణ, ఫర్నిచర్ కొనుగోలు అవసరాలను తీర్చేందుకు గాను కస్టమర్లకు రుణ సాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొంది. మరింత సౌకర్యవంతంగా డిజిటల్ రూపంలో రుణాల మంజూరుకు గాను ఈ సేవను తన యాప్, వెబ్సైట్తో అనుసంధానించనున్నట్టు ప్రకటించింది. హౌసింగ్ ఎడ్జ్ ద్వారా కస్టమర్లు ఈ సేవను పొందొచ్చని తెలిపింది. సంక్లిష్టమైన రుణ దరఖాస్తులకు కాలం చెల్లిపోయిందని, మొత్తం రుణ దరఖాస్తు ప్రక్రియను ఆన్లైన్లోనే 3 నిమిషాల్లోనే పూర్తయ్యేలా ఏర్పాటు చేసినట్టు హౌసింగ్ డాట్ కామ్ గ్రూప్ సీఈవో ధ్రువ్ అగర్వాల్ తెలిపారు. దరఖాస్తు ఆమోదం పొందిన 24 గంటల్లోనే రుణాన్ని మంజూరు చేయనున్నట్టు చెప్పారు. ఇళ్లకు సంబంధించి అన్ని అవసరాలను అందించే ఏకీకృత వేదికగా అవతరించడమే తమ లక్ష్యమని తెలిపారు.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-7-2023	
విశాఖ	475-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
16-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	450-00
వరంగల్	452-00
రిటైల్ ధర	5.10

మహానగర్ గ్యాస్ | సీడీ ఈక్విసెర్చ్ ప్రయివేట్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,081 **టార్గెట్:** రూ. 1,306

ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం గెయిల్ ఇండియా ప్రమోట్ చేసిన మహానగర్ గ్యాస్ లిమిటెడ్ గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో 303.49 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల(ఎస్సీఎం) గ్యాస్ను విక్రయించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన 285.26 మిలియన్ ఎస్సీఎం అమ్మకాలతో పోలిస్తే ఇది 6.4 శాతం అధికం. తాజా(క్యూ4) అమ్మకాలలో సీఎన్జీ 5.8 శాతం, పీఎన్జీ 7.8 శాతం చొప్పున వృద్ధి చూపాయి. ఈ క్యూ4లో మొత్తం ఆదాయం 48 శాతానికిపైగా జంప్చేసి రూ. 1,610 కోట్లను అధిగమించింది. దీనిలో సీఎన్జీ బిజినెస్ ఆదాయం 62 శాతం దూసుకెళ్లి రూ. 1,138 కోట్లను తాకగా.. పీఎన్జీ విభాగం నుంచి 23 శాతం అధికంగా రూ. 464 కోట్లు(గతంలో రూ. 377 కోట్లు) లభించింది. అంతక్రితం ఏడాది క్యూ4లో ఈ రెండు విభాగాల మొత్తం ఆదాయం కేవలం రూ. 1,087 కోట్లుగా నమోదైంది. కాగా.. కంపెనీ ప్రధానంగా సిటీ గ్యాస్ పంపిణీ(సీజీడీ) రంగంపైనే దృష్టి సారించింది. సీజీడీలో అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తోంది. గ్యాస్ పంపిణీ నెట్వర్క్ను విస్తరించడం ద్వారా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవాలని చూస్తోంది. ఏడాదిలో 30–40 స్టేషన్లను జత చేసుకోవాలని ఆశిస్తోంది. రాయ్గఢ్ జిల్లాలో విస్తరణ ద్వారా పీఎన్జీ నెట్వర్క్కు జోష్ లభించనున్నట్లు కంపెనీ విశ్వసిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ప్రత్యక్ష బిడ్డింగ్, వ్యూహాత్మక భాగస్వామ్యాలు తదితర ప్రణాళికల ద్వారా అమ్మకాలలో 5.5 శాతం పురోగతిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



హీరో మోటోకార్ప్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,138 **టార్గెట్:** రూ. 3,475

ఎందుకంటే: ద్విచక్ర వాహన రంగ దేశీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయ దిగ్గజం హార్లే డేవిడ్సన్(హెచ్డీ)తో చేతులు కలపడం ద్వారా రూపొందించిన తొలి ప్రొడక్టును ఇటీవల విడుదల చేసింది. ఎక్స్440 బ్రాండుతో హైఎండ్ బైక్ను ప్రవేశపెట్టింది. జైపూర్లోగల ఇన్నొవేషన్ టెక్నాలజీ కేంద్రం(సీఐటీ) ద్వారా అభివృద్ధి చేసిన ఈ బైక్తో 400 సీసీ విభాగంలో కంపెనీ తొలిసారి అడుగు పెట్టింది. సుప్రసిద్ధ హార్లే డేవిడ్సన్ బైకుల మోడళ్లను పోలిన ఎక్స్440ను మూడు వేరియంట్లలో విడుదల చేసింది. డెనిమ్, వివిడ్, ఎస్ బ్రాండ్లతో వీటిని ప్రవేశపెట్టింది. వీటి ఎక్స్షోరూమ్ ధరలు రూ. 2.29 లక్షల నుంచి రూ. 2.69 లక్షల మధ్యలో నిర్ణయించింది. కంపెనీకి రాజస్తాన్లో గల నీమ్రాణా ప్లాంటులో వీటిని రూపొందిస్తోంది. దేశవ్యాప్తంగా హార్లే డేవిడ్సన్ డీలర్ నెట్వర్క్ ద్వారా విక్రయిస్తోంది. వెరసి హెచ్డీ బ్రాండులో ఎక్స్440 బైక్ను అత్యంత ఆకర్షణీయ స్థాయిలో రూ. 2.29 లక్షల ప్రారంభ ధర వద్ద విడుదల చేయడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకోగలుగుతోంది. అయితే పేపర్మీద చూస్తే బైక్ అన్ని అంశాలలోనూ అత్యంత విజయవంతమైనట్లే కనిపిస్తున్నప్పటికీ.. మార్కెట్లో కస్టమర్ల నుంచి అసలు స్పందన(ఫీడ్బ్యాక్) రావలసి ఉంది. ఇందుకు కొంతసమయం వేచి చూడవలసి ఉంటుంది. కాగా.. తదుపరి కాలంలో తాజా ప్లాట్ఫామ్ ద్వారా హీరో మోటో బ్రాండ్ బైకులు సైతం వెలువడనున్నాయి. ద్విచక్ర వాహన విభాగంలో దేశీయంగా డిమాండ్ రికవరీ బాటలో ఉంది. ప్రధానంగా 100 సీసీ విభాగంలో పట్టున్న కంపెనీకి పట్టణాల నుంచి కనిపిస్తున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాలలోనూ కొనసాగవలసి ఉంది.




మిరే అసెట్ నుంచి నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్



హైదరాబాద్: మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) ప్రకటించింది. ఇది జూలై 18 వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయాలి. ఏక్తా గాలా దీనికి ఫండ్ మేనేజరుగా ఉంటారు. 12 టాప్ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులను ఇది ట్రాక్ చేస్తుంది. రాబోయే రోజుల్లో మరింతగా వృద్ధి చెందనున్న బ్యాంకింగ్ రంగంలో ఇన్వెస్ట్ చేసేందుకు, మెరుగైన రాబడులు పొందేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ హెడ్ (ఈటీఎఫ్ ప్రోడక్ట్) సిద్ధార్థ్ శ్రీవాస్తవ తెలిపారు. మొండి బాకీల సమస్యను వదుల్చుకున్న బ్యాంకింగ్ రంగం గత కొన్నాళ్లుగా మెరుగైన పనితీరు కనపరుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఫిన్టెక్ విప్లవంతో ఈ రంగం మరింత వృద్ధి చెందగలదని చెప్పారు.

రూపాయి ముఖ విలువను విభజించొచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 59 ఏళ్లు. నేను పదవీ విరమణ తీసుకున్నప్పటికీ, నా పీఎఫ్ ఖాతాలో ఉన్న బ్యాలన్స్ను ఉపసంహరించుకోలేదు. అయినప్పటికీ నా పీఎఫ్ బ్యాలన్స్పై వడ్డీ జమ అవుతూనే ఉంటుందా?

– నానీ పార్థీ

పదవీ విరమణ అనంతరం, పీఎఫ్ ఖాతాకు వరుసగా మూడేళ్ల పాటు ఎలాంటి చందాలు జమ అవ్వకపోతే, అప్పుడు ఆ ఖాతా ఇన్ఆపరేటివ్గా మారిపోతుంది. అక్కడి నుంచి ఇక వడ్డీ జమ అవ్వడం కూడా నిలిచిపోతుంది. అంటే పదవీ విరమరణ తర్వాత మూడేళ్ల పాటే వడ్డీ జమ అవుతుంది. పదవీ విరమణ అనంతరం భవిష్యనిధి ఖాతాలోని బ్యాలన్స్ను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు. ఐదేళ్ల సర్వీసు నిండిన తర్వాత ఉపసంహరించుకునే పీఎఫ్ బ్యాలన్స్ మొత్తంపై పన్ను ఉండకపోవడం అదనపు ప్రయోజనం. మరొక ముఖ్య విషయం ఏమిటంటే, రిటైర్మెంట్ తర్వాత పీఎఫ్ బ్యాలన్స్ను వెనక్కి తీసుకోకపోతే, జమయ్యే వడ్డీ మొత్తం పన్ను పరిధిలోకి వస్తుంది. కనుక పీఎఫ్ బ్యాలన్స్ను ఉపసంహరించుకుని, మీ లక్ష్యాలు, రాబడుల ఆకాంక్షలకు అనుగుణంగా వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది.

ఏదైనా ఒక కంపెనీ షేరు ముఖ విలువ రూపాయి ఉంటే దాన్ని ఎలా విభజిస్తారు? వారి ముందున్న ఆప్షన్లు ఏంటి?

– అరుణ్ పాలస్

మన దేశంలో ఒక షేరు కనిష్ఠ ముఖ విలువ రూ.1గా ఉంది. దీని ప్రకారం ఒక షేరు ముఖ విలువ రూపాయిగా ఉంటే, దాన్ని విభజించడానికి అవకాశం ఉండదు. ఒక కంపెనీ ముఖ విలువను విభజించడం వెనుక ఉద్దేశ్యం ఆయా కంపెనీ షేర్ల లిక్విడిటీని (అందుబాటు) పెంచడమే. షేరు ధరను విభజించడం వల్ల మూలధనంలో ఎలాంటి మార్పు ఉండదు. కనుక ఒక ఇన్వెస్టర్గా ముఖ విలువను విభజించే విషయంలో పొందే ప్రయోజనం ఏమీ ఉండదు. అలాగే, నష్టపోయేదీ ఉండదు. ఉదాహరణకు ఎక్స్వైజెడ్ అనే కంపెనీ షేరు మార్కెట్ ధర రూ.100 ఉందనుకుందాం. మార్కెట్లో 50,000 వేల షేర్లు ఉన్నాయి. మిస్టర్ ఏ రూ.5,000 పెట్టి ఈ కంపెనీలో 50 షేర్లను కొనుగోలు చేశాడు. ఆ తర్వాత కంపెనీ 5:1 స్టాక్ స్ప్లిట్ను ప్రకటించింది. అంటే ప్రతి ఒక్క షేరు ఐదు షేర్లుగా విభజించనున్నారు. విభజన తర్వాత మిస్టర్ ఏ వద్దనున్న 50 షేర్ల స్థానంలో 250 షేర్లు జమ అవుతాయి. అప్పటి వరకు రూ.10గా ఉన్న ముఖ విలువ రూ.2గా మారుతుంది. విభజన తర్వాత షేరు మార్కెట్ ధర కూడా రూ.100 నుంచి రూ.20కు సవరణ అవుతుంది. 250 షేర్లు, రూ.20 చొప్పున వాటి మొత్తం మార్కెట్ విలువలో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ఒక కంపెనీ షేరు ముఖ విలువను విభజిస్తుందా, లేదా? అన్నది ముఖ్యం కాదు. స్టాక్ ముఖ విలువ విభజన అంచనా ఆధారంగా పెట్టుబడులు పెట్టకూడదు. స్టాక్స్లో పెట్టుబడులు పెట్టేందుకు తగినంత సమయం, కృషి అవసరం. ఒక కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి ముందు వ్యాపార నమూనా, ఆర్థిక మూలాలు, యాజమాన్యం సమర్థత, కార్యకలాపాలను నైతికంగా నిర్వహిస్తున్నారా? వృద్ధి అవకాశాలు, వ్యాల్యూషన్ సహేతుక స్థాయిలోనే ఉందా? పోటీ కంపెనీలతో పోలిస్తే మెరుగైన పనితీరు చూపించగలదా? తదితర అంశాల ఆధారంగానే నిర్ణయం తీసుకోవడం సూచనీయం.

హెచ్బిట్స్ ఆల్టర్నేటివ్ ఫండ్కు సెబీ ఆమోదం



న్యూఢిల్లీ: అంకుర సంస్థ హెచ్బిట్స్ ప్రతిపాదిత రూ. 500 కోట్ల ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్కు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతినిచ్చింది. ఈ ఫండ్ద్వారా సేకరించిన నిధులను కమర్షియల్ రియల్ ఎస్టేట్పై ఇన్వెస్ట్ చేయనున్నట్లు హెచ్బిట్స్ వెల్లడించింది. ఈ పెట్టుబడులపై ఇన్వెస్టర్లు 18–20 శాతం మేర రాబడులు అందుకునే అవకాశం ఉందని పేర్కొంది. మే నెలాఖరున సెబీ నుంచి అనుమతి లభించిందని, ప్రస్తుతం ఫ్యామిలీ ఆఫీస్లు, అత్యంత సంపన్నులు, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, ఇంటర్నేషనల్ ఫండ్స్ నుంచి నిధులు సమీకరిస్తున్నామని వివరించింది. ప్రస్తుతం హెచ్బిట్స్ తొమ్మిది ప్రాపర్టీలవ్యాప్తంగా రూ. 220 కోట్ల అసెట్స్ను నిర్వహిస్తోంది. 50,000 మంది పైచిలుకు రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు.

తెలంగాణ

కార్టూనిస్టు శంకర్‌కు శేఖర్ మెమోరియల్ అవార్డు ప్రదానం



శంకర్‌కు అవార్డు ఇస్తున్న అల్లం నారాయణ

లక్డీకాపూల్(హైదరాబాద్): ప్రముఖ కార్టూనిస్టు పామర్తి శంకర్.. కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్‌కు ఈ అవార్డును తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాస్ట్ క్యాన్సర్ పేరుతో కార్టూనిస్టు శేఖర్ చివరిరోజుల్లో తీసుకువచ్చిన పుస్తకం ఎప్పటికీ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ.. కార్టూనిస్టుల బొమ్మల ద్వారా తానెంతో రాజకీయ చైతన్యం పొందానని అన్నారు. శేఖర్, శంకర్‌లు తనకిష్టమైన కార్టూనిస్టులని చెప్పారు. అవార్డు గ్రహీత కార్టూనిస్టు శంకర్ మాట్లాడుతూ తనకు బొమ్మలు ఎలా వేయాలి, ఏ పెన్ను వాడాలి, ఏ ఇంకు వాడాలి... ఇలాంటి విషయాలన్నీ శేఖరే నేర్పించారని, ఆయన పేరిట ఉన్న అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

నీటిపారుదల రంగంలో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడి

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్



రాయదుర్గం (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం నీటిపారుదల రంగంలో 240 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెడుతోందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని టీ హబ్‌లో జిటో ఇంక్యుబేసన్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (జేఐఐఎఫ్) రెండు రోజులుగా నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సమ్మేళనం, వ్యవస్థాపకుల దినోత్సవాల్లో ఆదివారం ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆనకట్ట పునరుద్ధరణ కార్యక్రమాన్ని, భూగర్భజల స్థాయిని పునరుద్ధరించడానికి కార్యాచరణ, నదుల అనుసంధానం చేపట్టామని తెలిపారు. వ్యవసాయరంగంలో తలసరి నీటి వినియోగం ఏడాదికి 4,913 నుంచి 5,800 కిలోలీటర్ల వరకు ఉంటుందని, ఇది ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువన్నారు.

18న ఇందిరాపార్కు వద్ద జేఎన్‌జే సొసైటీ మహాధర్నా

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తుదితీర్పు మేరకు జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జే మ్యాక్ హెచ్‌ఎస్)కి పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేయాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ(మంగళవారం)న హైదరాబాద్ ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నారు. మహాధర్నాకు మద్దతుగా వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నట్లు జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ఫౌండర్ మెంబర్ పీవీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్ - యూఎస్ విమానాలు ఏర్పాటు చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ నుంచి నేరుగా అమెరికాకు విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి యూఎస్‌ఏ ఎన్నారైలు వినతిపత్రం సమర్పించారు. అమెరికాలో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డిని తెలుగు ఎన్నారైలు కలిశారు. వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం కోసం ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ మరింత ఎదుగుతుందని పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా ప్రవాసుల కోరిక నెరవేరేలా చూస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

దంపతులను వెంటాడిన మృత్యువు!

లక్సెట్టిపేట: మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో కబళిస్తుందో ఎవరికీ తెలియదు. కొన్ని ఘటనలు జరిగినప్పుడు పగబట్టినట్లే అనిపిస్తుంది. ఇలాంటి ఘటనే మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో శనివారం రాత్రి జరిగింది. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన శరణ్య (28), మల్లికార్జున్ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. మల్లికార్జున్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల శరణ్య, పక్కింటి మహిళ గొడవపడ్డారు. తనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెందిన శరణ్య ఈనెల 13వ తేదీన పురుగుమందు తాగింది. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె భర్త మల్లికార్జున్ ఆ రోజు రాత్రే మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి పంపించి, తన బంధువుతో బైక్‌పై బయల్దేరాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో లక్సెట్టిపేట ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మూత్రవిసర్జన కోసం బైక్ ఆపాడు. రోడ్డు దాటుతుండగా రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు.

బడిలో 'బైలింగ్యువల్' భళా!

ఉర్దూ, కన్నడ, తమిళం, ఒడియా మీడియం స్కూళ్లలో ద్విభాషా పాఠ్య పుస్తకాలు

ఏపీలో నాలుగు మైనర్ భాషల విద్యార్థులు 85,469 మంది

మైనర్ భాషలకు గుర్తింపునిచ్చిన ఏకైక రాష్ట్రంగా కేంద్రం కితాబు

గుంటూరు చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 545 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గతేడాదితో పోలిస్తే 40 మంది పెరిగారు. ప్రవేశాలు ఇంకా నమోదవుతున్నాయి. గతంలో ఇక్కడ ఉర్దూ మీడియం మాత్రమే ఉండగా ఇప్పుడు ఇంగ్లిష్‌లోనూ బోధిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు ఇంగ్లిష్–ఉర్దూలో ఉండడంతో ఆంగ్ల భాషను సులభంగా ఆకళింపు చేసుకుంటున్నారు. నగరంలోని రెండు ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలల్లో ఇదే పరిస్థితి. ఇటీవల ప్రభుత్వం సమకూర్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల ద్వారా మరింత మెరుగ్గా బోధన కొనసాగుతోంది.



గుంటూరు నుంచి నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి:

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సంస్కరణలు చేపట్టి విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలుగేతర మాతృభాష విద్యార్థులు సైతం చదువుల్లో రాణించేలా బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను రూపొందించింది. రెండో అధికార భాషకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ 5,286 ఉర్దూ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 62,777 మంది విద్యార్థులకు బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్‌ను సమకూర్చింది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని స్కూళ్లలో చదివే విద్యార్థుల సౌలభ్యం కోసం కన్నడ, తమిళం, ఒడియా భాషల్లో బైలింగ్యువల్ పుస్తకాలను ముద్రించి అందిస్తోంది.

నాలుగు మైనర్ భాషల్లో 85,469 మంది

బడికెళ్లే వయసున్న ప్రతి చిన్నారి చదువుకోవాలన్న సంకల్పంతో తెలుగేతర మాతృభాషల విద్యార్థులను సైతం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తమిళం మాతృభాషగా ఉన్న 1,316 మంది విద్యార్థుల కోసం బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను ముద్రించారు. ఒడియా మాధ్యమంలో 8,599 మంది, కన్నడలో 10,485 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న వీరి కోసం కూడా ప్రభుత్వం బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్ అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ, కన్నడ, ఒడియా, తమిళం భాషల్లో 85,469 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. దేశంలో మైనర్ భాషల్లో బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్‌ను అందుబాటులోకి తెచ్చిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కేంద్ర విద్యాశాఖ ప్రశంసలు అందుకుంది.

కచ్చితంగా మెరుగైన ఫలితాలు..



గతంలో సైన్స్ పాఠం ఎన్నో ఉదాహరణలతో చెప్పినా చాలామందికి అంతుబట్టేది కాదు. విద్యార్థులు ఎవరికి తోచినట్లు వారు ఊహించుకునేవారు. ఇప్పుడు ఐఎఫ్‌పీ స్క్రీన్లు వచ్చాక ప్రతి అంశాన్ని విపులంగా ఆడియో, వీడియో రూపంలో చెప్పగలుగుతున్నాం. విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటున్నారు. కచ్చితంగా మెరుగైన ఫలితాలు వస్తాయి. మౌలిక సదుపాయాల విషయంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చింది. గతంలో మరుగుదొడ్లు లేక బాలికలు చదువులకు దూరమైన సందర్భాలున్నాయి. ఇప్పుడు అన్ని వసతులు ఉండడంతో గౌరవంగా చదువుకుంటున్నారు.

– డి.యల్లమందరావు (ఫిజిక్స్ ఉపాధ్యాయుడు), ప్రభుత్వ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాల, గుంటూరు

వేగంగా అద్భుతమైన మార్పులు..



గతంలో ఉర్దూ మీడియం విద్యార్థులు అదే భాషలో రాసేవారు. ఇప్పుడు బైలింగ్యువల్ పుస్తకాలు ఉర్దూ–ఇంగ్లిష్‌లో ఉండడంతో బోధన, అర్థం చేసుకోవడంలో చాలా మార్పులు వచ్చాయి. ఇటీవల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడంతో ప్రతి అంశాన్ని చక్కగా గ్రహించి ఇంగ్లిష్‌లోనే నోట్స్ రాస్తున్నారు. తక్కువ సమయంలోనే అద్భుతమైన మార్పు వచ్చింది.

– అబ్దుల్ కయ్యూమ్, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాల, గుంటూరు

ఇప్పుడెంతో బాగుంది..



మా ఇంట్లో మాకంటే ముందు చదువుతున్న వారు పుస్తకాలు కొనేందుకు చాలా ఇబ్బంది పడేవారు. మాకు అలాంటి పరిస్థితి లేదు. బ్యాగు నుంచి పుస్తకాలు, యూనిఫారం వరకు అన్నీ ప్రభుత్వమే ఇస్తోంది. మధ్యాహ్నం మంచి భోజనం పెడుతున్నారు. వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉన్నాయి. బడిలో దేనికీ లోటు లేదు. కొత్తగా ఐఎఫ్‌పీ స్క్రీన్లతో పాఠాలు చెప్పడం ఎంతో బాగుంది.

– మహ్మద్ తనాజ్, పదో తరగతి విద్యార్థిని, ప్రభుత్వ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాల, గుంటూరు

పవన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.2.64

- 11 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు డిస్కంలు చెల్లించాల్సిన ధర ఇదే
- అనుమతినిచ్చిన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి
- ఆ తరువాత ఉత్పత్తి, పంపిణీ సంస్థల పరస్పర అంగీకారంతో టారిఫ్
- మెగావాట్‌కు 5 ఎకరాలు చొప్పున తీసుకున్న పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలు
- పీపీఏ గడువు ముగిసేనాటికి భారీగా పెరగనున్న భూముల ధరలు
- దీనితో పాటు రాష్ట్రంలో పెరుగుతున్న ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని టారిఫ్ నిర్ణయం

సాక్షి, అమరావతి: పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చెల్లించాల్సిన టారిఫ్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఖరారు చేసింది. ఉత్పత్తి సంస్థలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకుని పదేళ్లు దాటిన తరువాత యూనిట్ రూ.2.64 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. 11వ సంవత్సరం నుంచి 20 ఏళ్ల వరకు ఇదే టారిఫ్ వర్తిస్తుందని తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. 2,100 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులకు చెందిన 22 పీపీఏలకు ఆ సంస్థలు సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరం ఏపీఈఆర్‌సీ ఈ టారిఫ్‌ను నిర్ణయించింది. అదే విధంగా ప్రాజెక్టు జీవితకాలాన్ని 25 ఏళ్లుగా సంస్థలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. కానీ దానిని 30 ఏళ్లుగా ఏపీఈఆర్‌సీ పరిగణించింది. ప్రాజెక్టు ఏర్పాటుకు మెగావాట్‌కు ఐదెకరాల చొప్పున ఆ సంస్థలు ప్రభుత్వం నుంచి భూములు తీసుకున్నాయి. పీపీఏ గడువు ముగిసేనాటికి వాటి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని ఏపీఈఆర్‌సీ అంచనా వేసింది. దానిని పరిగణనలోకి తీసుకుని యూనిట్ ధరను ఖరారు చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

మీరు అడిగినంత ఇవ్వలేం

మొదటి పది సంవత్సరాలకు యూనిట్‌కు రూ.3.43 చెల్లించాలని గతంలోనే ఏపీఈఆర్‌సీ ఆదేశాలిచ్చింది. అయితే ప్రస్తుత మార్కెట్ ధరల మేరకు 11 ఏళ్లు దాటిన తరువాత 20 ఏళ్ల వరకూ యూనిట్‌కు రూ.3.50 టారిఫ్ సెట్ చేయాలని పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఏపీఈఆర్‌సీని కోరాయి. ఏపీఈఆర్‌సీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. పవన విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి మొదటి పదేళ్ల టారిఫ్ రూ.3.43గా నిర్ణయించామని, ఆ సమయంలో సుంకం కూడా యూనిట్‌పై రూ.2.4 తగ్గించామని, కానీ ఇప్పుడు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినందున ఆ ధరలే ఇవ్వమనడం కుదరదని తేల్చి చెప్పింది. 11 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.2.64గా నిర్ధారించింది. 20 ఏళ్లు దాటిన తరువాత పీపీఏలను రద్దు చేసుకునేందుకు డిస్కంలకు అవకాశం కల్పించింది. కొనసాగితే విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల పరస్పర అంగీకారంతో టారిఫ్‌ను నిర్ణయించుకోవచ్చని, దానిని కమిషన్‌కు నివేదించి ఆమోదం పొందాలని సూచించింది.

వృద్ధికి అనుగుణంగా..

పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 10,785.51 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. ఈ మొత్తంలో పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4096.65 మెగావాట్లు. గతేడాది దేశవ్యాప్తంగా 8 శాతం పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే మన రాష్ట్రంలో 9.8 శాతం పెరిగింది. అంటే జాతీయ స్థాయిలో వృద్ధి కంటే 1.8 శాతం ఎక్కువగా ఏపీలో పెరుగుదల నమోదు చేసుకుంది. వాతావరణ మార్పులకు ప్రభుత్వ చర్యలు తోడవడంతో ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయొరాలజీ (పూణె)కి చెందిన పరిశోధకులు వారి అధ్యయనంలో వెల్లడించారు. అంతేకాదు రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలపై గాలి సామర్థ్యం పెరుగుతున్నట్లు 'కపుల్డ్ మోడల్ ఇంటర్–కంపారిజన్ ప్రాజెక్ట్ (సీఎంఐపీ) ప్రయోగాల్లో తేలింది. ఈ నేపథ్యంలో దీర్ఘకాల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు (పీపీఏ)తో ఆర్థికంగా కుదేలవుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు ఊరట కలిగిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) పవన విద్యుత్ ధరలను నిర్ణయించింది.

జేఎన్‌టీయూ–ఏలో 8 మంది ప్రొఫెసర్ల తొలగింపు

- 2017, 2018 నోటిఫికేషన్లు రద్దు చేసిన హైకోర్టు
- హైకోర్టు ఆదేశాల మేరకు ప్రొఫెసర్లను తొలగిస్తూ ఉత్తర్వులు



గత ప్రభుత్వ హయాంలో అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఎనిమిది మంది ప్రొఫెసర్లను విధుల నుంచి తొలగించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వర్సిటీ పాలకమండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి 2017, 2018 సంవత్సరాల్లో జారీచేసిన నోటిఫికేషన్లను హైకోర్టు మూడు రోజుల కిందట రద్దు చేసింది. ఈ తీర్పును అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా 22 మంది ప్రొఫెసర్లు ఉద్యోగాలు కోల్పోగా... వారిలో జేఎన్‌టీయూ–ఏలో ఎనిమిది మంది ఉన్నారు. ప్రొఫెసర్లు వెంకటేశ్వరరావు (ఈఈఈ– కలికిరి క్యాంపస్), నాగప్రసాద్ నాయుడు (మెకానికల్– కలికిరి), నీరజ నాయుడు (సివిల్–కలికిరి), నసీనా (సీఎస్ఈ–కలికిరి), సుభాష్ (ఈసీఈ–కలికిరి), చంగల్‌రాజు (మేథమేటిక్స్–కలికిరి), రమణారెడ్డి (ఈసీఈ–పులివెందుల), నగేష్ (ఈఈఈ–పులివెందుల)లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ప్రొఫెసర్ సుభాష్ ఇటీవలే ఉద్యోగ విరమణ చేయడం గమనార్హం. ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు జేఎన్‌టీయూ కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఆయనను విధుల నుంచి తొలగించడంతో తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా జేఎన్‌టీయూ–ఏ రిజిస్ట్రార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

జేఎన్‌టీయూ–ఏలో గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టలేదు. విధివిధానాలు, నియమనిబంధనలు నోటిఫికేషన్‌లో సక్రమంగా పొందుపరచకుండానే భర్తీ ప్రక్రియ చేపట్టారు. హడావుడిగా నోటిఫికేషన్లు జారీ చేసి 2019, జనవరిలో ప్రొఫెసర్ పోస్టుల నియామకాలు చేపట్టారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రొఫెసర్ పోస్టుల భర్తీతో తప్పిదాలు జరిగాయని హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. పీహెచ్‌డీ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉంటేనే ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు. ఈ నిబంధన పాటించకుండా ఏకంగా ముగ్గురికి ప్రొఫెసర్ పోస్టులు కట్టబెట్టారు. మిగిలిన వారి విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగింది. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి.. వెంటనే వారిని తొలగించాలని ఆదేశించింది. దీంతో శనివారం వర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించి ఎనిమిది మందిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటి వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.



సూర్యలంక బీచ్



పేరుపాలెం బీచ్

363 బీచ్‌లు

కోస్తా తీరానికి కొత్త అందాలు

- మరో 8 బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు కూడా
- చేపల ఉత్పత్తికి ఇబ్బంది లేని ప్రాంతాల గుర్తింపు

సాక్షి, అమరావతి: బీచ్ పర్యాటకంతో కోస్తా తీరానికి కొత్త కళ చేకూరనుంది. 12 జిల్లాల్లో కోస్తా తీరం వెంట 363 బీచ్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫిషరీస్ యూనివర్సిటీ, పర్యాటక శాఖ, మత్స్యశాఖలతో కూడిన 11 బృందాలు కోస్తా తీరం వెంట సర్వే చేసి ఎక్కడెక్కడ బీచ్‌లను అభివృద్ధి చేయవచ్చో గుర్తించాయి. ఆయా ప్రాంతాల్లో కోస్టల్ జోన్ టూరిజం పేరుతో మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేస్తారు. చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలగకుండా పర్యావరణానికి అనుకూలంగా బీచ్‌లను తీర్చిదిద్దనున్నారు. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ చట్ట ప్రకారం బీచ్‌లకు అనుమతి కోసం పర్యాటక శాఖ కలెక్టర్లకు నివేదిక పంపించింది. బీచ్‌ల అభివృద్ధిపై ఇటీవల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. మత్స్యకారులతో పాటు టూరిజం ఆపరేటర్లను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచి బీచ్‌లను ఖరారు చేసి పర్యాటక అథారిటీకి వివరాలు పంపాలని సూచించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో67 బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు.

బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు

- మంగినపూడి (కృష్ణా జిల్లా)
- పేరుపాలెం, మొల్లపర్రు (పశ్చిమ గోదావరి జిల్లా)
- కాకినాడ (కాకినాడ జిల్లా)
- మైపాడు (నెల్లూరు జిల్లా)
- సూర్యలంక, రామాపురం (బాపట్ల జిల్లా)
- చింతలమోరి (బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా)

బ్లూ ఫ్లాగ్ బీచ్ అంటే..?

బ్లూ ఫ్లాగ్ బీచ్ అంటే 33 ప్రమాణాల ఆధారంగా ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సంస్థ బీచ్‌లను పరిశీలించి ధృవీకరిస్తుంది. పర్యావరణం, స్నానపు నీటి నాణ్యత, నిర్వహణ, భద్రత, సేవలు లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. బీచ్‌లు పరిశుభ్రంగా ఉండాలి. సందర్శకులకు మెరుగైన సేవలను అందించేందుకు అధికారుల కమిటీ, విశేషాలను వివరించేందుకు సిబ్బంది ఉండాలి.

రుషికొండ తరహాలో 8 బ్లూఫ్లాగ్ బీచ్‌లు

విశాఖలోని రుషికొండ తరహాలో మరో ఎనిమిది బ్లూ ఫ్లాగ్ బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేలా మౌలిక వసతులను కల్పించేందుకు భూ కేటాయింపు ప్రతిపాదనలను సీసీఎల్ఏకు పంపాలని సీఎస్ ఆదేశించారు. దేశంలో 10 బ్లూ ఫాగ్ బీచ్‌లుండగా అందులో రుషికొండ చోటు సాధించింది.

కోస్తాలో బీచ్‌ల అభివృద్ధి ఇలా

జిల్లా	బీచ్‌ల సంఖ్య
శ్రీకాకుళం	67
విజయనగరం	14
విశాఖపట్నం	32
అనకాపల్లి	35
కాకినాడ	22
డా.అంబేడ్కర్ కోనసీమ	20
పశ్చిమ గోదావరి	10
కృష్ణా	26
బాపట్ల	33
ప్రకాశం	23
నెల్లూరు	63
తిరుపతి	18
మొత్తం	363



కోస్టల్ జోన్ రెగ్యులేషన్‌కు అనుగుణంగా బీచ్‌ల అభివృద్ధి: కన్నబాబు

కేంద్రం 2019లో విడుదల చేసిన కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్ ప్రకారం బీచ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు తెలిపారు. మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధమైనట్లు చెప్పారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి రాగానే పనులు చేపడతామన్నారు. స్థానికులకు ఉపాధితో పాటు సేవల రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943